www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక
ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్   సంపుటి : 16   సంచిక : 182   శనివారం, మార్చి 28, 2026 , పేజీలు - 12   వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

# కమనీయం..
# సీతారామ కళ్యాణం

- మిథిలా మండపంలో కన్నుల పడువగా కళ్యాణోత్సవం
- పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన సీఎం దంపతులు
- రామనామంతో మార్మోగిన భద్రాద్రి..భారీగా హాజరైన ప్రజలు
- పలువురు మంత్రులు, ప్రముఖుల రాక





**భద్రాచలం,మార్చి 27 :** శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతా రాముల కల్యాణోత్సవం కన్నుల పండువగా కొనసాగింది. వేదపండితుల మంత్రోచ్చా రణలతో రఘురాముడి కళ్యా ణం రమణీ యంగా సాగింది. రాము లవా రిని, సీత మ్మను మిథిలా మండపంలో వేంచేసి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో భద్రాచలం వీధులు రామనామ స్మరణతో మార్మోగాయి. తెలంగాణ ప్రభుత్వం తరఫున స్వామి వారికి సీఎం రేవంత్‌రెడ్డి, గీత దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ కల్యాణోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ భూమిపూజ చేశారు. తొలి విడతలో రూ.351 కోట్లతో చేపట్టే మిగతా2లో...

## అయోధ్యలో అద్భుత ఘట్టం
# ఆవిష్కృతం

- బాలరాముడిపై సూర్యకిరణాలతో తిలకం
- తిలకించి, పులకించిన భక్తజనం



**అయోధ్య,మార్చి 27 :** శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా అయోధ్యలోని భవ్య రామమందిరంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. శుక్రవారం మధ్యాహ్నం సరిగ్గా 12:00 గంటలకు అభిజిత్ ముహూర్తంలో బాలరాముడి నుదుటిపై సూర్య కిరణాలు తిలకంలా మెరిసిపోయాయి. సైన్స్, ఆధ్యాత్మికత కలబోతగా జరిగిన ఈ 'సూర్య తిలకం' వేడుకను చూసి లక్షలాది మంది భక్తులు పులకించి పోయారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ సూర్య తిలక వేడుకను నిర్వహించారు. మధ్యాహ్నం 12:00 గంటలకు ప్రారంభమై సుమారు కొన్ని నిమిషాల పాటు ఈ కాంతి తిలకం రామ్ లల్లాను మిగతా2లో...

## కోర్టుల్లో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలి

- మహిళా జడ్జీల పదోన్నతిపై దృష్టి సారించాలి
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్







## మూడ్రోజుల్లో ఈదురుగాలుల వర్షం

- తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ హెచ్చరిక

## ఇక తెలంగాణ
# ఆడబిడ్డ పార్టీ

- 25న పార్టీ పేరును,జెండాను, ఎజెండాను ప్రకటిస్తా...
- మేడ్చల్ మునీరాబాద్ వేదికగా పార్టీని వెల్లడిస్తా...
- శ్రీరామనవమి రోజు కాబట్టి ప్రకటన చేస్తున్నా...
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటన



**నిజామాబాద్,మార్చి 27 :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10గంటలకు నూతన రాజకీయ పార్టీ స్థాపించబోతున్నట్లు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అధ్వయ కన్వెన్షన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పార్టీ ప్రకటన చేయబోతున్నట్లు చెప్పారు. అదే రోజు పార్టీ పేరు, జెండాను ప్రకటిస్తామన్నారు. శ్రీరామనవమి మంచి రోజు కాబట్టి ఇవాళ ప్రకటన చేస్తున్నట్లు చెప్పారు. యువత, మహిళలకు మా పార్టీలో మంచి స్థానం ఉంటుంది. ఇన్నాళ్లూ మగవాళ్లు ఏర్పాటు చేసిన పార్టీలను చూశారు. తెలంగాణ ఆడబిడ్డగా నేను పార్టీ పెడితే ఎలా ఉంటుందో మీరే చూస్తారని అన్నారు. ఈ మేరకు నూతన రాజకీయ పార్టీపై గతకొంతకాలంగా వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. మిగతా2లో...

## పశ్చిమాసియాలో
# ఘర్షణలు

- హోర్ముజ్ జలసంధి మూసివేత భయాల..?
- తాజా పరిస్థితులపై సిఎంలో ప్రధాని మోడీ చర్చ



**న్యూఢిల్లీ,మార్చి 27 :** పశ్చిమాసియాలో ఘర్షణలు, హోర్ముజ్ జలసంధి మూసివేత భయాల కారణంగా అంతర్జాతీయ సంక్షోభం తలెత్తడంతో రాష్ట్రాల ముఖ్య మంత్రులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇంధన సంక్షోభంపై చర్చించారు. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ, ఎరువుల సరఫరాకు ఎదురవుతున్న సమస్యలు, రాష్ట్రాల సన్నద్ధతను సమీక్షించారు. అసెంబ్లీ ఎన్నికలు ప్రకటించిన రాష్ట్రాల ముఖ్యమంత్రులు మినహా తక్కిన రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. దేశ ఇంధన అవసరాలను తీర్చేందుకు, ఇంధన సరఫరా స్థిరంగా ఉండేందుకు కేంద్రం పలు చర్యలు తీసుకుంటోంది. అయితే క్షేత్రస్థాయిలో అమలు కోసం రాష్ట్రాల సహకారాన్ని మిగతా2లో...

## హైదరాబాద్‌లో
# శ్రీరామనవమి శోభాయాత్ర

- యాత్రను ప్రారంభించిన గవర్నర్ శుక్లా
- బందోబస్తు పర్యవేక్షించిన సిపి సజ్జన్నార్



**హైదరాబాద్,మార్చి 27 :** హైదరాబాద్ నగరంలో శ్రీరామ నవమి శోభాయాత్రను గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రారంభించారు. సీతారాంబాగ్ ఆలయం నుంచి సుల్తాన్ బజార్‌లోని హనుమాన్ వ్యాయామశాల వరకు ఇది కొనసాగనుంది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడారు. ఏళ్ల తరబడి నగరంలో శ్రీరామ శోభాయాత్ర ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. భారతీయ సంస్కృతిలో రామాయణం విశిష్టమైందని.. ఆదర్శ కుమారుడు, ఆదర్శ భర్త, ఆదర్శ పురుషుడిగా శ్రీరాముడిని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఐకమత్యం, భక్తి భావనకు శోభాయాత్ర నిదర్శనంగా నిలుస్తోందని చెప్పారు. శ్రీరామ నవమి సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న రాములోరి కల్యాణాలు, శోభాయాత్రలకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. నల్లకుంటలోని పాత రామాలయంలో ఆయన ప్రత్యేక పూజలు మిగతా2లో...



## తుంగభద్రలో మునిగి
# నలుగురు మృతి

**కర్నూలు,మార్చి 27 :** తుంగభద్ర నదిలో స్నానానికి దిగి నలుగురు మృతి చెందిన దుర్ఘటన శుక్రవారం కర్నూలు జిల్లా కోసిగి ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద జరిగింది. పెండ్లి వేడుకలో పాల్గొనడానికి కర్నాటకలోని మాన్వికి చెందిన 15 మంది రెండు రోజుల క్రితం కందుకూరు గ్రామానికి వచ్చారు. వివాహం ముగిసిన తర్వాత ఈరోజు ఉదయం వారంతా సరదాగా తుంగభద్ర నదిలో స్నానం చేసేందుకు వెళ్లారు. నదిలో దిగిన నలుగురు ఈత రాకపోవడంతో నీటమునిగి మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రజాసేవే లక్ష్యంగా
# ఎన్టీఆర్ ట్రస్ట్ కార్యక్రమాలు

- కుప్పంలో పలువురికి కుట్టుమిషన్లు పంపిణీ



**చిత్తూరు,మార్చి 27 :** కుప్పం నియోజకవర్గంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి పర్యటన కొనసాగుతోంది. శుక్రవారం కుప్పం టీటీడీ కల్యాణ మండపంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మిగతా2లో...

# పశ్చిమాసియాలో ఘర్షణలు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే కోరింది. పశ్చిమాసియాలో పరిస్థితుల ప్రభావం అంతర్జాతీయంగా అన్ని దేశాలపై పడిందని, భారత్‌పైనా ప్రభావం ఉందని ప్రధాని మోదీ పార్లమెంటు ఉభయసభల్లోనూ ప్రకటించారు. కోవిడ్ మహమ్మారిని సమష్టిగా ఎదుర్కొన్నట్టే తాజా పరిస్థితులను కేంద్రం, రాష్ట్రాలు కలిసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. నిత్యావసర వస్తువుల సరఫరాకు ఎలాంటి అవాంతరం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రాష్ట్రాలను కోరారు. టీమిండియా స్పిరిట్‌తో పనిచేసి దేశానికి మారదర్శకంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రులతో మోదీ తాజాగా వర్చువల్ సమావేశంలో పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధానమంత్రి నిర్వహించిన వర్చువల్ మీట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు దేవ్ సాయి, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, జేకే సీఎం ఒమర్ అబ్దుల్లా, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇక తెలంగాణ ఆడబిడ్డ పార్టీ

(మొదటి పేజీ తరువాయి)

ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు కొత్త పార్టీని స్థాపించనున్నట్లు తెలిపారు. మేడ్చల్‌లోని మునీరాబాద్ వద్ద అద్వయ ఫంక్షన్ హాలులో జెండా ఆవిష్కరణ చేస్తామని ప్రకటించారు. ఆ సమయంలోనే పార్టీ పేరును కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలంతా సమయానికి చేరుకోవాలని, ప్రతి గ్రామం నుంచి తరలి రావాలని కవిత పిలుపునిచ్చారు. జయశంకర్ పేరు పెట్టుకుంటామని చెప్పారు. యువతకు, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆడబిడ్డల్లో మార్పు తేవడానికి ఒక ఆడబిడ్డగా ఈ పార్టీని పెడుతున్నానని తెలిపారు. బీసీ బిల్లు సాధించడం తమ వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ రాజకీయాలను శ్రీరాముడి స్ఫూర్తితో గమనించాలని కవిత అన్నారు. 'నేను నిజామాబాద్ బిడ్డను.. నిజామాబాద్ మట్టి మంచిది.. ఇక్కడ తీసుకునే ఏ నిర్ణయమైనా సక్సెస్ అయింది' అని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు సంపూర్ణంగా సాధించలేకపోయామన్నారు. రోజూ ప్రజల అవస్థలు చూస్తున్నామని కవిత వ్యాఖ్యానించారు. కచ్చితంగా ఒక కొత్త రాజకీయ పార్టీ రావాల్సిన అవసరం ఉందన్నారు. అందరూ మెచ్చేలా ఆ పార్టీ ఉండాలని అభిప్రాయపడ్డారు. సర్వోదయ తెలంగాణ రావాలని కవిత పేర్కొన్నారు. మేము ఎవ్వరికీ బీ పార్టీ కాము. మాది నంబర్ వన్ పార్టీ అవుతుంది. శ్రీరాముడి స్ఫూర్తితో, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని పని చేస్తాం. ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. 95 శాతం తెలంగాణ ప్రాంతీయ పార్టీగా, ఇంటి పార్టీగా రాబోతోంది. ప్రజా సమస్యలపై వెంటపడి అడగాలి. ఎంపీ అర్వింద్ మతిమరుపు నాయకుడు. రైల్వే ఓవర్ బ్రిడ్జల జాప్యానికి నేనే కారణం అన్నారు. ఆయన వచ్చాక ఏం చేస్తున్నారు. అవసరమైతే ఢిల్లీలో లాబీ చేస్తా, గల్లీలో పని చేస్తా' అని కవిత స్పష్టం చేశారు.

# కమనీయం..సీతారామ కళ్యాణం

(మొదటి పేజీ తరువాయి)

పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మిథిలా స్టేడియంలోని మండపంలో వేద మంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా శ్రీసీతారాములను పల్లకిలో ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు స్వామివారి కల్యాణ ఘట్టం మొదలైంది. అభిజిత్ లగ్నంలో సీతారామయ్యల శిరస్సుపై ఆలయ అర్చకులు జీలకర్ర, బెల్లం పెట్టారు. ఆపై సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్యధారణ చేశారు. అనంతరం తలంబ్రాల వేడుక నిర్వహించారు. ఆలయ అర్చకులు ఇతర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భద్రాద్రిలో జరుగుతున్న సీతారామయ్య కల్యాణాన్ని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి శ్రీరాముని భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీరామ నామస్మరణతో మిథిలా స్టేడియం ప్రాంగణం మార్మోగింది. సీతారాముల కల్యాణం సందర్భంగా మిథిలా స్టేడియంతో పాటు రామయ్య దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులు భారీగా తరలిరావడంతో.. వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా దేవస్థానం అధికారులు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. లక్షల మంది భక్తులు ఆలయానికి చేరుకుని పెళ్లి వేడుకను కనులవిందుగా తిలకించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగలేటి సహా పలువురు ప్రముఖులు వేడుకలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం బేగంపేట విమానాశ్రయం నుంచి కుటుంబ సమేతంగా సారపాక హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. రోడ్డుమార్గాన భద్రాద్రి రాములవారి ఆలయం వద్దకు వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామిఅమ్మవార్ల వివాహ మహోత్సవానికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉదయం 11:35 నుంచి మధ్యాహ్నం 12:25 వరకు మిథిలా స్టేడియంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సారపాక హెలిప్యాడ్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి బయలుదేరారు.

# పశ్చిమాసియా యుద్ధంతో ఇంధన సరఫరాలో సమస్యలు

- సమస్యలను పర్యవేక్షించేందుకు రాజ్‌నాథ్ నేతృత్వంలో కమిటీ
- పెట్రో ధరలపై ఎక్సైజ్ సుంకే తగ్గించిన కేంద్రం
- పెట్రోల్‌పై రూ.13, డీజిల్‌పై 10 తగ్గిస్తూ ఆదేశం




**న్యూఢిల్లీ,మార్చి 27 :** పశ్చిమాసియాలో యుద్ధంతో దేశంలో గ్యాస్, క్రూడ్ ఆయిల్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో కేంద్ర కీలక నిర్ణయం తీసుకుంది. సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కేంద్ర మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇందులో సభ్యులుగా ఉంటారు. మరోవైపు సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఎలాంటి భారం పడకుండా పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను కేంద్రం తగ్గించింది. పెట్రోల్‌పై సుంకాన్ని లీటరుకు రూ.13 నుంచి రూ.3కు తగ్గించింది. లీటరుకు రూ.10గా ఉన్న డీజిల్ ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా రద్దు చేసింది. హోర్ముజ్ జలసంధి మూసివేత భయాలు, మధ్యప్రాచ్య దేశాల మధ్య కొనసాగు తున్న యుద్ధంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాకు అవాంతరాలు తలెత్తుతున్నాయి. పెరిగిన దిగుమతి వ్యయాన్ని తట్టుకుని చమురు సంస్థల రికవరీకి తాజాగా కేంద్రం తీసుకున్న చర్య ఉపయోగపడుతుంది. మరోవైపు, దేశవ్యాప్తంగా రిటైల్ ఔట్‌లెట్స్ యథాప్రకారం పనిచేస్తున్నాయని, అన్ని పంపుల్లోనూ తగినన్ని పెట్రోల్, డీజిల్ స్టాక్‌లు ఉన్నాయని పెట్రోలియం, నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. వదంతులు నమ్మవద్దని, ప్యానిక్ కొనుగోళ్లకు పాల్పడవద్దని వినియోగదారులను కోరింది. దేశంలో ఇంధన కొరతను అధిగమించేందుకు ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్‌ల ఎగుమతిపై సుంకాన్ని విధించిం ది. అయితే, వీటి ధరలను ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తామని తెలిపింది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ ఛైర్మన్ వివేక్ చతుర్వేది ప్రకటన చేశారు. యుద్ధం కారణంగా ఇంధన సరఫరాలో అంతరాయం, ముడి చమురు ధరలు పెరుగుదలతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నష్టాలను ఎదుర్కొంటున్నాయని వివేక్ చతుర్వేది పేర్కొన్నారు. వీటిని పూడ్చడానికే పెట్రోల్, డీజిల్‌లపై ఎక్సైజ్ డ్యూటీల్లో కోత విధించామన్నారు. వీటివల్ల వినియోగదారులకు నేరుగా ప్రయోజనం చేకూరనప్పటికీ.. చమురు మార్కెటింగ్ కంపెనీలకు ఊరట లభించనుందన్నారు. ఈ చర్యల వల్ల వచ్చే పదిహేను రోజుల్లో రూ. ఏడు వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోతుందన్నారు. మరోవైపు, ఎగుమతులను అరికట్టడానికి డీజిల్, ఏటీఎఫ్‌లపై అదనపు సుంకాలను విధించామని సీబీఐటీ ఛైర్మన్ పేర్కొన్నారు. వీటి వల్ల వచ్చే పదిహేను రోజుల్లో ప్రభుత్వానికి రూ.1500 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. దేశీయంగా డీజిల్, ఏటీఫ్‌లు అందుబాటులో ఉంచడానికే ఈ చర్యలు తీసుకున్నామన్నారు.

# ఇరాన్‌పై దాడులు తీవ్రం

- జానావాసలపై దాడిలో 26మంది మృతి



**టెహ్రాన్,మార్చి 27 :** ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా ఇరాన్‌లోని ఇస్ఫాహాన్‌లో అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. నివాసాలపై దాడి చేయడంతో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్‌లోని ఇస్ఫహాన్ ప్రావిన్స్‌లో అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో కనీసం 26 మంది మరణించినట్లు ఫార్స్ న్యూస్ ఏజెన్సీ నివేదించింది. నివాస ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఈ దాడుల్లో ఏడుగురు మహిళలు, ఏడుగురు చిన్నారులు ఉన్నారని పేర్కొంది.గత నెల 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హతమయ్యాడు. అనంతరం ఇరాన్ ప్రతీకార దాడులు చేసింది. గల్ఫ్ దేశాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దాడులు చేసింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా గ్యాస్, చమురు కష్టాలు మొదలయ్యాయి. ఇక హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. అంతేకాకుండా ఇజ్రాయెల్, అమెరికా మిత్రదేశాలకు చెందిన ఆయిల్ ట్యాంకర్లను విడిచిపెట్టబోమని ఇరాన్ తేల్చి చెప్పింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# అయోధ్యలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకాశింపజేసింది. ఐఐటీ రూర్కీ శాస్త్రవేత్తల నేతృత్వంలో రూపొందించిన ఆప్టో-మెకానికల్ సిస్టమ్ ద్వారా సూర్య కిరణాలు నేరుగా విగ్రహంపై పడేలా ఎలాన్ చేశారు.

ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షిం చేందుకు దేశ విదేశాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంతో పాటు అయో ధ్య అంతటా ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా భక్తులు ఈ వేడుకను ప్రత్య క్షంగా వీక్షిం చారు. సూర్య కిరణం రామ్ లల్లా నుదుటిపై పడగానే భక్తులు 'జై శ్రీరామ్' అంటూ చేసిన నినాదా లతో అయోధ్య నగరం మారుమోగిపోయింది. సూర్యవంశీయుడైన శ్రీరాముడికి సూర్య భగవానుడే స్వయంగా తిలకం దిద్దినట్లుగా ఉన్న ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ అద్భుతం భక్తులకు కనువిందు చేయడమే కాకుండా భారతీయ ఇంజనీరింగ్ నైపుణ్యానికి ప్రతీకగా నిలిచింది.

# కోర్టుల్లో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలి

**న్యూఢిల్లీ,మార్చి 27 :**కోర్టుల్లో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలని, ప్రధానంగా మహిళా జడ్జీల పదోన్నతిపై దృష్టి సారించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు సిజెఐ గతవారం 25 హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకు లేఖ రాశారని సంబంధిత వర్గాలు శుక్రవారం తెలిపాయి. న్యాయవ్యవస్థలో జడ్జీల ఖాళీల భర్తీ విషయాన్ని, ధర్మాసనాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచాల్సిన అవసరముందని లేఖలో పేర్కొన్నారు. ముఖ్యంగా కోర్టుల్లో మహిళా జడ్జీల సంఖ్య తక్కువగా ఉందని అన్నారు. కొలీజియం సిఫారసులను ఆలస్యం చేయవద్దని, ఖాళీ కానున్నాయని తెలిసిన వెంటనే వాటిని భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన జడ్జీలకు సూచించారు.న్యాయరంగంలోని మరింత మంది మహిళలు వచ్చేలా న్యాయవ్యవస్థలో పెద్ద ఎత్తున సంస్థాగత మార్పులు చేపట్టాల్సి వుందని మార్చి8న అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. హైకోర్టు కొలీజియంలు జడ్జీల పదవుల భర్తీ కోసం ప్రతిభావంతులైన మహిళా జడ్జీలను మినహాయించకుండా, వారిని కేటాయించడం ఒక నిబంధనగా పరిగణించాలని అన్నారు. పదోన్నతి కోసం తమ పరిశీలన పరిధిని విస్తృతం చేయాలని, తమ రాష్ట్రాల్లోని, సుప్రీంకోర్టులో న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేస్తున్న మహిళా న్యాయవ్యాదులను కూడా చేర్చుకోవాలని హైకోర్టు జడ్జీలకు సూచించారు. ప్రస్తుతం వివిధ హైకోర్టుల్లో పలువురు మహిళలు ప్రధాన జడ్జీలుగా విధులు నిర్వహిస్తున్నారని, పంజాబ్, హర్యానా హైకోర్టులో 18మంది మహిళా జడ్జీలు ఉన్నారని పేర్కొన్నారు. మద్రాస్, ముంబయి హైకోర్టుల్లో కూడా సుమారు 12మంది మహిళా జడ్జీలు ఉన్నారని ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో పనిచేస్తున్న న్యాయాధికారుల్లో మహిళలు సుమారు 36.3శాతం ఉన్నారని సిజెఐ పేర్కొన్నారు. ఇది ఒక సాధారణ గణాంకం కాదని, ఇది తరాల మార్పును ప్రతిబింబిస్తుందని అన్నారు. వ్యవస్థ పునాదిలోనే ఎక్కువ మహిళా భాగస్వామ్యం ఉన్నప్పుడు, అది అత్యున్నత న్యాయవ్యవస్థలో కూడా త్వరలోనే ప్రతిబింబిస్తుందని అన్నారు.

# మూడ్రోజుల్లో ఈదురుగాలుల వర్షం

**హైదరాబాద్,మార్చి 27 :** వేసవి భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ కాస్త ఉపశమనం కలిగించే వార్తను అందించింది. గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్న ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో రానున్న మూడు రోజుల పాటు వాతావరణం చల్లబడనుందని అంచనా వేసింది. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. తెలంగాణపై ప్రస్తుతం ఉన్న వాతావరణ ద్రోణి ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. మరత్వాడా నుంచి కర్ణాటక తీరం వరకు సముద్ర మట్టానికి సుమారు 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఈ ద్రోణి కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు సంభవించాయి. దీని ఫలితంగా శుక్ర, శని, ఆదివారాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా వర్షం కురిసే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు మెరుపులతో కూడిన జల్లులు పడతాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అయితే.. ఈ ఉపశమనం తాత్కాలికమేనని, వచ్చే వారం నుంచి ఎండల తీవ్రత మళ్లీ పెరిగే అవకాశం ఉందని, సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు అధికం కావచ్చని అధికారులు వెల్లడించారు.

# హైదరాబాద్‌లో శ్రీరామనవమి శోభాయాత్ర

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. అనంతరం సీపీ మాట్లాడారు. నగరంలో దాదాపు 339 ప్రాంతాల్లో శ్రీరామ నవమి సందర్భంగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. సీతారాంబాగ్ నుంచి హనుమాన్ వ్యాయామశాల వరకు సాగే శోభాయాత్రకు 3వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశాం. అనుకున్న సమయానికి శోభాయాత్ర పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకున్నాం. ఇతర పండుగలకు ప్రజలు సహకరించిన విధంగానే శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేలా అందరూ సహకరించాలని సజ్జనార్ కోరారు.

# ప్రజాసేవే లక్ష్యంగా ఎన్టీఆర్ ట్రస్ట్ కార్యక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)

'స్వయం ఉపాధికి చేయూత' కార్యక్రమంలో భువనేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 40 మంది మహిళలకు కుట్టు మిషన్లు, 30 మందికి తోపుడు బండ్లు, పలువురికి వినికిడి మిషన్లను అందజేశారు.ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలను భువనేశ్వరి వివరించారు. ప్రజాసేవే పరమావధిగా ఎన్టీఆర్ పనిచేశారని భువనేశ్వరి తెలిపారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ స్థాపించి 29 సంవత్సరాలు పూర్తయిందన్నారు. చంద్రబాబు రాజకీయాల్లో బిజీగా ఉండటం వల్ల ట్రస్ట్ బాధ్యతలు తనకు అప్పగించారని అన్నారు. చంద్రబాబు అందించిన స్ఫూర్తితో ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు తమ వంతు సాయం అందిస్తున్నామని చెప్పారు. త్వరలోనే విజయవాడ, అనంతపురంలో కూడా తలసేమియా సెంటర్లు ప్రారంభిస్తామని నారా భువనేశ్వరి ప్రకటించారు.

# గొల్లపల్లి కళ్యాణోత్సవంలో పాల్గొన్న కెటిఆర్



**రాజన్న సిరిసిల్ల,మార్చి 27 :** శ్రీరామనవమి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని హనుమాన్ ఆలయంలో సీతారామచంద్రస్వామి కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. సంప్రయాదబద్ధంగా పండితులు కళ్యాణతో వసం నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.రాములోరి కల్యాణోత్సవాలకు హాజరైన సందర్భంగా కేటీఆర్‌కు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు.

# వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

**-"అరైవ్ అలైవ్" కార్యక్రమంలో మొగుళ్ళపల్లి ఎస్ఐ ముప్పు సురేష్**



**మొగుళ్ళ పల్లి ప్రతినిధి మార్చి 27 (పీపుల్స్ న్యూస్):**వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించి, రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మొగుళ్ళపల్లి ఎస్ఐ ముప్పు సురేష్ వాహనదారులకు సూచించారు. శుక్రవారం ఆయన మొగుళ్ళపల్లి మండల కేంద్రంలో "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని నిర్వహించి వాహనదారులకు తగు సూచనలను చేశారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ సురక్షిత ఓవర్ టేకింగ్ పై ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనం నడిపేటప్పుడు వేగ పరిమితులు పాటించడం, వాహనాల మధ్య సురక్షితంగా దూరంగా ఉండడం, ట్రాఫిక్ నియమాలను తప్పకుండా అనుసరించడం అవసరమని తెలిపారు. ఓవర్ టేకింగ్ చేసే సమయంలో ముందున్న రహదారి స్పష్టంగా కనిపిస్తున్నప్పుడు తగినంత స్థలం ఉన్నప్పుడు మాత్రమే ఓవర్ టేకింగ్ చేయాలని, నిర్లక్ష్యంగా అతివేగంగా డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు కారణమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

# భక్తి సంద్రంలో సేవా స్ఫూర్తి... శివ సాయి సంస్థ ఆదర్శం!

**శ్రీరామ నవమి సందర్భంగా భక్తులకు ఉచిత ప్రసాదం -- బెల్లం పానకం, మజ్జిగతో విశేష సేవలు**






**గోదావరిఖని, మార్చి 27 (పీపుల్స్ న్యూస్):**శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని రామగుండం మున్సిపల్ పరిధిలో భక్తి, సేవా కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శివ సాయి మల్టీ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ భక్తులకు సేవ చేయడంలో ముందడుగు వేసింది. శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి పెద్ద ఎత్తున విచ్చేసిన భక్తులకు సంస్థ ఆధ్వర్యంలో బెల్లం పానకం, మజ్జిగతో పాటు వేడివేడి ప్రసాదం పంపిణీ చేసి ఆకట్టుకున్నారు. మండుతున్న ఎండలో భక్తులకు చల్లని పానీయాలు అందించడం ద్వారా విశేష స్పందన పొందారు. భక్తుల సేవే తమ ప్రధాన లక్ష్యమని, ప్రతి పర్వదినాన సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ సేవలను స్వీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సామాజిక సేవలో ఎప్పుడూ ముందుండే శివ సాయి సంస్థ, ఈసారి కూడా శ్రీరామ నవమి సందర్భంగా భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ ప్రజల ప్రశంసలు అందుకుంది.

# డ్రగ్స్ విక్రేతలు, వినియోగదారుల అరెస్ట్.



**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మార్చి 27 (పీపుల్స్ న్యూస్) :** నిషేధిత మాదకద్రవ్యం విక్రయిస్తున్న విక్రేతలతో పాటు వినియోగదారు లను హైదరాబాద్ కమిషనర్స్ టాస్క్ ఫోర్స్ (జూబ్లీహిల్స్ జోన్ టీమ్), సనత్ నగర్ పోలీసులతో కలిసి సంయుక్తంగా అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 60 గ్రాముల ఎండిఎంఎ మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం........ వెంకటరమణ రెడ్డి నగర్ కు చెందిన సోంగపు హేమంత్ (23) , చింతల్ అంబేద్కర్ నగర్ కు చెందిన ముక్కగళ్ల నాగేంద్ర(21) లు పట్టుబడిన నిందితులకు ,. జేసీఎల్‌లకు మద్యం, గంజాయి ఎండీఎంఎ సేవించే అలవాటు ఉంది. ఈ క్రమంలో చింతల్‌లో నివసించే ఆదిత్య , సాయి నిఖిల్ యాదవ్‌లతో ఒక జేసీఎల్‌కు పరిచయం ఏర్పడింది. వారి వద్ద ఎండిఎంఎ డ్రగ్ ఉందని తెలుసుకున్న సదరు జేసీఎల్, వారి వద్ద నుండి తక్కువ ధరకు డ్రగ్ కొనుగోలు చేసి, తెలిసిన కస్టమర్లకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. రెండు రోజుల క్రితం, ఆదిత్య సాయి నిఖిల్ యాదవ్‌ల నుండి 60 గ్రాముల ఎండిఎంఎ ను కొనుగోలు చేసి, కస్టమర్లకు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అరెస్టయిన నిందితులను, స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను తదుపరి చర్యల నిమిత్తం సనత్ నగర్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ ఆపరేషన్ జూబ్లీహిల్స్ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ చ. యదేందర్, ఎస్.ఐ.పి. డి. రవిరాజ్ వారి బృందం, సనత్ నగర్ పోలీసులతో కలిసి పర్యవేక్షించారు.

# కోతుల బెడద నివారించేందుకు బోను ఏర్పాటు



**అశ్వరావుపేట,మార్చి 27 (పీపుల్స్ న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వరావుపేట నియోజకవర్గం, చంద్రుగొండ మండలం అయ్యన్న పాలెం గ్రామంలో 13వ వార్డులో కోతుల బెడద నివారించేందుకు గ్రామ సర్పంచ్ , ఉప సర్పంచ్ పాలకమండలి సహకారంతో కోతుల బోను ను ఏర్పాటు చేశారు. శుక్రవారం సుమారు 20 కోతుల వరకు పడినట్లు వారు తెలిపారు. గత రెండు నెలల నుంచి సుమారు 200 కోతులు పైనే పట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి ,ఉపసర్పంచ్ అంతటి రామకృష్ణ,13వ వార్డు సభ్యులు, పెద్దలు నరసింహారావు, సాగర్, పెద్దబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

# సీతారాముల కళ్యాణం అత్యంత పవిత్రమైన, కమనీయమైన ఆధ్యాత్మిక వేడుక

**-మొగుళ్ళపల్లి గ్రామ సర్పంచ్ చాట్ల విజయ-రవీందర్ దంపతులు సీతారాముల కళ్యాణ మహోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు**



**మొగుళ్ళ పల్లి ప్రతినిధి మార్చి 27 (పీపుల్స్ న్యూస్):**సీతారాముల కళ్యాణం సనాతన ధర్మంలో అత్యంత పవిత్రమైన, కమనీయమైన ఆధ్యాత్మిక వేడుకని మొగుళ్లపల్లి గ్రామ సర్పంచ్ చాట్ల విజయ-రవీందర్ దంపతులు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని శ్రీ సాంబశివ సామూహిక దేవాలయంలో నిర్వహించిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవాల వేడుకలకు సర్పంచ్ దంపతులు ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా సర్పంచ్ చాట్ల విజయ-రవీందర్ దంపతులు మాట్లాడారు. సీతారాముల కళ్యాణం కేవలం ఇద్దరు వ్యక్తుల పెళ్లి కాదని, లోక కళ్యాణార్థం జరిగే ఒక దివ్య లీలని, సుఖదుఃఖాలలో, అడవిలోనైనా, రాజభవనంలోనైనా కలిసుండే ఆదర్శవంతమైన బంధం వీరిదని సీతారాముల కళ్యాణం కళ్లారా చూడటం కన్నుల పండుగని అన్నారు. ఈ కార్యక్రమంలో మొగుళ్ళపల్లి గ్రామ ఉపసర్పంచ్ ఎర్రబెల్లి హిమబిందు-కోటేశ్వర్ రావు దంపతులు, గ్రామ ప్రముఖులు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మే 1 న నాంచారమ్మ జాతర...

**వారం రోజులపాటు వేడుకలు జాతర తేదీలను ప్రకటించిన ఉత్సవ కమిటీ చైర్మన్ లోకిని రాజు**





**(వెంకటాపూర్) ములుగు జిల్లా ప్రతినిధి మార్చి 27( పీపుల్స్ న్యూస్):** ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ పౌర్ణమికి వైభవంగా నిర్వహించబడే ఎరుకల నాంచారమ్మ జాతర ఈ ఏడాది మే 1న వైభవంగా నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ చైర్మన్ లోకిని రాజు ప్రకటించారు. శుక్రవారం మండలంలోని రామానుజాపూర్ పరిధిలో నాంచారమ్మ జాతర నిర్వహించేందుకు ముందస్తుగా ఆలయాన్ని శుద్ధి చేశారు. పసుపు కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు కేతిరి బిక్షపతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నాంచారమ్మ జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ లోకిని రాజు మాట్లాడారు. తెలుగుజాతిని ఏకం చేసి పరిపాలించిన కాకతీయుల కాలంలో రామప్ప దేవాలయంతో పాటు ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామానుజాపూర్ గ్రామ సమీపంలోని పంట పొలాల్లో 800 సంవత్సరాల క్రితం ఎరుకల నాంచారమ్మ (పంచకూటాలయం) దేవాలయం నిర్మించబడిందన్నారు. 2018 ఏప్రిల్ 29న మొదటిసారి నాంచారమ్మ జాతరను నిర్వహించామన్నారు. నాలుగు రాష్ట్రాల నుంచి జాతరకు భక్తులు తరలిస్తారని చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా వచ్చే భక్తుల కోసం అధికారుల సహకారంతో అన్ని రకాల సౌకర్యాలను కల్పించడం జరుగుతుందన్నారు. నాంచారమ్మ ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉంటాయని అన్నారు. ఈసారి జాతరకు అధికారులు, ప్రజాప్రతినిధులను అన్ని జిల్లాల నాయకులు ఆహ్వానించాలని కోరారు. జాతర విజయవంతం కోసం అధికారులతో పాటు స్థానికులు సహకరించాలని లోకిని రాజు కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనేటి రాజు , కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కూతాటి శ్రీనివాస్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మానుపాటి రమేష్, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లకొండ ఎల్లా స్వామి, వరంగల్ నాయకులు పోనీ సదానందం, స్వామి, ములుగు జిల్లా ఉపాధ్యక్షులు మేడ బంగారయ్య, ములుగు జిల్లా యూత్ నాయకులు సాగర్, ములుగు జిల్లా నాయకులు రాంబాబు, కింసారం రాజు, కేతిరి సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా సీతారామ కళ్యాణ మహోత్సవ వేడుకలు

**-- నిర్వాహకుల అన్నదాన కార్యక్రమాలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి**



**బాలానగర్ మార్చి 28 ( పీపుల్స్ న్యూస్) :**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పారిశ్రామిక బాలానగర్ డివిజన్ పరిధిలోని అంతటా శ్రీ రామ నవమి పర్వదినం అపూర్వమైన ఆధ్యాత్మిక వాతావరణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో పలు దేవాలయాల్లో జరిగిన సీతారాముల కళ్యాణ మహోత్సవాలు భక్తుల హృదయాలను పరవశింపజేశాయి. ఈ పవిత్ర వేడుకల్లో బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సతీసమేతంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అందించిన అన్నప్రసాద కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ రామ నవమి హిందువులకు అత్యంత పవిత్రమైన పర్వదినమని, శ్రీరాముని జన్మదినంగా విశేష భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని, దేశవ్యాప్తంగా ఆలయాల్లో కల్యాణోత్సవాలు..పూజలు,హోమాలు, వైభవంగా జరుగుతాయని తెలిపారు. అలాగే భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి, శ్రీరామ నామస్మరణలో నిమగ్నమవుతూ ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతారని ఆయన పేర్కొన్నారు. ఈ మహోత్సవాల్లో ఆలయ నిర్వాహకులు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని మరింత వైభవంగా మార్చారు. మొత్తం మీద బాలానగర్‌లో శ్రీ రామ నవమి వేడుకలు భక్తి, ఆనందం, ఆధ్యాత్మికత కలగలిపిన మహోత్సవంగా నిలిచాయి.

# దీనదయాళ్ నగర్ హనుమాన్ ఆలయంలో అత్యంత వైభవంగా సీతారామ కళ్యాణం

**-- భక్తి శ్రద్ధలతో మారుమోగిన దీన దయాళ్ నగర్... భారీగా తరలి వచ్చిన భక్తులు.**




**బాలానగర్ మార్చి 28 ( పీపుల్స్ న్యూస్) :**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కూకట్ పల్లి నియోజకవర్గంలోని ఫతేనగర్ 118, దీనదయాల్ నగర్ హనుమాన్ టెంపుల్ దేవస్థానంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించబడింది. బస్తీ అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం పరిసరాలు మంగళవాద్యాలు, వేద మంత్రోచ్చారణలు, భక్తుల హరిహర నాదాలతో మారుమోగాయి. సీతారాముల కళ్యాణాన్ని దర్శించుకోవడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి, భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాదంలో పాల్గొని దేవుని కృపాశీస్సులు పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ఓబీసీ వర్కింగ్ చైర్మన్ తూము వినయ్, మాజీ కౌన్సిలర్ ఎల్లారావు, గ్రేటర్ హైదరాబాద్ మాజీ జాయింట్ సెక్రటరీ అశోక్ చారి, నరసింహ చారి, మైసయ్య ముదిరాజ్ తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, స్థానిక ప్రముఖులు కూడా పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మధ్యాహ్నం ప్రారంభమైన అన్నప్రసాద కార్యక్రమం సాయంత్రం వరకు నిరంతరంగా కొనసాగి భక్తులకు సేవలందించింది. సాయంత్రం జరిగిన సీతారాముల పల్లకి సేవ ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు హరిహర నాదాలతో, భజనలతో పల్లకిని అనుసరిస్తూ ఉత్సాహంగా పాల్గొనడంతో ఆ ప్రాంతం మొత్తం భక్తిరసంతో నిండిపోయింది. ఈ మహోత్సవం ఫతేనగర్ ప్రాంతంలో భక్తి, ఐక్యత,సాంప్రదాయ వైభవంగా నిర్వహించారు.

# గోదావరిఖనిలో భక్తి జ్వాలలు... అంబటి దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం మహోత్సవం!

**శ్రీరామనవమి వేడుకలు ఘనంగా ఆలయంలో ఆధ్యాత్మిక ఉత్సాహం ఉరకలు**







**గోదావరిఖని, మార్చి 27 (పీపుల్స్ న్యూస్):**శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా గోదావరిఖని పట్టణంలోని శ్రీ విఘ్నేశ్వర భక్తాంజనేయ స్వామి దేవాలయం భక్తులతో కళకళలాడింది. అర్చన-- సంతోష్ రావు అంబటి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తుల రద్దీతో ఆలయం కిటకిటలు...దివ్య కళ్యాణ దర్శనంతో ఆధ్యాత్మిక పరవశంభారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి సీతారాముల కళ్యాణాన్ని దర్శించుకుని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఆలయం అంతా మంగళవాయిద్యాలు, వేద మంత్రాలతో ఆధ్యాత్మిక వాతావరణం అలుముకుంది. కోలాటాలు -- పల్లకి సేవ ప్రత్యేక ఆకర్షణ,కళ్యాణం అనంతరం మహిళలు సంప్రదాయ కోలాటాలతో పల్లకి సేవ నిర్వహించడం విశేషంగా నిలిచింది. కాలనీలో నిర్వహించిన ఈ పల్లకి ఉత్సవం భక్తులను ఆకట్టుకుని పండుగకు మరింత శోభను తీసుకొచ్చింది. ప్రముఖుల హాజరుతో వేడుకలకు మరింత వైభవం,ఈ మహోత్సవంలో ఆలయ ప్రధాన అర్చకులు భాస్కర్ శర్మ, నిర్వాహకులు పీచర శ్రీనివాస్ రావు, నరేష్, ప్రభాకర్ రావు, సంపత్ రెడ్డి, కొండల్ రెడ్డి, రమేష్, డా. జగన్ మోహన్ రావు, డా. శ్రీను తదితరులు పాల్గొన్నారు.అలాగే కార్పొరేటర్లు గడ్డం రామాదేవి -- శ్రీనివాస్, వేగోలపు రామాదేవి - శ్రీనివాస్, వడ్లూరి రవి తదితరులు హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

# ప్రజా సేవే లక్ష్యం.. ప్రగతి పథంలో శివ సాయి మల్టీ ప్రొడ్యూసర్ కంపెనీ'

### సేవా రంగంలో దూసుకుపోతున్న 'శివ సాయి మల్టీ ప్రొడ్యూసర్ కంపెనీ'
### ఉగాది శుభాకాంక్షలతో సరికొత్త లక్ష్యాలు

**పెద్దపల్లి మార్చి 27 (పీపుల్స్ న్యూస్):** తెలుగు నూతన సంవత్సరం 'శ్రీ పరాభవ నామ సంవత్సర' ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని, శివ సాయి మల్టీ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఎండి జామల్ల మల్లారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కమల, మరియు బృందం ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. "కోట్ల మైళ్ల ప్రయాణమైనా ఒక్క అడుగుతో ప్రారంభం కావాలి" అనే నినాదంతో ప్రారంభమైన ఈ సంస్థ, ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా తన కార్యకలాపాలను విస్తరిస్తూ అగ్రగామిగా నిలుస్తోంది.?బహుముఖ సేవలకు చిరునామా 2016లో స్థాపించబడిన ఈ సంస్థ (CIN No. U01229 TG 016 PTC 113140), కేవలం ఒక రంగానికే పరిమితం కాకుండా సామాజిక మరియు ఆర్థిక అభివృద్ధికి తోడ్పడే అనేక విభాగాల్లో రాణిస్తోంది. ప్రధానంగా ఉప్పల్ రింగ్ రోడ్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ, తెలంగాణ వ్యాప్తంగా తన శాఖలను ఏర్పాటు చేసి వేలాది మందికి అండగా నిలుస్తోంది. అలాగే ఇందులో పని చేసే వారికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తుంది.ప్రధాన సేవా విభాగాలు:సంస్థ చేపడుతున్న ముఖ్యమైన కార్యకలాపాలు ఇవే:మహిళా సాధికారత: మహిళా




గ్రూపులు మరియు ఫార్మర్ గ్రూపుల ద్వారా గ్రామీణ మరియు పట్టణ అభివృద్ధికి కృషి.బీమా సేవలు: లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ మరియు వెహికల్ ఇన్సూరెన్స్ వంటి సేవలను ప్రజలకు చేరువ చేయడం.వ్యవసాయం ఉ పర్యావరణం: వర్మీ కంపోస్ట్ తయారీ మరియు ఆయుర్వేద మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి.వ్యాపార విభాగాలు: రియల్ ఎస్టేట్ బిజినెస్, సోలార్ సిస్టమ్ బిజినెస్ మరియు ఆల్ కన్‌స్ట్రక్షన్ పనులు.సామాజిక బాధ్యత: చీ+ూ ప్రాజెక్ట్, సోషల్ మీడియా నిర్వహణ మరియు ఇన్కమ్ టాక్స్ వర్క్ వంటి విభిన్న సేవలు. అవకాశాల వేదిక తమ సభ్యులకు పొదుపు మరియు రుణ సదుపాయాలను కల్పించడంతో పాటు, 3 సంవత్సరాల ఫిక్స్‌డ్ డిపాజిట్లు మరియు రికరింగ్ డిపాజిట్ల సౌకర్యాన్ని కూడా సంస్థ అందిస్తోంది. విద్యార్థులకు ఉచిత శిక్షణ మరియు సామాజిక






సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఈ సంస్థ జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో తనదైన ముద్ర వేస్తోంది.మరిన్ని వివరాల కోసం 81878 26256,, 9849183328 నంబర్ల ద్వారా సంప్రదించవచ్చని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

# వైభవంగా శ్రీ రామ నవమి వేడుకలు



**కూకట్ పల్లి, మార్చి 27 (పీపుల్స్ న్యూస్) :** శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కూకట్ పల్లి నియోజకవర్గం ఏ, బి బ్లాక్ లోని పలు దేవాలయాలలో ఏర్పాటు చేసిన శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పీసీసీ సభ్యులు,టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ముఖ్యఅతిథిగా హాజరై స్థానిక కాలనీ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. . అనంతరం ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ శ్రీరాముడి జీవితం ధర్మం, కర్తవ్యబద్ధత, క్రమశిక్షణ, ఆత్మనిగ్రహం వంటి విలువలకు ప్రతీక అన్నారు. సకల జన, లోక సంరక్షణే శ్రీరామనవమి పరమార్థం అని, శ్రీరాముడు సత్యపాలకుడు, ధర్మాచరణ తప్పనివాడు, ఏక పత్నీ వ్రతుడు, సర్వ సద్గుణాలు మూర్తీభవించిన దయహృదయుడు అని అన్నారు. దుష్టశిక్షణ శిష్టరక్షణలో భాగంగా, రాక్షససంహారంతో పాటు రావణసంహారం చేసి, లోకకల్యాణం జరిపించడానికి జనియించింది జానకీదేవి అని, అదేవిధంగా ధర్మాన్ని కాపాడేందుకు జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత ప్రజా పాలకుడు శ్రీరాముడని అన్నారు. మానవుడిగా పుట్టి మాధవుడైన శ్రీరామచంద్రుడి వ్యక్తిత్వాన్ని మించిన మహోజ్వలమైన వ్యక్తిత్వాన్ని సొంతం చేసుకొన్న సీతాదేవి జీవితంలోని అడుగడుగు ఆదర్శమే. లోక కళ్యాణం కోసం ఎన్నో త్యాగాలకోర్చిన సీతారాముల పవిత్ర బంధం అజరామరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు దీపక్ జాన్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, మాజీ కార్పొరేటర్ నరేంద్రాచారి, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మూర్తి, ఎఎంసీ చైర్మన్ పుష్పా రెడ్డి, బేగంపేట్ శ్రీనివాస్ రెడ్డి, రమాదేవి, కుక్కల రమేష్ ముదిరాజ్, వరహాల స్వామి, లక్ష్మణ్ గౌడ్, నరసింహ యాదవ్, మొయినుద్దీన్, రాకేష్, మాట్టే ప్రసన్న, మహేందర్, భరత్, రేష్మా, జ్యోతి, రేణుక, భారతమ్మ, సంధ్య, గుండా జ్యోతి, పులి శివకుమార్ గౌడ్, గోవింద్ గౌడ్, భరత్ వంశీ, వినయ్ ముదిరాజ్, జమీల్, గణేష్, సంజీవ, కనకయ్య, పులి నాగరాజు, సత్యం, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# చిట్కుల్‌లో అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం

**పటాన్ చెరు,మార్చి 27 (పీపుల్స్ న్యూస్) :** శ్రీ రామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పటాన్ చెరు నియోజకవర్గంలోని ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ జి టి ఎన్ కాలనీలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ సహకారంతో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నీలం మధు సొంత నిధులతో నిర్మించిన ఈ ఆలయంలో గత ఐదు రోజులుగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు జరిగాయి. జలధివాసం, ధాన్యాధి వాసం వంటి క్రతువులతో పాటు లోక కల్యాణం కోసం నిర్వహించిన హోమాలు, యజ్ఞ యాగాదులతో చిట్కుల్ గ్రామం భక్తిపారవశ్యంలో మునిగిపోయింది.ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన స్వామివారి విగ్రహాలకు మహా కుంభాభిషేకం నిర్వహించి, భక్తుల సందర్శనార్థం ఆలయాన్ని సిద్ధం చేశారు.శ్రీరామనవమి రోజున అభిజిత్ లగ్నంలో సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. నీలం మధు ముదిరాజ్ దంపతులు తమ స్వగృహం నుంచి పట్టు వస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను ఊరేగింపు గా తీసుకుని వచ్చి స్వామి వార్లకు సమర్పించి కళ్యాణ వేడుకలో పాల్గొన్నారు. సీతారాముల విగ్రహాలను చూడముచ్చటగా అలంకరించి ముత్యాల తలంబ్రాలతో సాగిన ఈ కళ్యాణ ఘట్టం భక్తులకు కనువిందు చేసింది.ఈ మహత్తర కార్యక్రమానికి భక్తజనసంద్రం పెద్ద ఎత్తున హాజరై స్వామివారి కళ్యాణ మహోత్సవంలో భాగస్వాములు అయ్యారు. సీతారాముల



కళ్యాణం సందర్భంగా ఏర్పాటుచేసిన సంగీత విభావరిలో గాయని భవాని ఆధ్వర్యంలో గాయకులు ఆలపించిన గీతాలు ఆహుతులను విశేషంగా అలరించాయి. ఆలయ ప్రాంగణమంతా జైశ్రీరామ్ నినాదాలతో మార్మోగి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.ప్రముఖ గాయని గాయకులు ఆలపించిన భక్తి పాటలకు మహిళలతో కలిసి నీలం మధు దంపతులు కోలాటం ఆడి ఉత్సాహం పెంచారు.ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ.. గ్రామస్తులందరి సహకారంతో నూతన ఆలయ నిర్మాణం పూర్తి కావడం, సీతారాముల ప్రతిష్టాపన జరగడం తనకెంతో సంతోషాన్ని కలిగిస్తోందని అన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను, శాంతిని పెంపొందిస్తాయని తెలిపారు. ఆ సీతారాముల దయతో ప్రజలందరూ సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని






ఆకాంక్షించారు. ఈ ఉత్సవాలకు విచ్చేసిన భక్తులందరికీ అన్న వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# భద్రాదిలో కనులపండుగగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం

### సీతారాముల కళ్యాణంలో సీఎం, డిజీపీ దంపతులు.







**భద్రాచలం,మార్చి 27 (పీపుల్స్ న్యూస్) :** భద్రాద్రి క్షేత్రంలో లోకపావనులైన సీతారాముల కళ్యాణ మహోత్సవం శుక్రవారం వేద మంత్రాల సాక్షిగా అత్యంత వైభవంగా, కనులపండుగగా జరిగింది. ప్రతి ఏటా నిర్వహించే ఈ మహోత్సవంలో భాగంగా ఈ ఏడాది కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య జరిగిన ఈ వేడుకలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి దంపతులు, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క దంపతులతో పాటు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి తన సతీమణి హేమలతతో కలిసి పాల్గొన్నారు. వీరితో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, కొండ సురేఖ, అనసూయ సీతక్క, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి తదితరులు స్వామివారి కళ్యాణాన్ని తిలకించి పునీతులయ్యారు.శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ సందర్భంగా ముందస్తు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు డిజిపి గురువారం సాయంత్రానికే భద్రాచలం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక పోలీస్ అధికారులతో బందోబస్తుపై చర్చించారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు, భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దాదాపు 2,000 మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ పర్యవేక్షణలో స్థానిక పోలీసులు భద్రతా ఏర్పాట్లను నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, క్రమశిక్షణతో కళ్యాణాన్ని వీక్షించేలా చర్యలు చేపట్టారు. భక్తిభావంతో పులకించిన భద్రాచలంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం కనులవిందుగా ముగిసింది

# అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం

### సిఎం ఎనుముల రేవంత్ రెడ్డి సతీ సమేతంగా పాల్గొని పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పణ
### భక్తుల తాకిడితో కిక్కిరిసిన భద్రాద్రి క్షేత్రం

**భద్రాచలం, మార్చి 27 (పీపుల్స్ న్యూస్) :** భద్రాచలంలోని శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ఈ సంవత్సరం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సతీ సమేతంగా ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. భద్రాచలం మిథిలా స్టేడియంలో నిర్వహించిన శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవం వేలాది భక్తుల మధ్య అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి దంపతులు స్వామి, అమ్మ వార్లకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు .మిథిలా స్టేడియంలో శ్రీ రామచంద్రస్వామి, సీతమ్మ వారికి పూజా కార్యక్రమం, అలంకరణ, తదితర కార్యక్రమాలు నిర్వహించి పెళ్లి కొనసాగించారు.శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలు, వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన కళ్యాణ మహోత్సవం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది. ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా అన్ని కార్యక్రమాలను నిర్వహించారు.భద్రాచలం ఆలయం సర్వాంగ సుందరంగా అలంకరించబడగా, భక్తుల రాక పోకలతో క్షేత్రం కిక్కిరిసిపోయింది. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలి వచ్చిన భక్తులు శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దర్శనం కోసం భారీగా తరలివచ్చి దర్శనం పొందారు. భక్తుల






రద్దీ దృష్ట్యా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. త్రాగునీరు, అన్న ప్రసాదం, వైద్య శిబిరాలు, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించడంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారిని దర్శించుకున్నారు. అంతకుముందు ఉదయం రాష్ట్ర




ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద 351 కోట్లతో చేపట్టిన ఆలయ అభివృద్ధి తొలిదశ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, కొండా సురేఖ, ఎంపీ పోరిక బలరాం నాయక్, న్యాయమూర్తులు, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా అయ్యర్, ఎండోమెంట్ కమీషనర్ హన్మంత రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, పీఓ బి. రాహుల్, అదనపు కలెక్టర్లు విద్యా చందన, వేణుగోపాల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు, లక్షలాది మంది భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# శ్రీరాముడి శోభాయాత్ర ప్రశాంతంగా సాగేందుకు పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు.

**హైదరాబాద్ కమిషనరేట్ , క్రైమ్ బ్యూరో, మార్చి 27 (పీపుల్స్ న్యూస్) :** శ్రీరామనవమి శోభాయాత్రను పురస్కరించుకుని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ శుక్రవారం సీతారాం బాగ్ పరిసరాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనర్ మీడియాతో మాట్లాడుతూ నగరంలో జరగనున్న శ్రీరాముడి శోభాయాత్ర ప్రశాంతంగా సాగేందుకు పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని వెల్లడించారు.ఈ యాత్ర మధ్యాహ్నం 2 గంటలకు సీతారాం బాగ్ ఆలయం నుంచి ప్రారంభమై, రాత్రి 10 గంటల కల్లా ముగిసేలా పక్కా రూట్ మ్యాన్ సిద్ధం చేశామని తెలిపారు. ఇప్పటికే పలు శాఖల అధికారులతో కలిసి యాత్ర సాగే మార్గాలను క్షుణ్ణంగా పరిశీలించామని, ఎక్కడా ఎటువంటి ఆటంకాలు కలగకుండా డ్రోన్లు, సీసీ టీవీ కెమెరాల ద్వారా నిరంతరం నిశితంగా పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ఈ భారీ శోభాయాత్ర కోసం దాదాపు 3 వేల మంది సిబ్బందితో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు వివరించారు.అంతకుముందు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తో కలిసి ఆయన శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.







## అక్రమ నీటి దందా జరుగుతున్న
# అధికారులు అడ్డుకోరా..?

### వందల కొలది నీటి ట్యాంకర్లు తిరుగుతున్న పట్టించుకోరా..?





**జిన్నారం : మార్చి 27 (పీపుల్స్ న్యూస్)** జిన్నారం మండలంలో అక్రమ నీటి దందా విస్తృతంగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వేసవి కాలాన్ని ఆసరాగా చేసుకుని కొందరు అక్రమార్కులు భారీ స్థాయిలో నీటిని తరలిస్తూ లక్షల్లో అక్రమంగా సంపాదిస్తున్నట్లు సమాచారం. వందల కొద్దీ నీటి ట్యాంకర్లు రోజూ రాకపోకలు సాగిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. స్థానికుల వివరాల ప్రకారం, బహుదూర్పూర్, పటాన్ చెరువు, బొల్లారం ప్రాంతాలలో ఉన్న పరిశ్రమలకు ఈ నీటిని సరఫరా చేస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా భూగర్భ జలాలను అనుమతులు లేకుండా వినియోగిస్తూ పెద్ద ఎత్తున తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనివల్ల స్థానికంగా నీటి కొరత మరింత తీవ్రంగా మారుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ అక్రమ వ్యాపారానికి కొందరు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే కారణంగా అధికారులు చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాల్టా చట్టాన్ని బహిరంగంగా ఉల్లంఘిస్తూ నీటి దందా కొనసాగుతున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అక్రమ ట్యాంకర్లపై నియంత్రణ చర్యలు చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ నీటి దందాకు చెక్ పెట్టాలా? లేక ఇలాగే మౌనం వహిస్తారా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

**ట్యాంకర్లు రాకపోకలు అధికారులకు కనబడత లేదా..?**

జిన్నారం లో అక్రమంగా నీటిని తరలిస్తున్న ట్యాంకర్ల వ్యవహారం రోజురోజుకీ పెరుగుతుండగా, దీనిపై రెవెన్యూ , మున్సిపల్ అధికారులు స్పందించకపోవడం స్థానిక ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీస్తోంది. వందల సంఖ్యలో నీటి ట్యాంకర్లు నిరభ్యంతరంగా రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, వాటిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ అక్రమ కార్యకలాపాల వెనుక పెద్ద స్థాయిలో సిండికేట్ పనిచేస్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం లేదా సహకారం లేకుండా ఇంత పెద్ద ఎత్తున నీటి తరలింపు సాధ్యం కాదని ప్రజలు అంటున్నారు. దీంతో ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నీటి బోర్లను సీజ్ చేయడం తోపాటు ట్యాంకర్లను సైతం సీజ్ చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నాను.







## మార్కాపురం ఘోర ప్రమాదం.. ట్రావెల్స్ యజమాని అరెస్ట్

**మార్కాపురం, మార్చి 27:** రాయవరం సమీపంలో నిన్న జరిగిన భీకర రోడ్డు ప్రమాదానికి కారణమైన హరికృష్ణ ట్రావెల్స్ యజమాని హరికృష్ణారెడ్డిని పోలీసులు ఎట్టకేలకు అదుపులో తీసుకున్నారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి పరారీలో ఉన్న అతడిని, సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా వెంబడించి పోలీసులు పట్టుకున్నారు. బస్సు ప్రమాదంలో 14 మంది ప్రయాణికులు సజీవదహనం కావడం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. మరో 28 మంది తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అతివేగమే కొంప ముంచింది..నెల్లూరు జిల్లా కలిగిరి కేంద్రంగా హరికృష్ణ ట్రావెల్స్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న హరికృష్ణారెడ్డి, గురువారం బస్సును అత్యంత నిర్లక్ష్యంగా నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. రాయవరం వద్ద మలుపులో బస్సు అతివేగంగా ఉండటంతో, నియంత్రణ కోల్పోయి ఎదురుగా వస్తున్న కంకర లారీని



బలంగా ఢీ కొట్టడంతో భారీ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను కాపాడాల్సింది పోయి, బాధ్యాతారహితంగా అక్కడి నుంచి హరికృష్ణారెడ్డి పరారయ్యాడు. పోలీసుల చర్యలు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుడి ఆచూకీ కనిపెట్టారు. ప్రస్తుతం హరికృష్ణారెడ్డిని విచారిస్తున్నామని, నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు వెల్లడించారు. డీఎన్ఏ () పరీక్షల ద్వారా గుర్తింపు..ఈ ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 14 మంది మృతదేహాలకు మార్కాపురం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం ప్రక్రియ పూర్తయ్యింది. అయ్నితే, మృతదేహాలు పూర్తిగా కాలిపోయి గుర్తుపట్టలేని విధంగా ఉండటంతో, శాస్త్రీయ పద్ధతిలో గుర్తించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మృతదేహాలు ఎవరనేది ఖచ్చితంగా తేల్చడానికి నిన్న మృతుల కుటుంబ సభ్యుల నుంచి డీఎన్ఏ శాంపిల్స్ ను సేకరించారు. ఈ నమూనాలను తదుపరి విశ్లేషణ కోసం ఉన్నతాధికారులు విజయవాడ ఫోరెన్సిక్ ల్యాబ్ కు తరలించారు. రిపోర్టులు వచ్చిన అనంతరం మృతదేహాలను అధికారికంగా సభ్యులకు అప్పగించే అవకాశం ఉంది.

## ప్రధాని చేతుల మీదుగా నోయిడా ఎయిర్‌పోర్ట్ ప్రారంభం

**ఢిల్లీ** ఢిల్లీ–ఎన్‌సీఆర్ ప్రాంతానికి రేపటి నుంచి రెండో అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రానుందని కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రతిష్ఠాత్మకమైన నోయిడా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రారంభించనున్నారని ఆయన వెల్లడించారు. ఈ విషయాన్ని తెలియజేస్తున్నందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు కేంద్రమంత్రి. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ ప్రజలందరికీ అభినందనలు తెలిపారు. 'రేపు జేవార్() వద్ద మీ అందరినీ కలుస్తా' అంటూ రామ్మోహన్ నాయుడు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. కాగా, దేశంలో విమాన ప్రయాణికుల సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోవడంతో ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి



ప్రయాణికుల తాకిడి విపరీతంగా పెరిగింది. దీంతో ఈ ప్రాంతాల్లో మరో నూతన అంతర్జాతీయ ఎయిర్ పోర్టును నిర్మించాలని భావించింది. ఈ మేరకు ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం జేవార్‌లో నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేసింది. అత్యాధునిక టెక్నాలజీ, హంగులతో దీన్ని నిర్మించారు. మార్చి 28న జేవార్‌లో ప్రారంభోత్సవానికి తేదీ సైతం ఖరారు చేశారు. ఈ కొత్త విమానాశ్రయం దేశ విమానాశ్రయ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

## శ్రీరాముని దర్శనానికి బారులు తీరిన భక్తులు

**కడప జిల్లా:** కడప జిల్లాలోని ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామనవమి వేడు కలు ఘనంగా జరుగుతున్నాయి. శ్రీరామనవమి సందర్భంగా ఏటా నిర్వహించే వార్షిక బ్రహ్మో త్సవాల్లో భాగంగా ధ్వజారోహణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి పదిన్నర గంటల వరకు టీటీడీ ఆగమ శాస్త్ర పండితుడు రాజేష్ కుమార్ బట్టర్ ఆధ్వ ర్యంలో స్వామివారికి ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సీతారామ లక్ష్మణ ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న ధ్వజస్తంభానికి ధ్వజారోహణ కార్యక్రమాన్ని మంత్రోచ్చారణ మధ్య ఘనంగా నిర్వహించారు. గరుత్మంతుడి ప్రతిమతో కూడిన వస్త్ర ప్రతిమను ధ్వజస్తంభానికి అధిరోహించారు. బ్రహ్మోత్సవాలకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా సీతారాముల కళ్యాణ మహోత్సవాన్నికి సకల దేవతలందరూ తరలి రావాలని ఆహ్వానాన్ని గరుత్మంతుడు ద్వారా పంపించేటువంటి అపరూప ధ్వజారోహణ ఘట్టానికి వేద పండితులు నిర్వహించారు. రాజంపేట టీడీపీ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్మోహన్



రాజు దంపతులు ఆద్యంతం ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు ఆలయాన్ని చమర్తి జగన్ మోహన్ రాజు సతీసమేతంగా వేకువజామున దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అధికారులు స్వాగతం పలికారు. గర్భాలయంలో సీతారామలక్ష్మణ మూలవరులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ క్రమంలో ఆలయ అధికారులు జగన్ మోహన్ రాజుకు శాలువా కప్పి సత్కరించారు. అర్చకులు వేదాశీర్వచనం చేశారు. అలానే పెద్ద ఎత్తున భక్తులు కూడా శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారామ లక్ష్మణుల విగ్రహాల మూలవిరాట్లను సందర్శించుకోవడానికి ఉదయం నుంచి భారీగా తరలి వచ్చారు.

## ఏపీ ప్రజలకు శుభవార్త.. పీఎన్‌జీ గ్యాస్‌కు మారితే రూ.2,400 రాయితీ, 24 గంటల్లోనే కనెక్షన్

**విశాఖపట్నం,:** పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా గ్యాస్ కష్టాలు వెంటాడుతున్నాయి.. ఈ క్రమంలో ప్రత్యామ్నాయాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) కనెక్షన్లను ప్రోత్సహించాలని నిర్ణయించింది. సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో పీఎన్‌జీపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఏడు నగరాల్లో (విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుం టూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు) 10 లక్షల పీఎన్‌జీ కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయిం చారు. రాష్ట్రంలోని ఏడు నగరాల్లో మెయిన్ ట్రంక్‌లైన్లు ఉన్నాయి. దీపం–2 పథకంలో ఉన్న లబ్ధిదారులు ఎల్‌పీజీనుంచి పీఎన్‌జీకి మారినా కూడా రాయితీ వర్తింపజేస్తారు. వీరికి ఏడాదికి మొత్తం రూ. 2,400.. రెండు నెలలకు ఒకసారి (పైప్డ్ గ్యాస్ బిల్లింగ్) చొప్పున వారి బ్యాంక్ అకౌంట్‌లలో జమ చేయనున్నారు. ఒక్కో పీఎన్‌జీ కనెక్షన్‌కు కేంద్రం ఇచ్చే రూ. 500 రాయితీ కూడా లబ్ధిదారులకు ఇస్తారు. ప్రధానంగా హోటళ్లు, రెస్టారెంట్లు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలలో పీఎన్‌జీ కనెక్షన్లు ఇచ్చేందుకు ప్రాధాన్యమిస్తామని అధికారులు చెబుతున్నారు. ఎవరైనా నగరపాలక సంస్థలకు పీఎన్‌జీ పైప్‌లైన్ కోసం దరఖాస్తు చేస్తే 24 గంటల్లో అనుమతులు ఇవ్వాలని సూచించారు. ఒకవేళ 24 గంటల్లో అనుమతి ఇవ్వకపోతే ఇచ్చినట్లుగానే భావించాలన్నారు. నెలలోనే లక్ష పీఎన్‌జీ కనెక్షన్లు ఇవ్వాలని టార్గెట్ పెట్టుకున్నారు అధికారులు. అంతేకాదు రాష్ట్రవ్యాప్తంగా తిరుమలతో పాటుగా మరికొన్ని ప్రధాన ఆలయాలకు, అన్న క్యాంటీన్లకఇచ్చినట్లుగానే భావించాలన్నారు. నెలలోనే లక్షం కూడా పీఎన్‌జీలు ఏర్పాటు చేయనున్నారు. అధికారులు సిటీ గ్యాస్ పంపిణీ సంస్థలతో సమావేశాలు నిర్వహించి, ప్రణాళికలు రూపొందించనున్నారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరత లేదన్నారు మంత్రి నాదెండ్ల మనోహర్. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని.. ఎవరూ నమ్మొద్దని సూచించారు. కొంతమంది




కొరత వస్తుందేమోననే భయంతో ముందుగానే గ్యాస్ బుక్ చేయడంతోనే సమస్యలు వస్తున్నాయన్నారు. రోజుకు గృహావసర కనెక్షన్లకు 4వేల టన్నుల ఎల్‌పీజీ డిమాండ్ ఉంటే.. వారం రోజులుగా సగటున 3,900 టన్నులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ విషయంలో ఎవరికీ ఆందోళన అవసరం లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు అందజేస్తున్నామని.. కేంద్రం ఇచ్చిన ప్రోత్సాహంతో ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

## రాయవరం బస్సు ప్రమాద బాధితులను పరామర్శించిన ఏపీ మంత్రులు

**ప్రకాశం:** మార్కాపురం మండలం రాయవరం ప్రమాద బాధితులను ఆంధ్రప్రదేశ్ మంత్రులు బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పరామర్శించారు. ఒంగోలు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని చికిత్సపొందుతున్న బాధితులకు అందుతున్న వైద్య సదుపాయాల గురించి అధికారులు, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని.. ఎవ్వరూ అధైర్య పడొద్దని బాధిత కుటుంబాలకు మంత్రులు హామీ ఇచ్చారు. పరామర్శ అనంతరం మంత్రులిద్దరూ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ.. 'మార్కాపురంలో బస్సు ప్రమాద ఘటన దిగ్భ్రాంతికి గురి చేసింది. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని



సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. హోమ్ మినిస్టర్ అనిత, రవాణా శాఖ మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డిని ఘటనా స్థలానికి పంపారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు సైతం వెంటనే స్పందించారు. ప్రస్తుతం గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందుతోంది. బాధితులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్స్ గ్రేషియా ప్రకటించాయి. ప్రమాదానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఘటనపై రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, గవర్నర్ అందరూ స్పందించారు' అని చెప్పారు. మార్కాపురంలో జరిగిన బస్సు ప్రమాద ఘటన అత్యంత బాధాకరమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. క్షతగాత్రులు కోలుకుని ఇంటికి వెళ్లే దాకా చంద్రబాబు సర్కార్ బాధ్యత తీసుకుంటుందని అఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్స్ న్నారు. ప్రమాదంలో మరణించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 5లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ. 2లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాయని ఆయన పేర్కొన్నారు. అలాగే గాయపడిన వారికి ఏపీ ప్రభుత్వం రూ. 2లక్షలు, కేంద్రం రూ. 50వేలు ప్రకటించాయని చెప్పారు. బాధితులంతా కూలి పనులు చేసుకునే పేదవాళ్లని, వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ భరోసా ఇచ్చారు. కాగా, ఈ ప్రమాదంలో 14 మంది మృతిచెందగా.. 28 మంది గాయపడిన సంగతి తెలిసిందే.

## పోలీసులపై బీరు బాటిల్‌తో దాడి.. కాల్పుల్లో నిందితుడికి గాయాలు

**అమరావతి :** అనంతపురం( జిల్లాలో సంచలనం కలిగించిన బాలుడి హత్యకేసులో నిందితుడు పోలీసులపై ( ఎదురు దాడికి దిగాడు. దీంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో ( నిందితుడు గాయపడ్డాడు. జిల్లాలో యాడి మండలం కోన ఉప్పలపాడు సమీపంలోని కొండల్లో నిన్న ఏడేళ్ల బావమరిదిని బావ సర్వేశ్‌కుమార్‌హత్య చేశాడు. బాలుడు కనిపించడం లేదని బావ సర్వశ్‌కుమార్‌పై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేయగా పోలీసులు అతడిని పట్టుకుని బాలుడి ఆచూకీ కనుగొన్నారు. బాలుడు కొండల్లో రాళ్ల మద్యన శవమై కనిపించడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. కాగా సీన్ రికన్‌స్ట్రక్షన్ కోసం నిందితుడిని శుక్రవారం కొండ ప్రాంతానికి తీసుకెళ్లగా అక్కడ పడి ఉన్న ఖాళీ బీరు సీసాతో పోలీసులపైకి దాడి చేశాడు. ఈ దాడిలో సీఐ రామసుబ్బయ్య, కానిస్టేబుల్ వెంకటేష్‌కు



గాయలయ్యాయి. అయిన పోలీసులపై దాడి చేస్తుండడంతో పోలీసులు అతడి మోకాళ్లపై కాల్పులు జరుపడంతో నిందితుడు గాయపడ్డాడు. ముగ్గురిని పోలీసులు స్థానిక ఆసుపత్రికి తరలిం చారు. గాయపడ్డ పోలీసులను అనంతపురం జిల్లా ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అంది స్తున్నారు. కాగా చికిత్సపొందుతున్న పోలీ^లను జిల్లా ఎస్పీ జగదీష్ పరామర్శించారు.

# పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గించిన కేంద్రం




**న్యూ ఢిల్లీ :** పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా పెరుగుతున్న ఇంధన ధరల పట్ల ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. లీటరు పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని 13 రూపాయల నుంచి 3 రూపాయలకి తగ్గించింది. లీటరు డీజిల్‌పై 10 రూపాయలుగా ఉన్న సుంకాన్ని సున్నాకు తగ్గించింది. ఈ తగ్గింపు తక్షణమే అమలులోకి వస్తుందని కేంద్రం తెలిపింది.ఫిబ్రవరి 28న ఇరాన్ పై అమెరికా–ఇజ్రాయెల్ దాడులు ప్రారంభమైనప్పటి నుంచి అంతర్జాతీయ చమురు ధరలు దాదాపు 50 శాతం పెరిగాయి. ప్రపంచ ముడిచమురు సరఫరాలో దాదాపు 20 నుంచి 25 శాతం వాటా కలిగిన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించడంతో ముడిచమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్ కు 100 డాలర్ల మార్కును దాటింది. అయినప్పటికీ, దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలైన హెచ్ పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీ రిటైల్ ధరలను పెంచకుండా స్థిరంగా ఉంచాయి. దీనివల్ల ఆయా సంస్థలు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గిస్తూ కేంద్రం ఈ ప్రకటన చేసింది. ఈ నిర్ణయంతో రిటైల్ మార్కెట్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు తక్షణమే తగ్గే అవకాశం లేకపోయినా ఇంధన ధరల భారాన్ని చమురు కంపెనీలు ప్రజల పైకి బదిలీ చేయకుండా ఉపకరించనుంది.ఏవియేషన్ టర్బైన్? ఇంధనంకు మినహాయింపుడీజిల్ ఎగుమతులపై 'విండ్‌ఫాల్ ట్యాక్స్'ను లీటరుకు రూ. 21.5 గా నిర్ణయించింది. ఇదిలా ఉండగా, విమాన ఇంధనం ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్‌పై ఇటీవల కేంద్రం స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీని తీసుకొచ్చింది. తాజాగా ప్రకటించిన మినహాయింపులతో ఇది లీటరుకు రూ. 29.5కు తగ్గింది.వదంతులు నమ్మవద్దు: కేంద్రంఅలాగే, దేశంలో ఇంధన కొరత ఏర్పడుతుందనే వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ వార్తలను తోసిపుచ్చింది. దేశవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల్లో తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా సాధారణంగానే జరుగుతుందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దేశంలోని అన్ని చమురు శుద్ధి కర్మాగారాలు పూర్తి సామర్థ్యంతో పని చేస్తున్నాయని, ముడిచమురు నిల్వలు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పింది. గృహ అవసరాల కోసం ఎల్పీజీ ఉత్పత్తిని కూడా పెంచినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దని వివరించింది.అంతర్జాతీయంగా ముడిచమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి 122 డాలర్లకు పెరిగినప్పటికీ, ఆ భారాన్ని కేంద్రం ప్రజలపై వేయడం లేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు 20శాతం నుంచి 50 శాతం వరకు పెరిగినా, భారత్‌లో మాత్రం ధరలు స్థిరంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ఇదే విషయంపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా స్పందించారు. సంక్షోభం నేపథ్యంలో వినియోగదారులను రక్షించడానికి పెట్రోల్, డీజిల్‌పై సెంట్రల్ ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ. 10 చొప్పున తగ్గించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్న ప్రధాని మోదీని మంత్రులు కొనియాడారు.ప్రస్తుతం దిల్లీలో లీటర్ పెట్రోల్ ధర 94.77 రూపాయల ఉండగా, డీజిల్ ధర 87.67 రూపాయల వద్ద కొనసాగుతున్నాయి. వ్యాట్, ఇతరత్రా సుంకాలతో కలిసి వివిధ రాష్ట్రాల్లో ఈ ధరలు విభిన్నంగా ఉంటాయి. హైదరాబాద్?లో రూ.107.46, కోల్?కతాలో రూ. 103.54, ముంబయిలో రూ. 103.54, బెంగళూరులో . 102.96గా ధరలు ఉన్నాయి.

# 2 నుంచి స్టాలిన్ ప్రచారం



**చెన్నై:** అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే, సెక్యూలర్ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ముఖ్యమంత్రి స్టాలిన్ ఏప్రిల్ 2వ తేదీ నుంచి 21వ తేదీ వరకు పలు ప్రాంతాల్లో ప్రచారం చేస్తారని డీఎంకే ప్రధాన కార్యాలయం గురువారం ప్రకటించింది. ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో నామినేషన్ ప్రక్రియ ఈ నెల 30న ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో, అధికార డీఎంకే, ప్రతిపక్షం అన్నాడీఎంకే, నామ్ తమిళర్ కట్చి, టీవీకే మధ్య చతుర్ముఖ పోటీ నెలకొంది.ఇక రాష్ట్రప్రజలను ఆకట్టుకునే విధంగా మళ్లీ ఎన్నికల మేనిఫెస్టోలోని అంశాలతో ప్రచారం జేయనున్నారు. మరో రెండు రోజుల్లో డీఎంకే అభ్యర్థుల జాబితాతో ఎన్నికల మేనిఫెస్టో కూడా సీఎం స్టాలిన్ విడుదల చేసే అవకాశముంది. ఇదిలా వుండగా, కూటమి పార్టీలకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా సీఎం పర్యటించే టైం టేబుల్‌ను అన్నా అరివాలయం విడుదల చేసింది. అందులోని వివరాల ప్రకారం ఏప్రిల్ 2వ తేదీ సాయంత్రం తిరువారూర్,3న ఉదయం జయంకొండామ్, సాయంత్రం తిరువెలుంబూరు, 4, 5, 6వ తేదీల్లో కరూర్, తిరుప్పూర్ ప్రాంతాల్ల ప్రచారం చేసి చివరగా కొళత్తూరు నియోజకవర్గంలో ఏప్రిల్ 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు సీఎం తన ప్రచారాన్ని పూర్తిచేయనున్నారు. అధినేత ప్రచార పర్యటన, బహిరంగ సభల నిర్వహణకు డీఎంకే , ఎమ్మెల్యేలు, ఎంపీలు, అలాగే మిత్రపక్షాల నేతలు ఏర్పాట్లు సిద్ధం చేసుకుంటున్నారు.

# గుజరాత్ పోర్ట్‌కు చేరిన మరో ఎల్పీజీ నౌక జగ్ వసంత్




**అహ్మదాబాద్:** దేశంలో గ్యాస్ సంక్షోభం నేపథ్యంలో మరో ఎల్పీజీ నౌక 'జగ్ వసంత్' భారత్ చేరుకున్నది. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో హోర్ముజ్ జలసంధి వద్ద 23 రోజుల పాటు ఇది చిక్కుకున్నది. ఇరాన్‌తో భారత్ దౌత్య చర్చల నేపథ్యంలో ఇటీవల హోర్ముజ్ జలసంధిని ఇది దాటింది. 47,600 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ లోడ్‌తో ఉన్న 'జగ్ వసంత్' ట్యాంకర్ గురువారం రాత్రి గుజరాత్‌లోని పోర్ట్‌కు చేరుకున్నది.కాగా, 45,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీని రవాణా చేస్తున్న 'పైన్ గ్యాస్' అనే మరో ఎల్పీజీ ట్యాంకర్ త్వరలో న్యూ మంగళూరు పోర్ట్‌కు చేరనున్నది. దీని రాకతో దేశంలోని ప్రస్తుత ఎల్పీజీ నిల్వలకు అదనంగా 92,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ చేకూరుతుంది. దేశంలో ఒక రోజు వంటగ్యాస్ వినియోగానికి ఇది సమానం.మరోవైపు గత పది రోజుల్లో హోర్ముజ్ జలసంధిని దాటిన రెండు పెద్ద ఎల్పీజీ ట్యాంకర్లు ఇప్పటికే భారత్ చేరుకున్నాయి. మధ్యప్రాచ్య ప్రాంతంలో కొనసాగుతున్న సంఘర్షణ కారణంగా ప్రస్తుతం హోర్ముజ్ జలసంధిలో 20 భారత నౌకలు చిక్కుకున్నట్లు షిప్పింగ్ మంత్రిత్వ శాఖ తెలిపింది. వీటిలో ఐదు భారీ ఎల్పీజీ ట్యాంకర్లు ఉన్నట్లు పేర్కొంది. వీటి రాకతో 2,30,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ అందుబాటులోకి వస్తుందని వెల్లడించింది. మరో భారీ ఎల్పీజీ ట్యాంకర్ కూడా ఒకటి లేదా రెండు రోజుల్లో ఎల్పీజీని నింపుకుని భారత్‌కు బయలుదేరుతుందని వివరించింది.

# దేశంలో మళ్లీ లాక్‌డౌన్ - క్లారిటీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం

**న్యూ ఢిల్లీ :**పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో భారత్‌లో లాక్‌డౌన్ విధించబోతున్నారనే వదంతులను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రో లియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి కొట్టిపా రేశారు. దేశంలో మళ్లీ లాక్‌డౌన్‌ను విధించే ప్రసక్తే లేదని వారు స్పష్టం చేశారు. ప్రజల్లో భయాందోళనలు పెంచేందుకు కొంతమంది బాధ్యతారాహిత్యంతో, ప్రమాదకర రీతిలో ఇలాంటి వదంతులను వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ వదంతుల్లో అస్సలు వాస్తవి కత లేదన్నారు. లాక్‌డౌన్ అనే ప్రతిపాదనే భారత ప్రభుత్వం పరిశీలనలో లేదని నిర్మల, హర్దీప్ సింగ్ తేల్చి చెప్పారు. ప్రస్తుత పరిస్థితు లను యావత్ దేశం బాధ్యతాయుతంగా, ఐక్యంగా, క్రమశిక్షణతో ఎదుర్కోవాలని పిలు పునిచ్చారు.పెట్రోలు, డీజిల్‌లపై ఎక్సైజ్ సుం కాన్ని తగ్గించాం!"మనదేశంలో ఇంధన కొరత ఏర్పడిందని, లాక్‌డౌన్‌ను విధిస్తారని కొందరు నేతలు చెబుతుండగా విని నేను ఆశ్చర్యపోయాను. ఇవన్నీ నిరాధారమైన ఆరోపణలే. ఇలాంటి వ్యాఖ్యలను రాజకీయ నేతలు చేస్తుండటం ఆందోళనకరం. కొవిడ్ తరహా లాక్‌డౌన్‌ను ఇప్పుడు విధించే అవకాశమే లేదు. పెరుగుతున్న పెట్రోలు, డీజిల్ ధరల ప్రభావం ప్రజలపై పడకూడదని మేం కోరుకుంటున్నాం. అందుకోసమే పెట్రోలు, డీజిల్‌లపై విధించే ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాం. భారత చమురు కంపెనీలపై భారాన్ని తగ్గించేందుకే ఈ చర్యను చేపట్టాం.గురువారం రాత్రి ప్రధాని మోదీ సారథ్యంలో జరిగిన అత్యవసర సమావేశంలోనే దీనిపై నిర్ణయాన్ని తీసుకున్నాం" అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు.




ప్రజలపై పడకూడదని మోదీ నిర్ణయించారు!

అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చితి ఉన్నా, దేశ ప్రజలపై భారం పడకూడదని మోదీ నిర్ణయించారు. ఇప్పుడు భారత చమురు కంపెనీలు భారీ ధరలకు ముడి చమురును కొన్నా, ప్రభుత్వం వాటికి ఆర్థిక మద్దతును అందిస్తుంది. పెట్రోలు, డీజిల్‌లపై విధించే ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తుంది. ఇందుకు ప్రతిగా అవి పెట్రోలు, డీజిల్ ధరలను పెంచడానికి వీల్లేదు. గతంలో ప్రపంచంలో ఎప్పుడు సంక్షోభాలు వచ్చినా భారత్‌పైనా ఎక్కువ ప్రభావం పడేది. కానీ ఈసారి ప్రధాని మోదీ సత్వర చర్యలను చేపట్టారు. అందుకే ఇంధన కొరత ఏర్పడటం కానీ, పెట్రోలు, డీజిల్, విమాన ఇంధనం ధరలు పెరగడం కానీ జరగలేదు" అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.ప్రధాని మోదీ అన్ని రకాల చర్యలు చేపట్టారు."ప్రస్తుతం యావత్ ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో అన్ని పరిణామాలను భారత్ నిశితంగా పరిశీలిస్తోంది. ఇంధన వనరులు, సప్లై చైన్లు, నిత్యావసరాలపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. దేశ ప్రజలకు అవసరమైన ఇంధనం, చమురు, ఇతరత్రా కీలకమైన సప్లైలు దెబ్బతినకుండా ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్ని రకాల చర్యలను చేపడుతున్నారు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత్ సర్వసన్నద్ధం గా ఉంది. అంతర్జాతీయ అనిశ్చితులను సమర్థంగా ఎదుర్కొన్న ట్రాక్ రికార్డు భారత్‌కు ఉంది. ఇకపైనా వాటిని సందర్భోచితంగా, క్రియాశీలకంగా, సమన్వయంతో ఎదుర్కొంటాం" అని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు.ఈ నష్టాన్ని ప్రభుత్వమే భరిస్తోంది!"నాలుగేళ్ల క్రితం(2022లో) రష్యా - ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి ప్రధాని మోదీ సారథ్యంలోని ప్రభుత్వం ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటోంది. చమురు ధరల భారాన్ని ప్రభుత్వమే మోస్తూ, దేశ ప్రజల ప్రయోజనాలను కాపాడుతోంది. ఇప్పుడు కూడా దేశంలోని చమురు కంపెనీలకు వస్తున్న భారీ నష్టాలను పూడ్చే క్రమంలో పెద్ద మొత్తంలో పన్ను ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోతోంది. గత నెల రోజుల వ్యవధిలో 1 బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర 70 డాలర్ల నుంచి 122 డాలర్లకు పెరిగింది. దీంతో భారత చమురు కంపెనీలు 1 లీటరు పెట్రోలుపై రూ.24, 1 లీటరు డీజిల్‌పై రూ.30 దాకా నష్టపోతున్నాయి. ప్రజల కోసం ఈ నష్టాన్ని ప్రభుత్వమే భరిస్తోంది" అని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి చెప్పారు.రిఫైనరీలపై ఎగుమతి పన్ను"పెట్రోలు, డీజిల్ ధరలు ఆగ్నేయాసియా దేశాల్లో 30 నుంచి 50 శాతం, ఉత్తర అమెరికా దేశాల్లో 30 శాతం, ఐరోపా దేశాల్లో 20 శాతం, ఆఫ్రికా దేశాల్లో 50 శాతం పెరిగాయి. ఇతర దేశాల్లా పెట్రోలు, డీజిల్ ధరలను పెంచాలని భారత్ భావించలేదు. దీనికి బదులుగా విదేశాలకు చమురును సప్లై చేసే రిఫైనరీలపై ఎగుమతి పన్నును కేంద్ర ప్రభుత్వం విధిస్తోంది. దేశంలో చమురు సంక్షోభం ఏర్పడకుండా భారత ఆర్థిక శాఖ చాలా సత్వర చర్యలను చేపట్టింది. ఈ సాహసోపేత, సందర్భోచిత, విజనరీ నితీసుకున్నందుకు ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లకు నా అని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి పేర్కొన్నారు.

# భారత్, చైనా కఠోర శ్రమ వల్లే అద్భుతమైన అభివృద్ధి- ఇతరుల దయ వల్ల కాదు

**న్యూ ఢిల్లీ :**భారత్– చైనా సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు డ్రాగన్ రాయబారి షు ఫీహాంగ్. గత కొన్ని దశాబ్దాలుగా భారత్, చైనా సాధించిన అద్భుతమైన అభివృద్ధి ఇతరుల దయ వల్ల కాదని, వారి కఠోర శ్రమ వల్లేనని వెల్లడిం చారు. బీజింగ్ ఆర్థిక ఎదుగుదలకు బయటి శక్తులే కారణమన్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. అమెరికా ఉప విదేశాంగ మంత్రి క్రిస్టోఫర్ లాండౌ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన ఈ మేరకు స్పందించారు. గతంలో చైనాకు అమెరికా అందించిన ఆర్థిక మద్దతు ఒక పొరపాటు అని, దిల్లీ విషయంలో వాషి ంగ్టన్ దానిని పునరావృతం చేయదని లాండౌ అన్నారు.14వ చైనా– భారత్ యువజన చర్చల కార్యక్రమంలో పాల్గొన్న చైనా రాయబారి దేశం పేరు ప్రస్తావించకుండా అమెరికాను పరోక్షంగా విమర్శించారు. కొన్ని శక్తులు చైనా–భారత్ సామరస్యంగా జీవించడాన్ని కోరుకోవడం లేదని చెప్పారు. ఈ విభేదాల నుంచి లాభం పొందాలనే ఆశిస్తున్నాయని, అందుకే చైనా ముప్పు అనే ముసుగులో వీటిని పెంచుతు న్నాయని అభిప్రాయపడ్డారు. భారత్, చైనాలు తమ సొంత ప్రయత్నాల ద్వారా అభివృద్ధిని సాధించాలని, అదే సమయంలో పరస్పర ప్రయోజనకరమైన సహకారాన్ని కొనసాగించా లని చెప్పారు. ఒకరి విజయానికి మరొకరు మద్దతు ఇచ్చుకోవాలని అభిప్రాయపడ్డారు. ప్రపంచంలోని రెండు అతిపెద్ద అభివృద్ధి చెందుతున్న దేశాలుగా, ప్రధాన వర్ధమాన ఆర్థిక వ్యవస్థలుగా చైనా–భారత్ సంబంధాలు ద్వైపాక్షిక పరిధిని దాటిపోయాయని అన్నారు. వీటికి ముఖ్యమైన ప్రపంచ, వ్యూహాత్మక ప్రాముఖ్యం ఉందని అభిప్రాయపడ్డారు."గత కొన్ని దశాబ్దాలుగా చైనా– భారత్ రెండూ అద్భుతమైన అభివృద్ధిని సాధించాయి. ఈ విజయాలు మన ప్రజల కఠోర శ్రమ, వివేకం, ప్రపంచ సహకారంతోనే సాధ్యమయ్యాయి. ఇవి ఎంతమాత్రం ఇతరుల దయ ఫలితం కాదు. చైనా–భారత్? విడదీయలేని పొరుగు దేశాలు. ఇరుపక్షాలు మంచి పొరుగు మిత్రులుగా, భాగస్వాములుగా ఉంటూ ఒకరి విజయానికి ఒకరు సహాయపడాలి. డ్రాగన్–ఏనుగు కలయికను సాకారం చేసుకోవడమే సరైన ఎంపిక అవుతుంది. అయితే, చైనా– భారత్? సామరస్యంగా జీవించడాన్ని కొందరు ఇష్టపడరు. వారు ఉద్దేశపూర్వకంగా మన మధ్య ఉన్న విభేదాలను పెంచి పోషిస్తుంటారు. 'చైనా ముప్పు' అనే పదాన్ని అతిగా ప్రచారం చేస్తూ మన రెండు దేశాల మధ్య ఉన్న విభేదాల నుంచి లాభం పొందాలని ఆశిస్తున్నారు. ఇలాంటి సంక్లిష్ట, మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో యువత స్వతంత్రంగా ఆలోచించి వారి అబద్ధపు ప్రచారాల నుంచి బయటకు రావాలి.'




– షు ఫీహాంగ్, భారత్‌లో చైనా రాయబారి" కజాన్, టియాంజిన్‌లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీల మధ్య జరిగిన సమావేశాల తర్వాత చైనా– భారత్ సంబంధాలు పునఃప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఇరు దేశాల సంబంధాలు అభివృద్ధికి చేరుకున్నాయి. వివిధ రంగాల్లో పరస్పర సహకారంతో సానుకూల పురోగతి సాధించాయి. భవిష్యత్తులో చైనా– భారత్ సంబంధాల అభివృద్ధికి కేవలం మన నాయకుల వ్యూహాత్మక మార్గదర్శకత్వం మాత్రమే కాకుండా, ఇరు దేశాల ప్రజల మధ్య పరస్పర అవగాహన కూడా అవసరం."అని షు ఫీహాంగ్ అభిప్రాయపడ్డారు."అస్థిరతలతో కూడిన ప్రపంచంలో ఏకపక్షవాదం, సంరక్షణవాదం పెరుగుతున్నాయి. ఆధిపత్యవాదం, అధికార రాజకీయాలు ప్రబలి ప్రస్తుత అంతర్జాతీయ వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. గ్లోబల్ సౌత్‌లో ముఖ్య సభ్యులుగా ఉన్న చైనా, భారత్? ఈ విషయంలో సమన్వయంతో బలోపేతం చేసుకోవాలి. అభివృద్ధి చెందుతున్న దేశాల చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలను సంయుక్తంగా పరిరక్షించాలి. గ్లోబల్ సౌత్‌ను మరింత అభివృద్ధి దిశగా నడిపించాలి. శాంతియుత సహజీవనం, పరస్పర అభ్యసనం అనే విధానాన్ని మనం ముందుకు తీసుకువెళ్లాలి. ప్రపంచం తిరిగి పాలనలోకి జారి పోకుండా నిరోధించాలి." అని షు ఫీహాంగ్ చెప్పారు.

# పశ్చిమాసియాలో యుద్ధం ఎఫెక్ట్.. దేశంలో కమర్షియల్ గ్యాస్ సరఫరాపై ప్రభావం




**న్యూ ఢిల్లీ :** పశ్చిమాసియా లో యుద్ధ ప్రభావం ప్రపంచదేశాలపై పడుతోంది. మన దేశంలో కూడా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ సరఫరాపై పడింది. తాజాగా కమర్షియల్ గ్యాస్ కొరతను అధిగమించేందుకు కేంద్రం ) కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులోభాగంగా కమర్షియల్ ఎల్పీజీ సరఫరాను 70 శాతానికి పెంచింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కేంద్ర పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ మిట్టల్ () లేఖ రాశారు.ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కమర్షియల్ ఎల్పీజీ సరఫరా కోటాను కేంద్రం ఇటీవల తగ్గించిన సంగతి తెలిసిందే. తాజాగా పరిస్థితులు మెరుగుపడుతుండటంతో క్రమంగా వాటిని పెంచుతూ వస్తోంది. గతవారం 50 శాతంగా ఉన్న ఈ వాణిజ్య సిలిండర్ల సరఫరాను.. తాజాగా మరో నిర్ణయం తీసుకుంది. ఇందులోభాగంగా 20 శాతం పెంచింది. అయితే వీటిల్లో ఉక్కు, ఆటోమొబైల్స్, వస్త్రాలు, రంగులు, రసాయనాలు, ప్లాస్టిక్ వంటి కీలక పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం సూచించింది. ఇక ఫ్రీ క్రైసిస్ కోటా కింద రాష్ట్రాలకు 40 శాతంగా ఉన్న కేటాయింపులను మరో 10 శాతం పెంచింది.

# సముద్రంలో కిలోమీటర్ల మేర పేరుకున్న చమురు తెట్టు



గల్ఫ్ ఆఫ్ మెక్సికో లో సముద్రంపై 600 కిలోమీటర్ల మేర భారీ చమురు తెట్టు ఏర్పడింది. మెక్సికన్ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ చమురు తెట్టువల్ల ఏడు ప్రకృతి సంరక్షణ ప్రాంతాలతో సహా సముద్రంలోని జీవరాశులపై పెను ప్రభావం పడిందన్నారు. రెండు సహజ చమురు ఊటలు వ్యాపించడం, ఓ చమురు నౌక సముద్రంలో బోల్తాపడడంవల్ల ఈ ముప్పు సంభవించిందని చెప్పారు.ఐదు నెలల క్రితం భారీ వర్షాలు, వరదల కారణంగా మెక్సికోలోని తూర్పు రాష్ట్రమైన వెరాక్రూజ్‌లో ముడి చమురు సహజంగా ఊరే ఒక పైప్‌లైన్ పగిలిపోయింది. ఆ పైప్‌లైన్ నుంచి లీకైన చమురు పాంటెపెక్ నది, టబాస్కో దక్షిణ రాష్ట్రాలలోని 200 కిలోమీటర్ల తీరప్రాంతంతో సహా 600 కిలోమీటర్ల మేర వ్యాపించింది. కాంపెచే బేలో ఉన్న మరో సహజ చమురు ఊట సముద్రతీరంలో వ్యాపించింది. ఇప్పటికీ అందులో నుంచి చమురు లీక్ అవుతున్నది.

# 'డీలర్లకు, వినియోగదారులకు ఎటువంటి ఉపయోగం లేదు'



**న్యూ ఢిల్లీ ::** పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. కేంద్రం ప్రకటించిన ఎక్సైజ్ సుంకం కోతలతో డీలర్లకు, వినియోగదారులకు ఇంధన ధరలలో ఎలాంటి మార్పు ఉండదని ఆరోపించింది. రిలీఫ్ అనేది కేవలం ప్రచా రంలోనే తప్ప వాస్తవంలో లేదని ఎద్దేవా చేసి ంది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ మీడియా, ప్రచా ర విభాగం అధిపతి పవన్ ఖేడా ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు."వార్తల్లో శీర్షికల ద్వారా కేంద్రం ప్రజలను మోసం చేస్తోంది. అలా చేయడం మానుకుని ప్రభుత్వం వినియోగదారులకు వాస్తవ ఉపశమనం అందించడంపై దృష్టి పెట్టాలి. 'పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుతున్నాయి' అనే శీర్షికలను చూసి ప్రభుత్వం ప్రజల జేబుకు ఉపశమనం కల్పించిందని మీరు భావిస్తే పొరపాటే అవుతుంది. ప్రస్తుతానికి డీలర్లకు, వినియోగదారులకు ఇంధన ధరలు యథాతథంగానే ఉన్నాయి. వాస్తవానికి కేంద్రం తగ్గించింది ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం మాత్రమే. ఇది ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రభుత్వానికి చెల్లించే పన్ను. ప్రత్యేక, అదనపు అనే పదాలే ఈ పన్ను ఎంత అనవసరమో తెలియజేస్తున్నాయి" అని కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేడా పేర్కొన్నారు.'నష్టాలను భరిస్తున్న చమురు మార్కెటింగ్ కంపెనీలు'పశ్చిమాసియాలో ఘర్షణ మొదలైనప్పటి నుంచి చమురు మార్కెటింగ్ కంపెనీలు నష్టాలను భరిస్తున్నాయని పవన్ ఖేడా తెలిపారు. యుద్ధం ప్రారంభమైన దాదాపు నెల రోజుల తర్వాత ప్రత్యేక అదనపు సుంకాన్ని తగ్గించడం ద్వారా కేంద్రం ఇప్పుడు ఆ భారాన్ని కొంతమేర పంచుకోవడానికి మాత్రమే అంగీకరించిందన్నారు. ఉపశమనం అనేది కేవలం కథనాల్లో మాత్రమే ఉందని, వాస్తవంలో కాదని ఎద్దేవా చేశారు.

# ఆందోళనకరంగా ద్రవ్యోల్బణం

పశ్చిమాసియా సంక్షోభం, ముడి చమురు ధరలు, ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెంపు.. ఇలా అనేక అంశాలు దేశ ఆర్థిక ప్రగతికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా ధరల పెరుగుదల, చమురు అలభ్యత, రూపాయి మారకం విలువ పెరగడం వెరసి భారత జిడిపిపై తీవ్ర ప్రభావం చూపుతోంద. ద్రవ్యోల్బణానికి కూడా కారణమవుతోంది. పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులు ఇప్పట్లో సద్దుమణిగేలా లేవు. దీంతో ఇధంన లభ్యత ఎలా ఉంటుందో తెలియదు. ధరలు పెరగడం మాట ఎలా ఉన్నా అభ్యత అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ట్రంప్, ఇరా÷– పట్టుదలతో ఈ సంక్షోభం ఇప్పట్లో చల్లారేలా లేదు. ఈ ఏడాదికిగాను దేశ జీడీపీ వృద్ధి అంచనాలను అమెరికా బహుళజాతి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ సాచ్స్ మరోసారి తగ్గించింది. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియా భగ్గుమంటున్న విషయం తెలిసిందే. గల్ఫ్ దేశాల్లో ముడి చమురు, ఎల్‌పీజీ, ఎల్‌ఎన్‌జీ ఉత్పత్తికి బ్రేకులుపడ్డాయి. భారత ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండగా.. మిడిల్ ఈస్ట్ నుంచి పెద్ద ఎత్తునే వస్తున్నది. గత నెల 28 నుంచి ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ వైమానిక దాడులను ప్రారంభించాయి. అప్పట్నుంచి గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అమెరికాకు మద్దతిస్తున్నారని పొరుగు దేశాలైన కువైట్, ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఇరాక్‌లపై ఇరాన్ దాడులు చేస్తున్నది. ఆయా దేశాల్లోని చమురు, గ్యాస్ క్షేత్రాలనే లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తున్నది. దీంతో క్రూడాయిల్, సహజ వాయువు ఉత్పత్తి నిలిచిపోయింది. పైగా మిడిల్ ఈస్ట్ నుంచి భారత్, చైనా సహా ఇతర దేశాలకు జరిగే రవాణాలో కీలకమైన హొర్ముజ్ జలసంధిని కూడా ఇరాన్ మూసేసింది. ఈ పరిణామం ఒక్కసారిగా గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు, గ్యాస్ ధరల పెరుగుదలకు దారితీసింది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో



ఆయా పెట్రో ఉత్పత్తుల ధరలూ పెరిగాయి. గ్యాస్ కొరత కూడా కనిపిస్తుండగా, దేశవ్యాప్తంగా చాలా హోటళ్లు, ఇతర గ్యాస్ ఆధారిత వ్యాపారాలు, పరిశ్రమలు మూతబడుతున్నదీ చూస్తూనే ఉన్నాం. ఎరువుల తయారీ కుంటుబడి వ్యవసాయ రంగం సైతం ప్రభావితం అవుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి దేశ ఆర్థిక వృద్ధిరేటు 5.9 శాతాన్ని మించి ఉండబోదని గోల్డ్‌మన్ సాచ్స్ తాజాగా అభిప్రాయపడింది. 2026లో దేశ జీడీపీ వృద్ధి 7 శాతంగా ఉండొచ్చని గతంలో గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేసింది. అయితే ఈ నెల 13న దీన్ని 6.5 శాతానికి తగ్గించింది. ఇప్పుడు 5.9 శాతానికి కుదించింది. కేవలం 11 రోజుల్లోనే అర శాతానికి పైగా కోత పెట్టడం గమనార్హం. దీని వెనుక మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలే కారణంగా ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఇక రవాణా రంగంపైనా భారం పడుతుండగా.. పెరిగిన పెట్రోల్, డీజిల్ రేట్లతో ఆయా వస్తూత్పత్తులన్నింటి ధరలూ ఎగబాకి ద్రవ్యోల్బణం విజృంభిస్తున్నది. ఇది మరింత ముదిరితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాబోయే ద్రవ్య సమీక్షల్లో కఠిన ద్రవ్య విధానాన్ని అనుసరించే అవకాశాలు లేకపోలేదు. దీంతో వడ్డీరేట్లు పెరుగడం ఖాయమనే మెజారిటీ విశ్లేషకులు అంటున్నారు. అదే జరిగితే రుణ లభ్యత క్షీణించి అన్ని రంగాల్లో కార్యకలాపాలు మందగిస్తాయి. మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతుందని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ముడి చమురు దిగుమతుల్లో ఏర్పడిన అంతరాయం.. దేశంలో అన్నింటి ధరల్ని ఎగదోయ గలదని గోల్డ్‌మన్ సాచ్స్ హెచ్చరిస్తున్నది. ఈ క్రమంలోనే ఈ ఏడాది ద్రవ్యోల్బణం 4.6 శాతానికి పెరుగవచ్చని అంచనా వేస్తున్నది. గతంలో ఇది 3.9 శాతంగానే ఉండటం గమనార్హం. కాగా, హర్మూజ్ జలసంధిలో వచ్చే నెల ప్రథమార్ధం వరకు పరిస్థితులు ఇలాగే ఉంటాయన్న అభిప్రాయాన్ని గోల్డ్‌మన్ సాచ్స్ వెలిబుచ్చుతున్నది. దీంతో భారత్ జీడీపీ అంచనాలు ఇంకా తగ్గిపోయినా ఆశ్చర్యం లేదన్న సంకేతాలు వస్తున్నాయి. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయిలో కదలాడుతున్నది. దీంతో ఈ ఒత్తిడి ఆర్బీఐపై తప్పక ఉంటుందని, అందుకే రెపోరేటు 50 బేసిస్ పాయింట్లు పెరిగే వీలున్నదని గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేస్తున్నది. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా రూపీ వాల్యూ దాదాపు 4 శాతం పతనమైంది. సోమవారం తొలిసారి 94 మార్కునూ దాటేసింది. నిజానికి గత ఏడాది మొత్తంగా 4.7 శాతం పతనం నమోదైంది. కానీ ఈ 3 నెలల్లోనే ఇంచుమించుగా అంతటి నష్టాలు వాటిల్లాయి. రూపాయి విలువ పడిపోయినకొద్దీ దేశంలోకి వచ్చే దిగుమతులు ఖరీదవుతాయి. చివరకు ఈ భారం వినియోగ దారులపైనే పడుతుంది. ఇక దేశీయ కరెంట్ ఖాతా లోటు జీడీపీలో ఈ సంవత్సరం 2 శాతానికి పెరుగవచ్చని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థపై విదేశీ రుణ భారం పెరుగు తుందని, డాలర్ నిల్వలు పడిపోయే వీలుందని అంటున్నది. దీనికితోడు రూపాయి కనిష్ఠ స్థాయికి పడిపోతోంది. మారకం విలువ పడిపోవడం వివిధ రంగాలపై ప్రభావం చూపుతోంది. దీంతో రానున్న రోజుల్లో ద్రవ్యోల్బణం మరింత ఆందోళనకరంగా ఉండనుంది.

---

# 30న బీహార్ సీఎంగా నితీశ్ రాజీనామా



**పాట్నా,మార్చి27:** బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మార్చి 30న సీఎం పదవికి రాజీనామా చేయనున్నారు. అలాగే ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేసే అవకాశం ఉంది. ఈనెల 16న రాజ్యసభకు నితీశ్ ఎన్నికయ్యారు. రాజ్యాంగ ప్రకారం ఒక వ్యక్తి ఒకేసారి రెండు సభల్లో పదవులు నిర్వహించరాదు. ఒక పదవిని 14 రోజుల్లోపు వదులుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం బిహార్ శాసనసభ, శాసన మండలికి మార్చి 29 వరకూ విరామం ఇచ్చారు. తిరిగి ఉభయసభలు ఈనెల 30న సమావేశమవుతాయి. అదే రోజు నితీశ్ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయనుండటం దాదాపు ఖారారైందని చెబుతున్నారు. మార్చి 16న బిహార్ నుంచి రాజ్యసభకు నితీశ్ ఎన్నికయ్యారు. మొత్తం 37 రాజ్యసభ స్థానాలకు ఖాళీ ఏర్పడగా, బిహార్, ఒడిశా, హర్యానాలోని 11 సీట్లకు మాత్రమే ఎన్నికలు జరిగాయి. తక్కిన స్థానాలకు ఎన్నికలకు ముందే పోటీలేకుండా అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, జేడీయూ అధ్యక్ష పదవికి నితీశ్ కుమార్ ఈనెల 24న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నితీశ్ మినహా ఎవరూ ఈ పదవికి నామినేషన్ వేయలేదు. లోక్‌సభ ఎన్నికలకు ముందు 2023 డిసెంబర్‌లో జేడీయూ అధ్యక్ష పదవికి లలన్ సింగ్ రాజీనామా చేయడంతో అప్పటి నుంచి ఆ పదవిని నితీశ్ నిర్వహిస్తున్నారు. అయితే కేం÷–దరంలో ఆయనకు కీలక మంత్రి పదవి కట్టబెట్టే అవకాశం ఉంది. ఈ కారణంగానే అతను రాజీనామా చేశారని అంటున్నారు.

# గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో భారీ స్థాయిలో చమురు తెట్టు

- సముద్ర జీవులపై తీవ్ర ప్రభావం

**మెక్సికో,మార్చి27:** గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో 600 కి.మీ మేర భారీ స్థాయిలో చమురు తెట్టు ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది. చమురు తెట్టు విస్తరించి సముద్ర జీవ వైవిధ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు మెక్సికో అధికారులు వెల్లడించారు. దీనివల్ల ఏడు ప్రకృతి సంరక్షణ ప్రాంతాలతో సహా సముద్రంలోని జీవరాశులపై పెను ప్రభావం పడిందన్నారు. రెండు సహజ చమురు ఊటలు, ఓ చమురు నౌక సముద్రంలో బోల్తాపడడం వల్ల ఈ ముప్పు సంభవించిందన్నారు. కొన్ని నెలల క్రితం భారీ వర్షాలు, వరదల కారణంగా మెక్సికోలోని వెరాక్రూజ్ ప్రాంతంలో సహజంగా చమురు బయటకు వచ్చే పైప్‌లైన్ దెబ్బతింది. దీంతో లీకైన చమురు నదుల ద్వారా సముద్రంలోకి చేరి, సుమారు 200 కిలోమీటర్ల తీరప్రాంతాన్ని దాటి మొత్తం 600 కిలోమీటర్ల వరకు వ్యాపించింది. అదనంగా, కాంపెచే బేలోని మరో సహజ చమురు ఊట కూడా నిరంతరం లీక్ అవుతూ కాలుష్యాన్ని మరింత పెంచుతోంది. ఇంకా ?. మూడు నెలల క్రితం సముద్రంలో ఒక చమురు నౌక మునిగిపోవడం వల్ల పరిస్థితి మరింత విషమించింది. ఈ ఘటనల వల్ల సముద్రంలోని వందలాది చేపలు, సముద్ర తాబేళ్లు వంటి జలచరాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. అలాగే, ప్రకృతి సంరక్షణ ప్రాంతాలు, బయోస్పియర్ రిజర్వులు, జాతీయ పార్కులు కూడా తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ప్రస్తుతం కాలుష్యాన్ని నియంత్రించేందుకు అధికార సిబ్బంది శుభ్రపరిచే చర్యలు చేపడుతున్నారు.

# వడ్డెర సంఘాల ఏర్పాటు

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం: మీడియాతో మంత్రి సవిత వెల్లడి



**అమరావతి,మార్చి27:** నూతన వ్డడెర సొసైటీల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని మంత్రి సవిత తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని స్పష్టం చేశారు. వడ్డెర్లకు ఇచ్చిన హామీలను మంత్రి నారా లోకేశ్ నిలబెట్టుకున్నారన్నారు. వ్డడెర్ల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని.. వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని సీఎం సంకల్పించారని మంత్రి సవిత వెల్లడించారు. కూటమితోనే వ్డడెర్లకు ఆర్థిక, సామాజిక గుర్తింపు అని మంత్రి తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మైనింగ్ లీజుల్లో వ్డడెర సొసైటీలకు 15 శాతం కేటాయింపు చేయనున్నట్లు తెలిపారు. సీనరేజీలో 50 శాతం మినహాయింపు కల్పించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర పండుగగా వడ్డె ఓబన్న జయంతిని నిర్వహిస్తున్నట్లు మంత్రి సవిత పేర్కొన్నారు. మైనింగ్ లీజుల్లో రిజర్వేషన్ల కేటాయింపు, 50 శాతం సీనరేజీ మినహాయింపు చర్యలపై వ్డడెర కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవితకు వ్డడెర కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వరరావు, డైరెక్టర్లు ధన్యవాదాలు తెలిపారు. అలాగే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు వ్డడెర్లు పాలాభిషేకం చేశారు.

# ఇజ్రాయిల్, అమెరికా నేతలే ‘శాంతి’ హంతకులు

ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు ఇరాన్‌లో అధికార మార్పిడి కోరుకుంటున్నాడు. ఆ విషయం కొత్తది కాదు. గత నలభైయేళ్లుగా చెపుతూనే ఉన్నాడు. గాజాలో హమాస్, లెబనాన్‌లో హిజ్బుల్లా, ఇప్పుడు ఇరాన్ తనను సవాలు చేసే శక్తులన్నింటినీ తుడిచిపెట్టి, ప్రాంతీయంగా తన ఆధిపత్యాన్ని నెలకొల్పుకోవాలని ఆయన కోరిక! తన లక్ష్య సాధనకు సహకరించే మిత్రుడి కోసం నెతన్యాహు ఎదురు చూశాడు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడయినప్పటి నుండి నెతన్యాహు వాషింగ్టన్‌కు మాటిమాటికీ చక్కర్లు కొట్టాడు. అన్ని సార్లు తిరగడమన్నది–ఇరాన్‌పై యుద్ధాన్ని ప్రేరేపించడానికేనని, ఇప్పుడు ప్రపంచానికి తెలిసిపోయింది. నెతన్యాహు వలలో పడ్డ ట్రంప్‌కు మాటపై నిలబడే లక్షణం లేదు. ఆయన పిచ్చిప్రేలాపనలకు అంతేఉండదు. టెహ్రాన్ నుండి రాబోయే అణుముప్పును శాశ్వతంగా నిర్మూలించి, ప్రపంచాన్ని కాపాడుతానంటాడు ఒకసారి. ఇరాన్‌లో అధికార మార్పిడి జరగాలంటాడు మరోసారి. అసలైతే, ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేస్తున్న దాఖలాలు లేవని అంతర్జాతీయ అణుసంస్థ డైరెక్టర్ జనరల్ రఫాయెల్ మరియానో వెల్లడించారు. అంటే, ట్రంప్ మాటల్లో నిజం లేదని తేలిపోయింది. ఇక ఇరాన్ అధికార మార్పిడి గురించి ఆ దేశ ప్రజలు చూసుకుంటారు. అది వారి అంతర్గత విషయం. అమెరికాలో తక్షణం అధికార మార్పిడి జరగాలని ఏ దేశాధినేత అయినా కోరుకుంటే, అందుకు ట్రంప్ సమ్మతిస్తాడా? ఇదీ అంతే!! బయటి వాడు బయటివాడి లాగానే ఉండాలి!ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికాలు కలిసి చేస్తున్న యుద్ధానికి ఆ రెండు దేశాల ప్రజల్లోనే అత్యధికుల ఆమోదం లేదు. అమెరికా చట్టసభ సభ్యులే ఈ యుద్ధాన్ని తీవ్రంగా విమర్శించారు. ఈ యుద్ధమేమైనా ఐక్యరాజ్య సమితిని ఒప్పించి




చేస్తున్నారా? లేదుకదా? రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అంతర్జాతీయంగా కొన్ని చట్టాలు, నిబంధనలు అమలులోకొచ్చాయి. ఇప్పుడు వీరుచేస్తున్న ఈ పిచ్చిపని వాటినన్నింటినీ ధ్వంసం చేసింది. అందుకే ప్రపంచంలోని ఏ ఒక్క దేశమూ వీరికి మద్దతు ప్రకటించడం లేదు. ట్రంప్ ఎన్ని రకాలుగా ఎన్నిసార్లు బెదిరించినా అవన్నీ పిచ్చి ప్రేలాపనలుగా ప్రపంచ నేతలు తేలికగా తీసుకుంటున్నారు.నెతన్యాహు, ట్రంప్ ప్రపంచం దృష్టిలో బ్యాడ్‌బోయిస్‌గా, పిచ్చివాళ్లుగా, జోకర్లుగా మిగిలిపోయారు. ఇరాన్ ఛాందసవాద పాలనను నిరసిస్తూ అక్కడి జైలులో మగ్గిన అభ్యుదయ కాముకులు సైతం, ఇజ్రాయిల్, అమెరికా చర్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. తమ దేశంలో జరుగుతున్న విధ్వంసాన్ని చూసి వారు తట్టుకోలేక పోతున్నారు. అంతర్గతంగా వారి సమస్యలేవైనా బయటివాడు వచ్చి యుద్ధం చేయడమంటే– తమ జీవితాల్ని ధ్వంసం చేయడమంటే ఎవరూ సహించరు కదా? అయితే, ఆ ప్రాంతంలో ముస్లిం– క్రైస్తవ మతాల మధ్య వైరుధ్యాలు ఈనాటివి కావు. అట్లని యుద్ధాల వల్ల ఆ వైరుధ్యాలు సమసి పోయేవీ కావు. ఎంతటి ఉన్నతమైన, బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్నా –అహంకారం తలకెక్కించుకుంటే ఇక అంతే– అతిచిన్న విషయం కూడా అర్థం చేసుకోలేరు.

# భద్రాచలం వెళ్తున్నారా? దర్శనం తర్వాత ఈ పవిత్ర ప్రదేశాలు సందర్శిస్తే యాత్ర సంపూర్ణం!



ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రం భద్రాచలం. ఈ క్షేత్రం కేవలం పుణ్యక్షేత్రం మాత్రమే కాదు! భద్రాచలం తెలుగువారి భావోద్వేగం! మహిమాన్వితమైన పుణ్యతీర్థం! ఇక్కడ ఎందరో మహర్షులు నివసి0చారు. ఈ ప్రాంతంలోనే శ్రీరామచంద్రుడు సీతా లక్ష్మణ సమేతుడై సంచరించాడు. రామాయణ రసరమ్య సన్నివేశాలతో పులకించిన దివ్యధాత్రి భద్రాచలం. ఏప్రిల్ 27, శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం భక్తులతో కిటకిటలాడుతుంది. మరి రాములోరి కల్యాణం తిలకించాక భద్రాచలంలో చూడాల్సిన ముఖ్య ప్రాంతాలు కూడా సందర్శించాలి కదా! భద్రాచలంలో తప్పకుండా చూడవలసిన విశేషాలు గురించి ఈ కథనంలో తెలుసుకుందాం.

## భద్రాద్రి రాముని ఆలయం

మొదటగా భక్తులు భద్రాద్రి రాముని దర్శించుకోవాలి. శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి నాలుగు దిక్కుల్లో నాలుగు గోపురాలు ఉంటాయి. ఈ గోపురాలు ఏ వైపు నుంచి చూసినా కనబడేంత ఎత్తులో ఉంటాయి. గర్భాలయ గోపుర శిఖరంపై రామదాసు వారికి గోదావరిలో లభించిన సుదర్శన చక్రం ప్రకాశిస్తూ ఉంటుంది. గర్భాలయంలో సీతారాముడు లక్ష్మణ సమేతంగా దర్శనమిస్తాడు. ఇక్కడ సీతమ్మ వారు శ్రీరాముని తొడపై కూర్చుని ఉన్న భంగిమలో దర్శనమిస్తుంది. ప్రధాన ఆలయం దర్శనం పూర్తయ్యాక ఇతర దర్శనీయ స్థలాలు కూడా దర్శించాలి. అవేంటో చూద్దాం.

## పవిత్ర పావన గోదావరి

భద్రాద్రి రాముని పాదాల చెంత ప్రవహించే పావన గౌతమిని దర్శించి శిరసుపై నీళ్ళు చల్లుకోవడం ఆనవాయితీ! ఈ గౌతమి భద్రాచలాన్ని పుణ్యక్షేత్రం గానే కాక పుణ్య తీర్థంగా కూడా ప్రకాశింపజేస్తోంది. గోదావరి తీరాన అందమైన సోపానాలు. వాటి మధ్య శుభ ప్రధాత గోదావరి మాతను దర్శించుకోవచ్చు. మరిన్ని మెట్లు ఎక్కితే ఆంజనేయస్వామి ఆశీర్వదిస్తూ కనిపిస్తాడు. ఆ పైన కనిపించే వల్లి సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం, అశ్వత్థ వృక్షం ఆధ్యాత్మిక భావనను కలిగిస్తాయి. రామయ్య దర్శనానికి వచ్చే భక్తులు గోదావరిలో పవిత్రస్నానం చేసి అశ్వత్థ వృక్షానికి ప్రదక్షిణలు చేస్తుంటారు.

## యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం

గోదావరి నుంచి రామాలయానికి వెళ్లే మార్గంలో శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం ఉంది. ఈ యోగానంద లక్ష్మీనరసింహుడు మహర్షులచే ప్రతిష్ఠించబడిన స్వామి.

## గోవింద స్వామి మఠం

గోవింద స్వామి మఠం గోదావరి తీరాన కల్యాణ మండపానికి ఎదురుగా ఉంది. ఒకప్పుడు ఇక్కడ సాధువులు నివసించేవారు. గోవిందస్వామి అనే యోగి పుంగవుడు, శ్రీరామభక్తుడు జీవ సమాధి పొందిన పవిత్ర స్థలం ఈ మఠంలోనే ఉంది.

## కల్యాణ మండపం

ఈ కళ్యాణ మండపంలోనే ఏటా శ్రీరామనవమికి సీతారాముల కళ్యాణ మహోత్సవం మహా వైభవంగా జరుగుతుంది. లక్షలాది భక్తులు ఈ కల్యాణాన్ని కనుల పండువగా దర్శిస్తారు. అద్భుత శిల్పకళా ఖండమైన ఈ కళ్యాణ మండపం రామాలయం సమీపంలోనే ఉంది.

వైకుంఠ ద్వారం

ప్రధాన ఆలయ ఉత్తర గోపురం నుంచి కిందకు దిగితే అక్కడే ఉత్తర వైకుంఠ ద్వారం ఉంది. 1974లో ఈ ద్వారం ఏర్పాటు చేశారు. లక్షలాది మంది భక్తులు దర్శించడానికి వీలుగా ద్వారానికి ఎదురుగా విశాలమైన కళ్యాణ మండపం ప్రాంగణం ఉంది. చడానికి వీలుగా ద్వారానికి ఎదురుగా విశాల ప్రతి ఏటా వైకుంఠ ఏకాదశి నాడు వైకుంఠ రాముడు గరుడ వాహనరూరుడై అశేష భక్తకోటికి ఇక్కడే దర్శనమిస్తాడు.

## మిథిలా నగరం స్టేడియం

వైకుంఠ ద్వారానికి అభిముఖంగా మిథిలా నగరం స్టేడియం ఉంది. వేలాదిమంది భక్తులు సీతారాముల కల్యాణం వీక్షించడానికి వీలుగా ఈ స్టేడియం నిర్మించి ఉంది.

## అన్నదాన సత్రం

మిథిలా స్టేడియం సమీపంలో గోవిందస్వామి మఠానికి ఎదురుగా స్వామి వారి అన్నదాన సత్రం ఉంది. ఇక్కడ ప్రతిరోజూ వేలాదిమంది అన్నప్రసాదాన్ని స్వీకరిస్తారు.

## శివాలయం

రామాలయానికి దక్షిణంగా రంగనాయకుల గుట్ట కింద అతి ప్రాచీనమైన శివాలయం ఉంది. రామలింగేశ్వర స్వామిగా శివుడు వెలసిన ఈ శివాలయాన్ని కూడా భక్తులు తప్పకుండా దర్శించుకోవాలి.

కుసుమ హరినాథ బాబా మందిరం

శివాలయం నుంచి మెట్లు ఎక్కిపైకి వెళ్తే కుసుమ హరినాథ బాబా మందిరం ఉంటుంది. ఈ మందిరంలో కుసుమకుమారి, హరినాథ బాబాల పాలరాతి విగ్రహాలు ఉన్నాయి.

రంగనాయకస్వామి ఆలయం

హరినాథ బాబా మందిరం నుంచి మెట్లు ఎక్కి పైకి వెళ్తే రంగనాయకస్వామి దేవాలయం కనబడుతుంది. రంగనాథుడు శేష పర్యంకం పవళించి ఉంటాడు. ప్రతి ఏటా ఈ స్వామికి కల్యాణోత్సవాలు, తిరువీధి సేవలు జరుగుతాయి.

## రామదాసు ధ్యాన మందిరం

రంగనాయకస్వామి గుట్టపై రామదాసు స్మృతి చిహ్నంగా రామదాసు ధ్యాన మందిరం ఉంటుంది. ప్రధాన ద్వారం లోనే రామదాసు శిలా విగ్రహం దర్శనమిస్తుంది. విశాలమైన ఈ ధ్యాన మందిరం గోడలన్నీ రామదాసు కీర్తనలు, దాశరథి శతకం చెక్కిన శిలాఫలకాల తో నిండి ఉన్నాయి. భద్రాద్రి పుర విశేషాల్లో ఇది తప్పక దర్శించాల్సిన కట్టడం. ఈ ప్రదేశంలోనే కుటీరం నిర్మించుకొని రామదాసు శేష జీవితాన్ని గడిపి తరలించినట్లు పెద్దలు చెబుతారు.

## అంబా సత్రం

రామాలయం ముందు నాలుగైదు మెట్లు దిగి దక్షిణం వైపు మెట్లు దిగితే అంబా సత్రం ఉంటుంది. నరసింహ దాసుగారు ఆరాధించిన శ్రీ సీతారామలక్ష్మణ దివ్య మూర్తులను ఇక్కడ దర్శించవచ్చు.

## గోవిందరాజస్వామి ఆలయం

రాజ వీధిలో విశ్రాంతి మండపం నుంచి కొంత దూరం సాగితే గోవిందరాజస్వామి దేవాలయం కనిపిస్తుంది. భద్రాద్రి రాముడు సీతా లక్ష్మణ సమేతుడై తిరువీధి సేవకు బయలుదేరి ఊరేగింపుగా వస్తూ దారిపొడవునా హారతులు అందుకుంటూ ఈ గోవిందరాజస్వామి ఆలయంలో కొద్దిసేపు విశ్రమిస్తాడని అంటారు.

## దాసాంజనేయ స్వామి

తాత గుడికి అభిముఖంగా దాసాంజనేయ స్వామి ఆలయం ఉంది. శ్రీ సీతా లక్ష్మణ సమేతుడైన శ్రీరాముడు తిరువీధి సేవకి వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు దాసాంజనేయ స్వామిని తనివితీరా దర్శించుకుంటాడంట! ప్రతి మంగళవారం ఇక్కడ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు.

## అభయాంజనేయస్వామి దేవాలయం

గోదావరి వంతెన దాటి వెళితే అక్కడే అభయాంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకోవచ్చు. ఆ పక్కనే అయ్యప్ప స్వామి ఆలయం కూడా ఉంటుంది.

ఇవేనండి భద్రాచలం విశేషాలు! మరి రామయ్య కల్యాణానికి వెళ్లినప్పుడు ఇవన్నీ మర్చిపోకుండా దర్శిద్దాం. ఆ అనుభూతులను వచ్చే శ్రీరామనవమి వరకు మనసారా స్మరిద్దాం.

## జై శ్రీరామ్!

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# పవర్‌ఫుల్ కషాయం మావ.. ఉదయాన్నే తాగితే ఆ సమస్యలన్నీ మటుమాయమే..

జామ చెట్టు భారతీయ సంస్కృతిలో ఒక అమృత ఫలంగా ప్రసిద్ధి చెందింది. దీనిని సంస్కృతంలో అమృత ఫలం అని కూడా పిలుస్తారు. జామ మొక్క ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తుంది. కేవలం పండ్లు మాత్రమే కాకుండా, దీని ఆకులు, బెరడు, వేర్లు కూడా ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. జామను బొటానికల్‌గా సిడియం గ్వాజావా అని అంటారు. ఇది మెర్టేసి కుటుంబానికి చెందిన వృక్షం. జామ ఆకుల్లోని యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి, పొటాష్జామ ఆకులు గా, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలతో పేగులోయం వంటి పోషకాలతో నిండిన సహజ ఔషధం ఎన్నో సమస్యలకు దివ్యౌషధంలా పనిచేస్తాయి. ఇవి మధుమేహాన్ని నియంత్రించడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో, అతిసారం (డయేరియా) తగ్గించడంలో, కొలెస్ట్రాల్ తగ్గించి గుండె ఆరోగ్యాన్ని పెంపొందించడంలో.. రోగనిరోధక శక్తిని పెంచడంలో అద్భుతంగా పనిచేస్తాయని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు..జామ -- ఆరోగ్యానికి చిరునామా అని చెప్పొచ్చంటున్నారు. జామ చెట్లు భారతదేశంలో ముఖ్యంగా ఉష్ణమండల, ఉప ఉష్ణమండల ప్రాంతాలలో పెరుగుతాయి. ఇప్పుడు.. అన్ని ప్రాంతాల్లోనూ ఏడాది పొడువునా తక్కువ ధరకే లభిస్తున్నాయి.. జామ ఉపయోగించి.. ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చు..ముఖ్యంగా జామ ఆకులు విరేచనాలు, దంత నొప్పులు వంటి సమస్యలకు ఆయుర్వేదం ప్రకారం, జామ ఆకులు శోధనివారణిగా, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలతో పేగులోని ఇన్ఫెక్షన్లను తగ్గించి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. విరేచనాలను తగ్గించేందుకు ఒక పిడికెడు జామ ఆకులను 100 మిల్లీలీటర్ల నీటిలో వేసి 25 మిల్లీలీటర్ల వరకు మరిగించి కషాయం చేసుకుని తజామ ఆకులు శోధనివారణిగా, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలతో పేగులోగవచ్చు.దంత నొప్పికి కొన్ని జామ ఆకులను నమిలి, ఆ పేస్ట్‌ను నొప్పి ఉన్న పంటిపై ఉంచడం ద్వారా ఉపశమనం పొందవచ్చు. జామ ఆకుల్లోని యాంటీ ప్లేక్ గుణాలు నోటి ఆరోగ్యానికి తోడ్పడతాయి.జామ ఆకులకి యాంటీ ప్లేక్ లక్షణాలు.. ఇది నోట్లో ఉండే హానికరమైన బ్యాక్టీరియాను నాశనం చేసి, దంతాల మీద పేరుకుపోయే ప్లేక్‌ను తగ్గిస్తుంది. దీనితో దంత నొప్పి, నోటి సంబంధిత సమస్యలు తగ్గుతాయి.జామాకుల కాషాయం.. మధుమేహంలో మంచిగా పనిచేస్తుం ది. షుగర్ ను కంట్రోల్ ఉంచుత ంది. అంతేకాకుండా.. కొలెస్ట్రాల్ తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో.. రోగనిరోధక శక్తిని పెంచడంలో పనిచేస్తుంది.ఈ అద్భుమైన జామ మొక్క, ఆకులను మనం ఉపయోగించు కుని ప్రయోజనాలను పొందవచ్చని పేర్కొం టున్నారు ఆయుర్వేద నిపుణులు.. దీనికోసం ఉదయాన్నే పరగడుపున ఆకుల కాషాయాన్ని తీసుకోవడం మంచిదని పేర్కొంటున్నారు. అయితే.. ఏమైనా సమస్యలతో బాధపడుత ంటే.. జామాకుల కాషాయం ఉపయోగించే ముందు వైద్య నిపుణులను సంప్రదించండి..

# రాయల్? ఎన్?ఫీల్డ్ నుంచి కొత్త మోడల్? వస్తోంది- కంపెనీ వదిలిన టీజర్ చూశారా?



మోటార్‌సైకిల్ తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ తన అప్డేటెడ్ "2026 రాయల్ ఎన్‌ఫీల్డ్ గెరిల్లా 450" మోడల్?ను మార్చి 27న భారత మార్కెట్లో విడుదల చేయనుంది. ఈ అప్డేటెడ్ మోటార్‌సైకిల్‌లో కొత్త ఎలక్ట్రానిక్ ఫీచర్లను పొందుపరుస్తారని, ఇది దాని ప్రజాదరణను మరింత పెంచడంలో సహాయపడుతుందని భావిస్తున్నారు.ఫీచర్ల పరంగా చూస్తే, కంపెనీ క్రూయిజ్ కంట్రోల్ అండ్ ట్రాక్షన్ కంట్రోల్ వంటి ఎలిమెంట్?లను కూడా చేర్చవచ్చు. తద్వారా ఈ రోడ్‌స్టర్ సుదూర ప్రయాణాలకు మరింత సామర్థ్యాన్ని జోడించవచ్చు. ఇంకా ఈ మోటార్‌సైకిల్‌లో క్విక్‌షిఫ్టర్‌ను కూడా అమర్చవచ్చు. ఇది క్లచ్ లేకుండా గేర్లు మార్చడానికి వీలు కల్పిస్తూ, రోజువారీ ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తుంది.

ప్రయాణ సౌకర్యంపై ప్రత్యేక దృష్టి: మోటార్‌సైకిల్ వెనుక సస్పెన్షన్‌కు చేసే మార్పులు, ముఖ్యంగా గరుకుగా లేదా ఎగుడుదిగుడుగా ఉన్న రోడ్లపై, ప్రయాణ నాణ్యతను గణనీయంగా మెరుగుపరుస్తాయి. అంతేకాకుండా మరింత కచ్చితమైన హ్యాండ్లింగ్, మెరుగైన ఫీడ్‌బ్యాక్‌ను అందించే లక్ష్యంతో, అప్డేటెడ్ హ్యాండిల్‌బార్‌లు లేదా అప్‌సైడ్-డౌన్ ఫోర్క్‌లను చేర్చడం ద్వారా ముందు సస్పెన్షన్ సెటప్‌లో కూడా సర్దుబాట్లు చేయవచ్చుఈ మోటార్‌సైకిల్ మొత్తం హార్డ్‌వేర్ లేఅవుట్ మారకుండా ఉంటుందని అంచనా. అయినప్పటికీ, దీనికి మరింత రోడ్-ఫోకస్డ్ టైర్లను అమర్చవచ్చు. ఈ బైక్ 17-అంగుళాల అల్లాయ్ వీల్స్‌ను ఉపయోగించడం -పర్పస్ సెటప్‌తో పోలిస్తే కొత్త టైర్లు తారు రోడ్లపై మెరుగైన పట్టు, స్థిరత్వాన్ని అందించగలవు.

ఇంజిన్, హార్డ్‌వేర్: యాంత్రికంగా, 2026 రాయల్ ఎన్‌ఫీల్డ్ గెరిల్లా 450లో ఎలాంటి మార్పులు ఉండవు. ఇది అదే 452సిసి, సింగిల్-సిలిండర్, లిక్విడ్-కూల్డ్ ఇంజిన్‌ను ఉపయోగిస్తుంది. ఈ ఇంజిన్ 8,000 తీజూఎ వద్ద 39.5 ఎప్త్రజూ శక్తిని, 5,500 తీజూఎ వద్ద 40 చీఎ టార్క్‌ను అందిస్తుంది. ఇది 6-స్పీడ్ గేర్‌బాక్స్?తో వస్తుంది.ఈ ఇంజిన్?ను స్టీల్ ట్విన్-స్పార్ ఫ్రేమ్‌లో అమరి ఉంటుంది, దీనికి ముందువైపు టెలిస్కోపిక్ ఫోర్కులు, వెనుకవైపు ప్రీలోడ్-అడ్జస్టబుల్ మోనోషాక్ సపోర్ట్‌గా ఉంటాయి. బ్రేకింగ్ కోసం, రెండు చక్రాలపై డిస్క్ బ్రేకులు ఉంటాయి. ఈ రెండింటికీ డ్యూయల్-ఛానల్ ాదీూ సపోర్ట్ ఉంటుంది.

ధర ఎంత ఉండొచ్చు?: ధర విషయానికి వస్తే, ఈ రోడ్‌స్టర్ బైక్ అధికారిక ధర దాని ఆవిష్కరణ సమయంలోనే వెల్లడికానుంది. అయితే, ప్రస్తుత మోడల్ ఎక్స్-షోరూమ్ ధరరూ. 2.56 లక్షలతో పోలిస్తే, ఈ అప్డేటెడ్ మోడల్ ధర సుమారు రూ. 5,000 నుంచి రూ. 7,000 వరకు అధికంగా ఉండవచ్చు.

# తీర్థయాత్రలు వయసు మళ్లిన వారే చేయాలా అసలు పురాణాలు చెప్పే నిజం ఏంటి?



హిందూ సంప్రదాయంలో పూజలకు, వ్రతాలకు ఎంత గొప్ప స్థానం ఉందో తీర్థయాత్రలకు కూడా అంతే గొప్ప స్థానముంది. తీర్థయాత్రల వల్ల పుణ్యం, పురుషార్థం దక్కుతాయి. ఆధ్యాత్మిక జ్ఞాన సముపార్జనకు తీర్థయాత్రలు చేయాలని పురాణాలు చెబుతున్నాయి. పురాణ పురుషులెందరో తీర్థయాత్రల వలన ముక్తి పొందారని తెలుస్తోంది. ఈ సందర్భంగా తీర్థయాత్రలు ఎందుకు చేయాలి? తీర్థయాత్రలు వయసు మళ్లిన వారే చేయాలా? అనే ఆసక్తికరమైన విషయాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

## తీర్థయాత్రలు ఎవరు చేయాలి?

సాధారణంగా క్షేత్ర దర్శనం అనేది వయసుమళ్లిన వాళ్లు మాత్రమే చేయాలని అనుకుంటూ ఉంటారు. నిజానికి పుణ్య తీర్థాలు వయసులో ఉండగానే దర్శించాలి. ఆ జ్ఞాపకాలు పంచే అనుభూతిని వయసుమళ్లిన తరువాత అనుభవించాలి. వయసు మళ్లిన తరువాత కావాల్సినంత సమయం ఉంటుంది కానీ శరీరం సహకరించకపోవచ్చు. ఒంట్లో సత్తువ ఉన్నప్పుడు దివ్య క్షేత్రాలు దర్శిస్తూ పుణ్యం సంపాదించుకోవాలి.

## తీర్థయాత్రలు ఆవశ్యకత

సర్వాంతర్యామి అయిన భగవంతుని వెదుక్కుంటూ అంతంత దూరాలు వెళ్లడం అవసరమా? అనుకునేవారు లేకపోలేదు. దేవుడు అడుగడుగునా వున్నాడు నిజమే కానీ పుణ్య క్షేత్రాలకు స్థల మహాత్మ్యం ఉంటుంది. దేవతలు, ఋషులు, మహా పురుషుల పాద ధూళితో ఆ ప్రదేశాలు మరింత పవిత్రమమై ఉంటాయి. అక్కడి నీరు ఎన్నో ఔషధ గుణాలు సంతరించుకుని ఉంటుంది. అందుకే పుణ్యక్షేత్రాల సందర్శనకు భారతీయ సంప్రదాయం పెద్ద పీట వేసింది.

## పురాణ పురుషులు చేసిన తీర్థయాత్రలు

వనవాసం సమయంలో పాండవులు శ్రీకృష్ణుని ఆదేశం మేరకు అనేక పుణ్యక్షేత్రాలు సందర్శించినట్లుగా మహా భారతంలో వివరించి ఉంది. అలాగే పరశురాముడు, ఇతర పురాణ పురుషులు, మహర్షులు ఎందరో తీర్థయాత్రలు చేసి ముక్తిని పొందినట్లుగా పురాణాలు చెబుతున్నాయి. అలాగే శ్రీరాముడు కూడా రావణ సంహారం తరువాత బ్రహ్మహత్యా దోషం పోగొట్టుకోవడానికి అనేక తీర్థయాత్రలు చేసినట్లుగా తెలుస్తోంది. సాక్షాత్తు పరమశివుడే బ్రహ్మ శిరస్సు ఖండించిన పాపాన్ని పోగొట్టుకోవడానికి బ్రహ్మ కపాలం చేత ధరించి అనేక పుణ్యక్షేత్రాలు దర్శించినట్లుగా శివపురాణంలో వివరించి ఉంది. మహాభారతంలో కురుక్షేత్ర యుద్ధానికి ముందు బలరాముడు కూడా తీర్థయాత్రలకు వెళ్లినట్లుగా వివరించి ఉంది.

## చరిత్ర చెప్పిన సత్యం

ఇలా మన పురాణాలు, ఇతిహాసాల్లో తీర్థయాత్రలు చేస్తూ మోక్షాన్ని పొందిన వారు అనేకమంది కనిపిస్తారు. రామాయణంలో అంధులైన తన తల్లిదండ్రులను కావడిలో మోసుకుని వెళ్తూ తీర్థయాత్రలు చేయించిన శ్రవణ కుమారుని కథ మనందరికీ తెలిసిందే! అలాగే మనుచరిత్రలో సిద్ధుడు తీర్థయాత్రలు చేసి కేదారేశుని, హింగులాంబిక దేవిని దర్శించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఇలా తీర్థయాత్రలతో ముక్తి పొందిన వారి గురించి మన పురాణేతిహాసాలు వివరిస్తున్నాయి.

## పుణ్యం - పురుషార్థం

ఆధ్యాత్మిక చింతన పెంచే తీర్థయాత్రలు పుణ్యపురుషార్థాల సాధనకు సోపానాలు. యాత్రల ద్వారా పుణ్యం లభిస్తుందన్న విషయం తెలిసిందే! అయితే పురుషార్థం అంటే ఏమిటి? వివిధ ప్రాంతాలను సందర్శించడం ద్వారా ఆయా ప్రాంతాల ప్రజల జీవన విధానాలు, ఆ ప్రాంతాల సామాజిక ఆర్థిక పరిస్థితులపై అవగాహన కలుగుతుంది. అంతేకాదు తీర్థయాత్రలు చేసే సమయంలో ఇతర యాత్రికులతో కలిసిమెలిసి ఉండడం వలన సామాజిక సంబంధాలు కూడా మెరుగు పడతాయి. దీనినే పురుషార్థం అంటారు.

## పఠనం, శ్రవణం కూడా మోక్ష కారకము!

తీర్థక్షేత్రాలను దర్శించడం మాత్రమే కాదు వాటి గురించిన విశేషాలు చదవడం, ఇతరులకు ఆ వివరాలు వివరించి చెప్పడం, ఇతరుల ద్వారా క్షేత్ర మహత్యాన్ని వినడం వంటివి కూడా మోక్ష కారకలే అని శాస్త్రం చెబుతోంది.

## దర్శనీయ స్థలాలు

ఇక మన దేశంలో తీర్థయాత్రలు గా భావించే పుణ్య ప్రదేశాలు అనేకం ఉన్నాయి. అలాంటి దర్శనీయ స్థలాల్లో ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తిపీఠాలు, పంచారామాలు, చార్ ధామ్, పంచభూత క్షేత్రాలు మొదలైనవి ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా హిందువుగా జన్మించిన ప్రతి ఒక్కరు సప్త మోక్ష ధామాలుగా ప్రసిద్ధి చెందిన అయోధ్య, మథుర, కంచి, మాయ, అవంతి, కాశీ, ద్వారకా అనే సప్త మోక్ష క్షేత్రాలను తప్పకుండా దర్శించాలని అంటారు.

## తీర్థయాత్రల్లో ఎలా మెలగాలి?

పుణ్యం కోసం చేసే తీర్థయాత్రలలో ఎలా నడుచుకోవాలో మన ధర్మశాస్త్రం చెప్పింది. తీర్థయాత్రలు చేసే సమయంలో అసూయ, ద్వేషం, అసత్యం అనే దుర్గుణాలను విడిచి పెట్టాలి. శక్తికొద్దీ దానధర్మాలు లభిస్తాయి. అదే ముక్తిమార్గం.

## శుభం భూయాత్!


ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. న్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం వారు బ్రహ్మశ్రీ శ్రీ బాచంపల్లి కమలాకర్ శర్మ గారికి



**వికారాబాద్** పూర్వ జ్యోతిష్య శాస్త్రంలో ...ఉత్తీర్ణులగుట వలన శ్రీ బాచంపల్లి కమలాకర్ శర్మ గారిని డాక్ట రేటు బిరుదు ప్రధానం చేసినారు.. కావున ఆర్యవైశ్య సంఘం సిర్పూర్ కాగజ్నగర్ వారు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో సీతారాముల కళ్యాణ అనంతరం ఘనంగా సన్మానం చేసినారు.. ఈ కార్యక్రమం అధ్యక్షుడు కేశెట్టి శంకరయ్య గారు, ప్రచార కార్యదర్శి బి రాజేంద్ర ప్రసాద్ గారు, అసోసియేట్ ప్రెసిడెంట్ కుంకుముట్టి సత్యనారాయణ గారు, రాచకొండ గిరీష్ గారు,రాచకొండ సంతోష్ గారు మైలారం మురళీధర్ గారు, వైశ్య యువజన సంఘ అధ్యక్షుడు శ్రీ గోరంట్ల అరుణ్ గారు, మరియు ఆర్యవైశ్య సంఘ సభ్యులు అందరూ పాల్గొన్నారు..

# సీతారాముల వారి కళ్యాణ వేడుకల్లో పాల్గొన్న పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి



**వికారాబాద్ జిల్లా మార్చి 28** పరిగి డివిజన్ దోమ పట్టణంలో శ్రీరామ నవమి సందర్భంగా, శ్రీ సీతారాముల వారి కళ్యాణ వేడుకల్లో పాల్గొని, స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించిన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఈ కార్యక్రమం లో దోమ మాజీ జెడ్పిసి నాగి రెడ్డి పరిగి బి ఆర్ఎస్ మండల అధ్యక్షులు ఆంజనేయులు ,బుద్దుల శ్రవణ్ రెడ్డి గారు, దోమ మాజీ సర్పంచ్ రాజి రెడ్డి లక్ష్మయ్యా , సంతోష్ , భాస్కర్, మండల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్ లు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు...

# ఘనంగా శిశుమందిర్ విద్యాపీఠ ఆవిర్భావ దినోత్సవం



**నారాయణఖేడ్ డివిజన్ రిపోర్టర్** పెద్దశంకరంపేట. పెద్ద శంకరంపేటలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ లో శుక్రవారం శ్రీ సరస్వతి శిశు మందిర్ విద్యాపీఠం ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన ఆచార్యులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్రమశిక్షణ దేశభక్తి జాతీయభావంతో కూడిన విద్యను శిశు మందిరాలలో అందించడం జరుగుతుందన్నారు. శ్రీరామనవమి పండుగ రోజున శ్రీ సరస్వతి విద్యాపీఠం స్థాపించడం జరిగిందని శిశు మందిరాల యొక్క విశిష్టత గురించి వివరించారు.. అనంతరం పప్పు పచ్చడి విద్యార్థులకు పెద్దలందరికీ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శిశు మందిర్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దాదిగారి గంగాధర్ క్రాంతి లాల్. ప్రబంధకారుని సభ్యులు పున్నయ్య జస్వంత్ టి రవీందర్. రవి వర్మ రాము ఆచార్యులు జైహింద్ రెడ్డి శ్రీనివాస్ మాతాజీలు విద్యార్థులు పాల్గొన్నారు..

# పౌర సరఫరాల గోదామును తనిఖీ చేసిన తాసిల్దార్ ప్రభుదాస్.



**నారాయణఖేడ్ శంకరంపేట** .పెద్ద శంకరంపేటలోని పౌర సరఫరాల గోదామును పేట తాసిల్దార్ ప్రభుదాస్ శుక్రవారం పరిశీలించారు. వచ్చే ఏప్రిల్ మాసం నుండి రేషన్ కార్డు లబ్ధిదారులకు మూడు నెలకు సంబంధించిన బియ్యం సరఫరా చేయడం జరుగుతుందని వివరించారు. దీనికి సంబంధించి మండలంలో మొత్తం ఉన్న రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేయనున్నట్లు వివరించారు. ఎక్కడైనా రేషన్ దుకాణాలలో రేషన్ బియ్యం విలువ చేయడానికి స్థలం ఇబ్బందులు కలిపితే ప్రభుత్వ పాఠశాలల్లో విలువ ఉంచుకోవాలని సూచించారు.ఆయన వెంట తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ నవమి సందర్బంగా చింతగూడెం గ్రామంలో నిర్వహించిన ఎడ్ల పందెం





**హాలియా 28/03/26 :**శ్రీరామ నవమి సందర్భంగా చింతగూడెం గ్రామంలో నిర్వహించిన ఎడ్ల పందెం పోటీలలో 8 క్వింటల్ల బండారయి పోటీలో మొదటి బహుమతి పల్లెబోయన నారాయణ 6016/- సర్పంచ్ తగుల్ల అంజయ్య గారి చేతులమీదుగా అందజేశారు, రెండవ బహుమతి 5016/- తగుల్ల మధు గారికి గుండెబోయిన వెంకన్న (మారేపల్లి మాజీ సర్పంచ్ ) అందచేశారు, మూడవ బహుమతి 4016/- కదిర నర్సయ్య గారికి కూరాకుల రమేష్, కూరాకుల వెంకటేశ్వర్లు 2,4 వార్డ్ మెంబర్స్ అందచేశారు. జూనియర్ విభాగంలో 4 క్వింటల్ల రాయి పందెంలో మొదటి బహుమతి3016/- పల్లెబోయిన కొండల్ కి కూరాకుల సత్యనారాయణ (గుడి చైర్మన్ ) అందచేశారు. రెండవ బహుమతి 2500/- కదిర శంకర్ కి నామ ప్రవీణ్ అందచేశారు, మూడవ బహుమతి 2016/- తగుల సత్యనారాయణకి కూరాకుల రామలింగయ్య మూడవ వార్డ్ మెంబర్ అందజేశారు కార్యక్రమం లో గ్రామస్థులు పాల్గొన్నారు.

# అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం

**ఆదిలాబాద్ :** కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండే విఠల్ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం డబ్బా గ్రామంలో అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు డబ్బా గ్రామంలో అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలో బాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.సీతారాముల కల్యాణం అనంతరం సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్సీ దండే విఠల్ మంగళ హారతి సమర్పించారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ సీతారాముల కల్యాణ మహోత్సవం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు



ప్రజల్లో ఐక్యతను పెంచుతాయి అని అన్నారు ఆలయ కమిటీ సభ్యులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించడం అభినందనీ యమని కొనియాడారుఇంతటి కళ్యాణ మహోత్సవంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించిన ఆలయ కమిటీ సభ్యులకు ఎమ్మెల్సీ ధన్యవాదాలు తెలిపారు భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించాలని ఆలయ ప్రాంగణంలో ఫ్లోరింగ్ కల్పిస్తూ ఆలయ అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ అద్దాల మల్లేష్ కోరారు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ త్వరలోనే అభయ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు అనంతరం అభయ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహా అన్నప్రసాద వితరణ కారిక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ దండే విఠల్ భక్తులకు అన్నప్రసాదం వడ్డన చేశారు ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సిడం గణపతి వార్డు సభ్యులు అంగోళ్ళ చిలుకయ్య యువ నాయకులు విజయ్ మరియు ఆలయ కమిటీ చైర్మన్ అద్దాల మల్లేష్ వైస్ చైర్మన్ జాగరి శ్రీశైలం కమిటీ సభ్యులు హనుమాన్ స్వాములు భక్తులు గ్రామస్థులు యువకులు తదితరులు పాల్గొన్నారు

# సెల్ ఫోన్ దొంగల ముఠా గుట్టురట్టు.. 25 ఖరీదైన ఫోన్లు స్వాధీనం - సి సి ఎస్ ఇన్స్పెక్టర్, బల్వంత్ రాయ్.

**వికారాబాద్ జిల్లా మార్చి 28 :**వికారాబాద్ జిల్లాలో రద్దీగా ఉండే కూరగాయల మార్కెట్ ప్రాంతాలలో ఖరీదైన సెల్ ఫోన్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను జిల్లా సిసిఎస్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. జిల్లాలో సెల్ ఫోన్ దొంగతనాలను నివారించడానికి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, × ఆదేశాల మేరకు జిల్లా సీసీఎస్ ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్, వికారాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘు కుమార్ ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు.

జిల్లాలోని వికారాబాద్ మరియు బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన సెల్ ఫోన్ దొంగతన కేసులపై దర్యాప్తు ప్రారంభించిన సీసీఎస్ బృందం, సీసీటీవీ ఫుటేజ్ మరియు టెక్నికల్ ఆధారాలను విశ్లేషించి నిందితుల కదలికలను గుర్తించింది. ఈ క్రమంలో సెల్ ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను గుర్తించి, కే. రవి అలియాస్ గౌరి (డోన్ మండలం, కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్)ను అదుపులోకి తీసుకున్నారు.విచారణలో నిందితుడు తనతో పాటు మరో ఐదుగురు పెద్దవారు మరియు ముగ్గురు మైనర్ బాలుర సహాయంతో వికారాబాద్ పోలీస్ స్టేషన్, బొంరాస్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలలో మరియు జిల్లాలోని రద్దీ ప్రాంతాలలో దొంగతనాలు చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. ఈ ముఠా సభ్యులు ఆటోలు మరియు బైక్‌లపై తిరుగుతూ, రద్దీ మార్కెట్‌లలో ఖరీదైన సెల్ ఫోన్‌లను లక్ష్యంగా చేసుకుని, ప్రజలు కూరగాయలు కొనుగోలు చేస్తూ అప్రమత్తంగా లేని సమయంలో మైనర్ బాలురతో దొంగతనాలు చేయించేవారు. అనంతరం సెల్ ఫోన్‌లను వెంటనే ముఠా సభ్యుల మధ్య మార్చుకుంటూ ఆధారాలు లేకుండా చేయడం జరుగుతుంది అని



తెలియజేయడం జరిగింది. సిసిఎస్ పోలీసులు, వికారాబాద్ పోలీసులు నిందితులు అద్దెకు తీసుకున్న నివాస ప్రాంతంలో సోదాలు నిర్వహించి, మొత్తం 25 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.ఇట్టి కేసులో నిందితులుగా కే. రవి అలియాస్ గౌరి, బి. మహేష్, ఆకుల కార్తీక్, వడ్డె మురళి, వడ్డె వెంకటేష్ మరియు సంపంగి తిరుపతి లను గుర్తించారు.ఈ సందర్భంగా జిల్లా సి సి ఎస్ ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్ మాట్లాడుతూ “రద్దీ ప్రదేశాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఖరీదైన మొబైల్ ఫోన్‌లను జాగ్రత్తగా ఉంచుకోవాలి. ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. సెల్ ఫోన్ దొంగతనాలు చిన్న నేరాలు కావని,వీటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నాము. ఈ ముఠా పట్టుబడటంలో కీలకంగా వ్యవహరించిన సి సి ఎస్ టీం మరియు వికారాబాద్ పిఎస్ కర్నూలు జిల్లా ఆంధ్ర ప్రదేశ్ టీం సిబ్బందిని అభినందిస్తున్నాము. ఇట్టి నేరస్థులు అందరూ పాత నేరస్థులే,ఇట్టి వారిపైన వివిధ పోలీస్ స్టేషన్ లలో పలు



కేసులు నమోదు అయి ఉన్నాయి అని తెలిపినారు.

అరెస్టయిన నిందితుల వివరాలు:

1.కె. రవి (అలియాస్ గౌరి): కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్.
2. బి. మహేష్: మహబూబ్ నగర్ జిల్లా.
3. ఆకుల కార్తీక్: శేరిలింగంపల్లి, హైదరాబాద్.
4. వడ్డే మురళి: జడ్చర్ల, మహబూబ్ నగర్ జిల్లా.
5. వడ్డే వెంకటేష్: బాలానగర్, మహబూబ్ నగర్ జిల్లా.
6. సంపంగి తిరుపతి: పాపిరెడ్డి కాలనీ, హైదరాబాద్.

స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్ ల వివరాలు.

వికారాబాద్, బొంరాస్ పేట్ పోలీస్ స్టేషన్ లలో చోరీ అయిన సెల్ సెల్ ఫోన్ లతో పాటు సుమారు 3,75,000 రూపాయల విలువ కల్గిన మొత్తం 25 సెల్ ఫోన్ లు.ఇట్టి కార్యక్రమం లో వికారాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘు కుమార్ , సి సి ఎస్ ఎస్ ఐ రమేష్, పి సి లు రాజు, రామ కృష్ణ, రవీందర్, రమేష్, ముని రాజ్ లు తదితరులు పాల్గొనడం జరిగింది.

# కళ్యాణం...కమనీయం....అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవం..

### పట్టు వస్త్రాలు తలంబ్రాలు సమర్పించిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు.

**నారాయణఖేడ్** శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని పెద్ద శంకరంపేట లోని రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే అనుపమ రెడ్డి సంజీవరెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు తలంబ్రాలు సమర్పించారు. పేట పట్టణంలోని పలువురు ప్రముఖులు భక్తులు సైతం స్వామివారికి ముత్యాలు తలంబ్రాలు పట్ట వస్త్రాలను సమర్పించారు. రామాలయంలో ఎమ్మెల్యే దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వేద బ్రాహ్మణ పండితుల



మంత్రోచ్చారణలతో సీతారాముల కళ్యాణం మహోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు భక్తులు కళ్యాణ మహోత్సవం తిలకించడంతోపాటు స్వామివారికి ప్రత్యేక



పూజ కార్యక్రమాలు చేశారు. భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు ఆలయ కమిటీ బాధ్యులు అధిక సంఖ్యలో మహిళలు చిన్నారులు భక్తులు పాల్గొన్నారు..

# కళలను కాపాడుదాం భావితరాలకు మన సంస్కృతి ముందుకు తీసుకుపోదాం

### -ప్రముఖ సంఘ సేవకులు తెలంగాణ జానపద సకల వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వలస సుభాష్ చంద్రబోస్.

**(సిద్దిపేట జిల్లా)మర్చి 27:**సిద్దిపేట జిల్లా కోహెడ మండలం నారాయణపురం గ్రామంలో ప్రపంచ రంగస్థల దినోత్సవ సందర్భంగా తెలంగాణ జానపద సకల వృత్తి కళాకారుల సంఘం కోహెడ మండల కన్వీనర్ గుండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సంఘ సేవకులు తెలంగాణ జానపద సకల వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వలస సుభాష్ చంద్రబోస్ వారి చేతుల మీదుగా రంగస్థల కళాకారులకు సన్మానం చేయడం జరిగింది.ఈ సందర్భంగా ప్రముఖ సంఘ సేవకులు వలస సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తుందని ప్రతి కళాకారుడు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన కళాకారులకు పిలుపునిచ్చారు.మన సంస్కృతి,సంప్రదాయాలు, భావోద్వేగాలకు ప్రతిబింబంగా నిలిచేది రంగస్థలం.జీవితం అనే నాటకానికి అద్దం పట్టి, మనలోని మంచి-చెడులను



ఆలోచింపజేసే మహోన్నత వేదిక ఇది.రంగస్థలం కేవలం వినోదం కాదు అది విద్య, అది చైతన్యం,అది సమాజ మార్పుకు శక్తివంతమైన సాధనం.ప్రతి కళాకారుడు తన ప్రతిభతో ప్రేక్షకుల హృదయాలను తాకుతూ, సమాజానికి సందేశాలను చేరవేస్తాడు.ప్రతి సంభాషణలో ఒక సత్యం ఉంటుంది,ప్రతి పాత్రలో ఒక జీవితం ఉంటుంది,ప్రతి ప్రదర్శనలో ఒక సందేశం దాగి ఉంటుంది.మనం రంగస్థల కళాకారులందరికీ కృతజ్ఞతలు తెలుపుదాం.వారు తమ శ్రమ,నిబద్ధతతో ఈ కళను నిలబెడుతూ, తరతరాలకు అందిస్తున్నారు.గ్రామీణ స్థాయిలోనైనా,మహానగరాల్లోనైనా రంగస్థలం మన సంస్కృతిని నిలబెట్టే శక్తిగా కొనసాగుతోంది.రంగస్థల కళను ప్రేమించే ప్రతి ఒక్కరికీ,ఈ కళకు ప్రాణం పోసే నటీనటులకు,రచయితలకు,



దర్శకులకు, మరియు ఈ కళను ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను.రంగస్థలం జీవితం నేర్పుతుంది పాత్రలు మారినా,విలువలు నిలిచిపోతాయి .కళలను కాపాడుకుందాం.భావితరాలకు మన సంస్కృతిని ముందుకు తీసుకెళ్దాం వారన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హరి పుష్పలత అశోక్,గవ్వ కమలమ్మ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు గవ్వ వంశిధర్ రెడ్డి,తెలంగాణ జానపద సకల వృత్తి కళాకాల సంఘం మండల కన్వీనర్ గుండా శ్రీనివాస్,హనుమాన్ దేవాలయ కమిటీ అధ్యక్షులు రమేష్,శ్రీనివాస్ రెడ్డి,సన్మాన గ్రహీతలు బుర్ర మల్లయ్య గౌడ్,సంపత్ తిరుపతి రెడ్డి,శ్రీనివాస్ మహిళ కోలాట బృందాలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# టిష్యూ పేపర్

అంధుడికి చూపొచ్చిన వెంటనే ..
ఈ క్షణం దాకా దారి చూపిన..
తన చేతి కర్రను వదిలేస్తాడు !

మనిషి కూడా అంతే కదా..
తన వెంట వచ్చిన నరుల్ని..
అకారణంగా విసిరి పారేస్తాం !

వాడిన వెంటనే డస్ట్‌బిన్‌లో..
పడేస్తాం టిష్యూ పేపర్‌ను
అవసరం తీరాక వదిలేస్తాం
నేటి ఆధునిక మనుషుల్ని !

సోదరుడు బంగారం అయితే..
మిత్రుడు విలువైన వజ్రం లాంటోడు..
బంగారాన్ని తిరిగి శుద్ధి చేసుకోవచ్చు
వజ్ర లోపాన్ని తొలగించడం అతి కష్టం !

పక్కోడి మాట విని తనవాళ్లని..
దూరం చేసుకుంటారు అజ్ఞానులు
పక్కోడు మనింటికి నిప్పు పెడితే..
నీ ఆత్మ బంధువును దూరం చేసుకొని..
నీవే నీ ఇంటికి నిప్పు పెట్టుకుంటావు !

ఏరు దాటాక తెప్ప తగలేయడం
కూర్చున్న భూమాత ఎదను తన్నడం
నీటి అలలపై రాసే మాటల కోటలు
నోరు జారాక నాలుక కరుచుకోక పోవడం
చేయూత ఇచ్చిన చేతులనే తెగ నరకడం
ఇవే కదా నేటి డిజిటల్ నరుల పోకడలు !

మధుపాళీ

# శ్రీరామ నవమి శుభాకాంక్షలు





**కరీంనగర్** పట్టణం 26 డివిజన్ ఆదర్శ్ నగర్ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి అభయ ఆంజనేయస్వామి దేవస్థానం శివాలయంలో ప్రతి ఏడు శ్రీరామ నవమి పర్వదినాన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం లో భాగంగా స్థానిక కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ శ్రీదేవి దంపతుల ఇంటి నుండి శ్రీరాములవారు స్వామి వారి ఎదుర్కోలు కార్యక్రమాలు మొదలై దేవాలయంలో సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించడం జరిగింది . ఇట్టి కార్యక్రమాలు దేవాలయ అధ్యక్షులు కార్యదర్శులు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం ఆ తదుపరి తీర్థప్రసాదాలు వితరణ అన్నదాన కార్యక్రమం జరిగినవి ఇట్టి కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ శ్రీదేవి గారు దేవాలయ కమిటీ అధ్యక్షులు మెతుకు కనకయ్య కార్యదర్శులు భూమిరెడ్డి ఓ మల్లయ్య గంధశీ లక్ష్మీనారాయణ పిట్టల కనకయ్య జిల్లి సత్తయ్య అశోక్ రెడ్డి ఇట్టినేని శ్రీనివాస్ తోట సత్యనారాయణ జైపాల్ రెడ్డి వంశీధర్ రెడ్డి రమణారావు రామ్మూర్తి శ్రీనివాస్ రావు కోటేశ్వర్ వైద్యుల శ్రీధర్ ఈ రమేష్ గంధం శ్రీధర్ మహిళా మణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ శ్రీరాముడు జన్మించిన ఈ పవిత్రమైన రోజున శ్రీరాముడి ఆశీస్సులు మీ అందరి జీవితాల్లో సుఖశాంతులు, ఆనందం, ఆయురారోగ్యాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాముధర్మం, నిజాయితీ, ప్రేమ వంటి విలువలను పాటిస్తూ మన డివిజన్ మన నగరము మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నాము. ఈ శ్రీరామ నవమి మీ మీ అందరి కుటుంబాలకు శుభములు, విజయములు తీసుకురావాలని ఆశిస్తున్నాము.

# శ్రీరామనవమి సందర్భంగా వేములవాడలో వైభవంగా జరిగినశ్రీ సీతారాముల కళ్యాణం





. **వేములవాడ**తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి సందర్భంగా ఆలయ పార్కింగ్ ప్రాంగణం లోని శివార్చన వేదికపై శ్రీ సీతారాముల స్వామివారి కళ్యాణోత్సవాన్ని శుక్రవారంవైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదికను రంగురంగుల పూలతో, మామిడి ఆకులు, అరటి తోరణాలతో అద్భుతంగా అలంకరించారు. ఈ కార్యక్రమానికి కన్యాదాతలుగా మరింగంటి విజయసారథి--కరుణ దంపతులు పాల్గొన్నారు. ఈ కళ్యాణోత్సవాన్ని దర్శించేందుకు రాష్ట్ర నలుమూలల నుండి లక్షలాది మంది భక్తులు తరలివచ్చినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు శ్రీ ఆది శ్రీనివాస్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని విధాలుగా సదుపాయాలు కల్పించారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

# రాజన్న సిరిసిల్లజిల్లాలో గ్యాస్ సిలిండర్లకు కొరతలేదు

**ప్రజల అవసరాలకు అనుగుణంగా నిలువలు ఉన్నాయి**

**జిల్లాకలెక్టర్ గరిమ అగ్రవాల్**



**వేములవాడ:**రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్యాస్ సిలిండర్లకు కొరత లేదని కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా జిల్లాలో సిలిండర్ల నిల్వలు ఉన్నా యని తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి అపో హలు పడవద్దని, వదంతులు నమ్మవద్దని సూచించారు. గృహ వినియోగదారులు తొందరపడి గ్యాస్ బుక్ చేసుకోవద్దని తెలిపారు. తమ అవసరాలకు అనుగుణంగా గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. గ్యాస్ సిలిండర్ పక్కదారి పట్టినా.. బ్లాక్ దందా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎల్పీజీ గ్యాస్ సరఫరా విషయమై జిల్లాలో కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో ఎల్పీజీ గ్యాస్‌కు సంబంధించిన సమస్యలు ఎదురైతే వినియోగదారులు 80084 29738 ఫోన్ నంబర్‌కు సంప్రదించి తమ ఫిర్యాదులను తెలియ జేయవచ్చని పేర్కొన్నారు.ఎల్పీజీ గ్యాస్ సరఫరా, పంపిణీకి సంబంధించిన సమస్యలను పర్యవేక్షించడంతోపాటు వినియోగదారుల ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కంట్రోల్ రూమ్‌లో నమోదు అయ్యే ఫిర్యాదులను సంబంధిత అధికారులు, ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీలకు తెలియజేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు.

# సంగీత రంగంలో రాజ్యమేలుతున్న లింగ వివక్ష

**(28 మార్చి "అంతర్జాతీయ మహిళా సంగీత కళాకారుల దినోత్సవం" సందర్భంగా)**

సంగీత రంగంలో మహిళల పాత్రను ప్రశంసించడం, వారిని ప్రోత్సహించడం, ఈ రంగంలో లింగ సమానత్వాన్ని సాధించడం, మంచి మహిళా సంగీత విద్వాంసులను సన్మానించడం, మహిళా సంగీతకారుల ప్రభావాన్ని గుర్తు చేసుకోవడం, భవిష్యత్తులో మహిళా సంగీతకారులకు సముచిత స్థానం కల్పించడం లాంటి అంశాల్లో పాల్గొనడానికి ప్రతి ఏటా 28 మార్చి రోజున ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ మహిళా సంగీత కళాకారుల దినోత్సవం (ఇంటర్నేషనల్ వూమెన్ ఇన్ మ్యూజిక్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. సంగీత పరిశ్రమలో మహిళలు చాలా చక్కువగా ఉన్నారు. మహిళామణులకు తగిన ప్రోత్సాహం కూడా కరువైంది. నేపథ్య గానం, సంగీత దర్శకత్వం, సంగీత నిర్మాతలు, సంగీత కళాకారులు లాంటి రంగాల్లో పురుషుల ఆధిపత్యం అనాదిగా కొనసాగుతూ వస్తున్నది.

భారత సంగీత రంగంలో మహిళా కళాకారులు:

భారతీయ సంగీతరంగాన్ని సుసంపన్నం చేసిన మహిళల్లో ఎం ఎస్ విజయలక్ష్మి, లతా మంగేష్కర్, ఆశా బోంస్లే, శ్రేయ ఘోషాల్ లాంటి వారు ఎందరో ఉన్నారు. వీరు తమ సంగీత కళతో మానవాళిని మెప్పించి పురుషాధిక్యతను అధిగమించి తమదైన ముద్రను వేయడం హర్షదాయకం. ప్రముఖ గాయనీమణుల్లో లతా మంగేష్కర్, శ్రేయా ఘోషాన్ లాంటి వారు ఉండగా, శాస్త్రీయ సంగీతంలో ఎం ఎస్ సుబ్బలక్ష్మి, గౌహర్ జాన్, అక్తరి బాయి లాంటి మహిళలు ఉన్నారు. సంగీత వాయిద్యకారుల వర్గంలో మృదంగం, తబలా, ఘటం, కంజీరా వంటి వాయిద్యాలను వాయించే మహిళలు కూడా కొందరు ఉండడం విశేషం. రుద్ర వీణ కళాకారిణి జ్యోతి హెగ్డే, సంగీత దర్శకులుగా ఉషా ఖన్నా, జద్దన్ బాయి, సరస్వతి దేవి లాంటి కళాకారులు ఉన్నారు. ఆధునిక భారతీయ సంగీత ప్రపంచంలో శ్రేయ ఘోషల్, నేహా కక్కర్, సన్నిధి చౌహాన్ వంటి నేటి మేటి తరం గాయనీమణులా ప్రపంచ గుర్తింపును కూడా పొందారు. తెలుగు సంగీత ప్రపంచంలో ఎం ఎం శ్రీలేఖ, భానుమతి రామకృష్ణ లాంటి ప్రముఖులు సంగీత దర్శకులుగా మంచి పేరు తెచ్చుకున్నారు. అలాగే గాయనీమణులుగా సుశీల, జానకి, చిత్ర, సునితా, మంగ్లీ లాంటి వర్తమాన కళాకారులు తమ ప్రతిభతో ప్రేక్షకుల మన్ననలు పొందుతున్నారు.

సంగీత పరిశ్రమలో లింగ సమానత్వం:

ప్రపంచవ్యాప్తంగా మహిళలు సంగీత ప్రపంచాన్ని ఉర్రూతలూగించారు. కాని వారి సంఖ్య చాలా స్వల్పం. అర్థాలు ఫ్రాక్లిన్, బయాంన్స్, లేదా మంగేష్కర్ లాంటి ప్రపంచ ప్రఖ్యాత సంగీతకారులు మానవాళిపై చెరగని ముద్రను వేసారు. సంగీత పరిశ్రమ పురుషుల చేతుల్లో ఉన్నది. ఆసక్తి, అర్హత కలిగిన మహిళలకు సహితం సరైన అవకాశాలు దొరకడం లేదు. సంగీత రంగంలో మహిళలకు నాయకత్వ బాధ్యతలు ఇవ్వడానికి పురుష సమాజం సిద్ధంగా లేదు. తగిన గుర్తింపు, వేతన వ్యత్యాసాలు మహిళలను వేధిస్తున్నాయి. సంగీర ప్రపంచంలో అడుగిడడానికి మహిళలకు పరిమితులు విధించబడ్డాయి. మహిళా సంగీత విద్వాంసుల నైపుణ్యాలను గుర్తించడం, అర్హత కలిగిన మహిళలకు అవకాశాలు ఇవ్వడం, మహిళా సందగీతకారులకు స్వేచ్ఛను ఇవ్వడం, మహిళల సంగీత కచేరీలు లేదా ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, సంగీత పరిశ్రమలో లింగ సమానత్వ సాధనకు కృషి చేయడం లాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలి.

సంగీతం ఓ శక్తివంతమైన విశ్వ భాష :

సంగీతం అత్యంత ప్రభావితం చేయగల ఓ విశ్వ భాష. మాటలు ఆగిన చోట సంగీత స్వరాల పలుకులు ప్రారంభం అవుతుంది. సంగీతం ఓ దివ్య ఔషధం. మాటల్లో చెప్పలేని విషయాలను సంగీత మాధ్యమంగా వర్ణించవచ్చు. సంగీతం లేని జీవితం నిస్సారం. ప్రపంచాన్ని జాగృతం చేయగల శక్తి సంగీతానికి ఉంటుంది. సాంప్రదాయ సంగీతం నుంచి ఆధునిక సంగీతం వరకు మహిళలు తమ అంకితభావం, నైపుణ్యంతో దేశ సంగీత చిత్రపటాన్ని నిరంతరం పునర్నిర్వహిస్తూనే ఉన్నారు, భవిష్యత్తులో నిర్వహిస్తారు కూడా. సంగీతం ఓ నిర్మలమైన నదీ ప్రవాహం. సంగీతానికి ఎల్లలు లేవు.

"అంతర్జాతీయ మహిళా సంగీత కళాకారుల దినోత్సవం" సందర్భంగా ఇలాంటి అత్యంత ప్రభావం కలిగిన సంగీత జగత్తులోకి అర్హులు, ఆసక్తి మెండుగా ఉన్న మహిళామణులను ఆహ్వానిద్దాం, వారి సంగీత రాగాలను ఆస్వాదిద్దాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

# ఉత్తర భారతం నుంచి దక్షిణానికి శ్రామిక వలసల వరదలు

ఉత్తర దక్షిణ భారతాల మధ్య జనాభా, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు, భాష యాసలు, జీవన విధానాలు, జనాభా అంశాలు, వాతావరణం, ఆహార అలవాట్లు, ఆర్థిక స్థితిగతులు, వేషధారణలు లాంటి ప్రధాన అంశాలతో పాటు అనేక రకాలైన వ్యత్యాసాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉత్తర భారతంతో పోల్చితే దక్షిణాది రాష్ట్రాల్లో ఆర్థిక పరిస్థితులు మెరుగైన స్థాయిలో ఉండడం సాధారణంగా కనిపిస్తున్నది. జన సంఖ్యలో సహితం దక్షిణ భారతం కన్న ఉత్తర భారతంలో పేదరికం, నిరుద్యోగంతో పాటు జనాభా అనేక రెట్లు అధికంగా ఉంటున్నది. ఈ అంశం ఆధారంగానే ఉత్తర దక్షిణ భారతాల మధ్య డీలిమిటేషన్ చిచ్చు మొదలైంది. జాతీయ భాష హిందీ అమలుకు సంబంధించిన తమిళ భాషాభిమానాలు కేంద్ర ప్రభుత్వంపై కారణాలు మిరియాలు నూరుతూనే ఉన్నారు. ఈ సందర్భంగా ఉత్తర భారతం నుంచి దక్షిణ భారత రాష్ట్రాలకు శ్రామిక వలసల వరదలు అనాదిగా కొనసాగుతూనే ఉన్నాయి. నేడు దక్షిణాదిని వ్యవసాయ, నిర్మాణ, తయారీ రంగాల్లో స్థానిక కార్మికుల కొరత ఉండడమే కాకుండా ఇక్కడి యువత పట్టణాలకు, ఆకర్షణీయ వేతన పనులకు మొగ్గ చూపడంతో వ్యవసాయ, నిర్మాణ రంగాల్లో నైపుణ్యాలు లేని శ్రామికవర్గ కొరత ఏర్పడడం, దీనిని ఆసరాగా తీసుకొని ఉత్తర భారతీయ కార్మికమగు వలసలు రావడం జరుగుతున్నది. దక్షిణాది రాష్ట్రాల్లో దాదాపు 5 – 7 శాతం జనాభా ఉత్తరాది వారే ఉండడం, ఈ సంఖ్య క్రమంగా పెరగడం జరుగుతున్నది.

ఉత్తర భారతం నుంచి దక్షిణ భారతానికి శ్రామిక లోక వలసల వరదలు:

ఉత్తర, దక్షిణ భారతాల మధ్య ఆర్థిక అవకాశాల వ్యత్యాసాలు అధికంగా ఉంటున్నాయి. దక్షిణ భారతంలో శ్రామిక లోకానికి పని దొరకడం, వేతనాలు అధికంగా ఉండడం చూస్తున్నాం. అదే విధంగా ఉత్తర భారతంలో శ్రామికులకు తక్కువ వేతనాలు, పేదరికం అధికం, వ్యవసాయ రంగ పరిమితులు, నిరుద్యోగం, తక్కువ పనులు ఉండడంతో పొట్ట చేత పట్టుకొని దక్షిణాదికి వలసలు అనివార్యం అయ్యాయి. ఉద్యోగ ఉపాధులు అధికంగా ఉన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో ఉద్యోగ ఉపాధులు, మెరుగైన వనరులు, కార్మికులకు దినసరి వేతనాలు అధికంగా ఉండడం మనకు తెలుసు. ఉత్తర భారత యూపీ, బీహార్, రాజస్థాన్, ఝార్ఖండ్, ఎంపీ, ఛత్తీస్‌ఘడ్ లాంటి రాష్ట్రాల్లో జనాభా అధికంగా ఉండడమే కాకుండా పని దొరక్కపోవడం, దొరికి పనికి తక్కువ వేతనాలు ఇవ్వడం జరుగుతున్నది. ఆకర్షణీయ వేతనాలు, ఉపాధుల అవకాశాలు మెండుగా ఉండడంతో ఉత్తర భారత శ్రామిక లోకం మెరుగైన జీవనోపాధులను వెతుక్కుంటూ దక్షిణ భారత రాష్ట్రాలకు వలసలు వెళ్లడం అనివార్యంగా జరుగుతున్నది. 2011 వివరాల ప్రకారం ఉత్తర భారత రాష్ట్రాల్లో జనాభా సగటు వయస్సు 27 – 32 మధ్య ఉండగా, ఉత్తర భారత రాష్ట్రాల్లో జనాభా సగటు వయస్సు 20 – 24 ఏండ్లు మాత్రమే ఉండడాన్ని చూస్తే ఉత్తర భారతంలో యువత జనాభా చాలా అధికంగా ఉన్నట్లు తెలుస్తున్నది.

ఉత్తర భారత నుంచి వలసలకు కారణాలు:

ఉత్తర భారత రాష్ట్రాలైన యూపీ, బీహార్, రాజస్థాన్‌లో నిరుద్యోగం అధికంగా, ఆదాయాలు తక్కువగా ఉండడంతో అక్కడి కార్మికులు తట్టబుట్ట సర్దుకొని దక్షిణాదికి వలసలు వెళ్లడం కొనసాగుతున్నది. దక్షిణ భారత ధాన్యాగారంగా పిలువబడుతున్న కావేరి డెల్టా, రైస్‌బౌల్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన తెలుగు రాష్ట్రాల్లో స్థానిక యువత వ్యవసాయం పట్ల విముఖతను చూపడం, ఆకర్షణీయ వేతనాలకు పట్టణాలకు పయనం కావడంతో దక్షిణాదిన కార్మికుల కొరత ఏర్పడింది. దక్షిణాదిలో మౌలిక వనరులు, పరిశ్రమలు, ఐటీ టెక్నాలజీ రంగం, తయారీ రంగాలు ఊపందుకోవడంతో ఉద్యోగ ఉపాధుల్లో ముందంజలో ఉండడం సహజంగా జరుగుతున్నది. ఉత్తర భారత రాష్ట్రాలతో పోల్చితే దక్షిణాది రాష్ట్రాల్లో అక్షరాస్యత, ఉన్నత విద్యల్లో ముందంజలో ఉండడం గమనిస్తున్నాం. నిరక్షరాస్య ఉత్తర భారత శ్రామికులు తక్కువ వేతనాలకు అందుబాటులో ఉండడం, దక్షిణ భారత యువత వ్యవసాయ/నిర్మాణ రంగాల్లో ఉపాధులకు అయిష్టం చూపడంతో నార్త్ ఇండియన్ లేబర్ సౌత్ వైపుకు మైగ్రేషన్ పెరుగుతున్నది. దక్షిణ భారతంతో పోల్చితే ఉత్తర భారతంలో అధిక సంఖ్యలో యువత ఉండడం కూడా ఈ వలసలకు మరో కారణంగా నిలుస్తున్నది.

ఉత్తర భారత వలసదారులతో ముడిపడిన ముఖ్య అంశాలు:

దక్షిణ భారతంలో వ్యవసాయ పనులు అధికంగా ఉన్న సీజన్‌లో ఉత్తర భారతీయుల వలసలు అధికంగా, ఇతర సీజన్లలో తమ రాష్ట్రాలకు వెళ్లడం గమనిస్తున్నాం. వరి నాట్లు వేసే సమయంలో ఉత్తర భారత మగ శ్రామికులు దక్షిణాది పొలాల్లో నాట్లు వేస్తూ కనిపిస్తున్నారు. సాధారణంగా వరి నాట్లు మహిళా కార్మికులు వేయడం ఆనవాయితీగా వస్తున్నప్పటికీ దానికి విరుద్ధంగా ఉత్తర భారత పురుషులు నాట్లు వేయడం ఆశ్చర్యంగా చూసే రోజులు వచ్చాయి. ఉత్తర భారత కార్మికులు దక్షిణాది రాష్ట్రాల్లో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో కనీస వసతులు, గృహ వసతులు, శ్రమ దోపిడీ, దుర్భర జీవన స్థితులు, వైద్య సదుపాయాలు, విద్య అవకాశాలు, సామాజిక వివక్ష, సంస్కృతి సంప్రదాయాలు లాంటి రంగాల్లో దీన పరిస్థితుల్లో బతుకులను ఈడుస్తూ వస్తున్నారు.

ఉత్తర భారతీయుల వలసలతో దక్షిణాదిపై ప్రభావం:

ఉత్తర భారతీయుల వలసలు ఇలాగే మరి కొన్ని ఏండ్లు కొనసాగితే దాని ప్రభావం దక్షిణాది జనాభాపై ప్రతికూలంగా పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉత్తర భారత జనాభా క్రమంగా పెరిగితే స్థానిక కార్మికులకు ఉపాధుల కొరత, ప్రభుత్వ పథకాల అమలుతో మన ప్రభుత్వాల నిధులను వారికి కేటాయించడం, శ్రమదోపిడీ పెరగడం, వేతన రేట్లు తగ్గడం లాంటి ప్రతికూలతలు స్థానికులు ఎదుర్కోవలసి ఉంటుంది. అక్రమ వలసలంటూ అమెరికా ఆందోళన చెందుతూ ప్రతి చర్యలు తీసుకోవడం, వారిని తమ తమ దేశాలకు పంపించడం ఎలా జరుగుతుందో, రానున్న ఏండ్లలో ఉత్తరాది రాష్ట్రాల కార్మిక లోకం వలసలను నిషేధించాలని కూడా దక్షిణాది జనులు ఆందోళనలు చేయవలసి రావచ్చని కూడా అంచనా వేస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉత్తరాది రాష్ట్రాల శ్రామికుల వలసల వరదలు పెద్ద ఎత్తున పెరగక ముందే స్థానిక శ్రామిక లోకం నిద్ర లేచి తమ తమ ప్రాంతాల వ్యవసాయ, నిర్మాణ, తయారీ రంగాల్లో ఉపాధులను చేజిక్కించుకొని ఆర్థికంగా బల పడాలని కోరుకుందాం. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకుందాం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

# హార్మోజ్ జల సంధి కేంద్రంగా యుద్ధం

నేటి ప్రపంచం నిద్ర లేచిన దగ్గరి నుంచి పడుకునే వరకు క్షణక్షణం ఏది చూసినా, ఎవరితో మాట్లాడినా, ఏ టీవీ చూసినా, ఏ సోషల్ మీడియా తెరలు తెరిచినా అంతటా "హార్మోజ్ జల సంధి (స్ట్రైట్ ఆఫ్ హార్మోజ్)" ఆధారిత యుద్ధ సమాచారమే చర్చకు రావడం, ఆ అంశమే ప్రధానమైనదిగా భావించడం జరుగుతున్నది. నాడు ఎవరికీ తెలియని జల సంధి నేడు 8.2 బిలియన్ల ప్రపంచ మానవాళిని నిద్ర పోనియ్యడం లేదు. పల్లెల్లో సహితం హార్మోజ్ పేరు ప్రతిధ్వనిస్తున్నది. అమెరికా, ఇజ్రాయిల్ భీకర దాడులకు సమాధానంగా హార్మోజ్ జల సంధిని ఇరాన్ ఆయువుపట్టుగా తీసుకుంది. ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం వరకు ఈ జల సంధి గుండానే జరుగుతున్న తరుణంలో ప్రపంచ దేశాలు కూడా యుద్ధ కొనసాగించాను వ్యతిరేకిస్తున్నాయి. ఈ విషయాన్ని పలు దేశాలు అమెరికాకు ప్రత్యక్షంగా చెప్పడం కూడా జరుగుతోంది. 28 ఫిబ్రవరి రోజు అమెరికా–ఇజ్రాయిల్ చేసిన బాంబు దాడిలో ఇరాన్ సుప్రీమ్ లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ చని పోవడంతో ప్రారంభంపైన యుద్ధం గత 28 రోజులుగా కొనసాగుతూ, అమెరికా వెనకడుగు వేసే దుస్థితికి చేరింది. ట్రంప్ మాటల ఘాటు తగ్గుతుంది. అమెరికా స్వరం పట్టు తప్పుతోంది. అమెరికన్ దళాలకు గుండెల్లో గుబులు పెరిగింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతున్నది ఇంధన కొరత ద్రవ్యోల్బణానికి దారి తీసింది.

ఇరాన్ ప్రాణవాయువుగా మారిన హార్మోజ్ జల సంధి:

ఇరాన్ – అమెరికా/ఇజ్రాయిల్ ఘర్షణల నేపథ్యంలో హార్మోజ్ జల సంధి యుద్ధ కేంద్రంగా మారింది. ఈ జల మార్గంపై ఇరాన్ పై చేయి కావడంతో చమురు రవాణాకు ఆటంకం కలుగుతోంది. భారత్ లాంటి మిత్ర దేశాల నౌకలకు అనుమతులు ఇవ్వడం, శత్రు దేశాల చమురు నౌకల రవాణా పై ఆంక్షల కొరడా దులపడం కొనసాగుతున్నది. నేటి ప్రపంచానికి ఇరాన్ మరో వినూత్న యుద్ధ రీతిని పరిచయం చేస్తున్నాది. చవకైన షాహెడ్ డ్రోన్ బాంబులు, ఎక్స్‌ప్లోజివ్ లోడెడ్ బోట్లు, నావల్ మైన్స్, కైలో క్లాస్ సబ్‌మెరైన్లతో బలమైన ప్రత్యర్థుల అత్యంత ఖరీదైన ఆయుధాలకు ధీటైన సమాధానం ఇవ్వడంతో నేడు అమెరికా కూడా వెనకడుగు వేయక తప్పడం లేదు. సౌదీ, యూఏఈ, ఖతార్‌లపై కూడా ఇరాన్ దాడులు చేసినప్పటికీ ఆ దేశాలు బలంగా ఎదిరించడం లేదు. దీనికి కారణం ఆయా దేశాల చమురు రవాణా నౌకలను జల సంధి గుండా వెళ్లకుండా ఆపగల సామర్థ్యం ఇరాన్ చేతిలో ఉన్నది. నేడు ఇరాన్‌కు హార్మోజ జల సంధి ఒక పదునైన ఆయుధంగా మారి యుద్ధ ముగింపుకు చర్చలు జరిగే స్థాయికి చేరింది.

హార్మోజ్ జల సంధి కేంద్రంగా చర్చలు :

ఒక వైపు పర్షియన్ గల్ఫ్‌తో ఓమన్ గల్ఫ్‌ను కలుపుతున్న హార్మోజ్ జల సంధికి ఉత్తరాన ఇరాన్, దక్షిణాన ఓమన్/యూఏఈ దేశాలు ఉన్నాయి. ఈ జల సంధి అతి ముఖ్యమైన చమురు రవాణా సముద్ర మార్గంగా నేడు యుద్ధానికి కేంద్ర బిందువుగా, ఇరాన్‌కు దొరికిన అత్యంత పదునైన ఆయుధంగా మారింది. గత రెండు దశాబ్దాలుగా అమెరికా ఆంక్షల నడుమ ఇరాన్ ఆర్థిక వ్యవస్థ బాగా చితికిపోయింది. నేడు గోరు చుట్టుపై రోకలి పోటు వలె ఈ యుద్ధంతో ఇరాన్ మరో ఆర్థిక అగాధంలోకి కూరుకుపోయింది. ఇరాన్ అగ్ర నాయకులు మరణించడం, ప్రధాన సైనిక స్థావరాలు నేల మట్టం కావడం, వ్యూహాత్మక కేంద్రాలు విచ్ఛిన్నం కావడం కొనసాగుతున్నప్పటికీ చలించని ఇరాన్ హార్మోజ్ జల సంధిని అత్యంత పదునైన ఆయుధంగా చేసుకొని రెండు బలమైన దేశాలకు చెమటలు పట్టిస్తున్నది. ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జిసి బలగాలు వెనక్కి తగ్గడం లేదు. నేడు ఇన్సురెన్స్ కంపెనీలు కూడా పరిహారం ఇవ్వడానికి కంపెనీలు ముందుకు రావడం లేదు. చమురు నౌకల ధర దాదాపు రూ 800 – 1300 కోట్లు ఉండడంతో ఇరాన్ దాడిలో దగ్ధం అసడయితే ఆయా దేశాలకు చాలా నష్టం వాటిల్లుతుందని తెలుసుకొని నౌకలు జల సంధి గుండా రవాణాకు ముందుకు రావడం లేదు.

హార్మోజ్ జల సంధి గేట్లు మూసివేసిన ఇరాన్:

ప్రపంచంలో ఎన్నో సముద్ర మార్గాలు ఉన్నప్పటికీ హార్మోజ్ జల సంధి ప్రత్యేకత వేరుగా రుజువు అవుతున్నది. ఈ జల సంధికి అడ్డుకట్ట వేయడంతో ప్రపంచమే అల్లకల్లోలం అవుతున్నది. వన్ వే రోడ్డు లాంటి ఈ జల సంధి గుండా ఒకే సారి ఎక్కువ నౌకలు వెళ్లే వీలు లేదు. గల్ఫ్ దేశాల చమురు ప్రపంచ దేశాలకు చేరడానికి ఈ జలసంధి గుండానే ప్రయాణించాలి. ఈ జల సంధి గేట్లు మూసి వేస్తే చమురు రవాణాకు బ్రేక్ పడుతుంది. దీనిని ఇరాన్ అనుకూలంగా మార్చుకొని అగ్ర రాజ్యానికి వణుకు పుట్టిస్తున్నది. సాధారణ పరిస్థితుల్లో ప్రతి రోజు 2 కోట్ల బ్యారెల్స్ చమురు, ఎల్ఎన్‌జి ఈ జల సంధి గుండా ప్రపంచ దేశాలకు చేరుతున్నది. ఈ సంధి గుండా నౌకలు వెళ్లకుండా ఇరాన్ పలు డ్రోన్లు, మైన్స్, మిసైల్స్ ఉపయోగించి ఓడల రాకపోకలను సమర్థవంతంగా అడ్డుకుంటోంది.ప్రపంచ ఆర్థిక భారీ కుదుపులను దృష్టిలో పెట్టుకొని అమెరికా/ ఇజ్రాయిల్ – ఇరాన్ దేశాలు తలో మెట్టు దిగి షరతులను సవరించుకుంటూ, తమ నష్టాలను సహితం పరిగణనలోకి తీసుకొని చర్చల ద్వారా ఏకాభిప్రాయానికి వచ్చి యుద్ధ ముగింపు వార్తలను ప్రసారం చేయాలని కోరుకుందాం, ప్రపంచ శాంతి స్థాపనకు దోహదపడాలి కోరుకుందాం. ట్రంప్, నేతన్యాహూలకు సద్బుద్ధి కలగాలని శ్రీరామ్ నవమి సాక్షిగా సీతారాముల జంటను వేసుకుందాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

# శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణోత్సవానికి సహకరించిన జిల్లా యంత్రాంగం, ఆలయ సిబ్బందికి ఈవో కృతజ్ఞతలు

. **వేములవాడ:**రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణోత్సవం విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన జిల్లా యంత్రాంగానికి ఆలయ ఈవో శ్రీమతి ఎల్. రమాదేవి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం సాఫల్యానికి కృషి చేసిన ఆలయ ఉద్యోగులు, వేద పండితులు, అర్చకులు మరియు ఇతర సిబ్బందికి ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# కావ్య పాప టీంకు బిగ్ షాక్.. ఐపీఎల్ మొదటి సగానికి కెప్టెన్ దూరం

ఐపీఎల్ 2026 ప్రారంభ మ్యాచ్‌కే ప్యాట్ కమిన్స్ దూరమవుతారని ముందుగా వార్తలు వచ్చాయి. అయితే తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, అతను కేవలం ఒక్క మ్యాచ్ కాదు.. సీజన్ మొదటి సగభాగంలో అంటే దాదాపు 7 నుంచి 8 మ్యాచ్‌లకు అందుబాటులో ఉండటం లేదు. మార్చి 24నే కమిన్స్ భారత్‌కు చేరుకున్నప్పటికీ, వెన్నునొప్పి కారణంగా అతను మైదానంలోకి దిగడం సాధ్యం కావడం లేదు. బిజినెస్ ఆఫ్ స్పోర్ట్స్ అనే పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. తాను ప్రస్తుతం కోలుకుంటున్నానని, అయితే పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి ఇంకా సమయం పడుతుందని కమిన్స్ వెల్లడించారు. సెకండ్ హాఫ్‌లో జట్టులోకి వచ్చి ఫైనల్ వరకు ఆడతానన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు.

ఇషాన్ కిషన్ చేతుల్లో సన్‌రైజర్స్ బాధ్యతలుకమిన్స్ గైర్హాజరీలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును ఎవరు నడిపిస్తారనే ప్రశ్నకు ఇషాన్ కిషన్ సమాధానంగా నిలిచారు. ప్యాట్ కమిన్స్ స్వయంగా ఈ విషయాన్ని ధృవీకరిస్తూ, ఇషాన్ కిషన్ నాయకత్వంలో జట్టు అద్భుతంగా రాణిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇషాన్ కిషన్‌కు దేశవాళీ క్రికెట్‌లో కెప్టెన్‌గా మంచి అనుభవం ఉంది. టీ20 క్రికెట్‌లో అతను ఇప్పటివరకు 29 మ్యాచ్‌లకు నాయకత్వం వహించగా, అందులో ఏకంగా 24 మ్యాచ్‌ల్లో విజయం సాధించడం విశేషం. ఈ సక్సెస్ రేటు చూస్తుంటే, ఆరెంజ్ ఆర్మీకి ఇషాన్ సరైన నాయకుడని అభిమానులు భావిస్తున్నారు.నెట్స్‌లో ప్రాక్టీస్ మొదలుపెట్టిన కమిన్స్‌గాయంతో బాధపడుతున్నప్పటికీ, ప్యాట్ కమిన్స్ తన ప్రాక్టీస్‌ను మాత్రం ఆపలేదు.




ప్రతి మూడు రోజులకు ఒకసారి నెట్స్‌లో బౌలింగ్ ప్రాక్టీస్ చేస్తున్నానని ఆయన తెలిపారు. మెల్లగా బౌలింగ్ లయను అందుకుంటున్నానని, ఏప్రిల్ నెలాఖరు లేదా మే మొదటి వారంలో మైదానంలోకి దిగే అవకాశం ఉందని స్పష్టం చేశారు. కమిన్స్ జట్టులో లేకపోవడం బౌలింగ్ పరంగా లోటే అయినప్పటికీ, ఇషాన్ కిషన్ లాంటి దూకుడున్న నాయకుడు దొరకడం జట్టుకు సానుకూల అంశం. మార్చి 28న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ)తో జరిగే తొలి మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

## బీసీసీఐ కీలక నిర్ణయం.. ఐపీఎల్ 2026 ఓపెనింగ్ సెర్మనీ రద్దు




: ఐపీఎల్ 2026 సీజన్ మరికొద్ది గంటల్లో ప్రారంభం కాబోతోంది. మార్చి 28న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ూ=ఎ) మధ్య తొలి పోరు జరగనుంది. అయితే, ప్రతి ఏటా అట్టహాసంగా జరిగే ఐపీఎల్ ఓపెనింగ్ సెర్మనీని ఈసారి రద్దు చేస్తున్నట్లు బీసీసీఐ సంచలన నిర్ణయం తీసుకుంది. ఆడంబరాలు, ఆర్భాటాలకు దూరంగా ఈ సీజన్ ప్రారంభం కానుంది. ఐపీఎల్ ప్రారంభోత్సవాన్ని రద్దు చేయడానికి గల కారణాన్ని బీసీసీఐ సెక్రటరీ దేవజీత్ సైకియా వెల్లడించారు. గతేడాది జూన్ 4న ఆర్‌సీబీ విజయోత్సవ వేడుకల సమయంలో చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ మృతుల పట్ల గౌరవం, వారి కుటుంబాల పట్ల సానుభూతిని ప్రకటిస్తూ.. ఎటువంటి వినోద కార్యక్రమాలు లేకుండా లీగ్‌ను ప్రారంభించాలని బోర్డు నిర్ణయించింది. కేవలం ఆటపైనే దృష్టి సారించి, బాధితుల జ్ఞాపకార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు మీడియాతో మాట్లాడుతూ ఆయన ధృవీకరించారు.ప్రారంభోత్సవం లేకపోయినా, మే 31న జరిగే ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్ సందర్భంగా గ్రాండ్ క్లోజింగ్ సెర్మనీని నిర్వహించాలని బీసీసీఐ ప్లాన్ చేస్తోంది. ప్రస్తుతానికి కేవలం మొదటి 20 మ్యాచ్‌ల షెడ్యూల్‌న్స ఉంటాయని బోర్డు వర్గాలు చెబుతున్నాయి.శనివారం సాయంత్రం 7:30 గంటలకు ప్రారంభం కానున్న ఆర్‌సీబీ -- ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించే అవకాశం ఉంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. మ్యాచ్ సమయంలో 10 నుండి 15 శాతం వర్షం కురిసే అవకాశం ఉంది. గత సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌ను ఓడించి తొలిసారి ఐపీఎల్ కప్పు గెలిచిన ఆర్‌సీబీ, ఈసారి డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగుతోంది. సొంత గడ్డపై తమ పట్టు నిలుపుకోవాలని కోహ్లీ సేన భావిస్తుంటే, ప్యాట్ కమిన్స్ లేని లోటులో ఇషాన్ కిషన్ నాయకత్వంలోని హైదరాబాద్ ఎలా రాణిస్తుందో చూడాలి.



## తొలి పోరుకు ముందే ఆర్సీబీకి 3 బిగ్ షాక్‌లు

: ఐపీఎల్ 2026 సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగుతున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టుకు సీజన్ ఆరంభానికి ముందే వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ముఖ్యంగా ఫాస్ట్ బౌలింగ్ విభాగంలో కీలక ఆటగాళ్లు అందుబాటులో లేకుండా పోవడం జట్టు యాజమాన్యాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగనున్న తమ తొలి మ్యాచ్‌కు ముందు ఆర్సీబీకి ఇది మూడో పెద్ద షాక్ఇప్పటికే ఆ జట్టు స్టార్ పేసర్ జోష్ హాజెల్‌వుడ్ గాయం కారణంగా కొన్ని ప్రారంభ మ్యాచ్‌లకు దూరమయ్యాడు. హాజెల్‌వుడ్ ఫిట్‌నెస్‌పై అప్‌డేట్ కోసం జట్టు ఎదురుచూస్తోంది. దీనికి తోడు, దేశవాళీ క్రికెట్‌లో తన బౌలింగ్‌తో ఆకట్టుకున్న మరో పేసర్ ఎస్. దయాల్ వ్యక్తిగత కారణాలతో ఈ ఐపీఎల్ ఎడిషన్ మొత్తానికి దూరమయ్యాడు. ఈ ఇద్దరి గైర్హాజరీ ఆర్సీబీకి గట్టి ఎదురుదెబ్బగా పరిణమించింది.

తాజాగా, శ్రీలంకకు చెందిన ఫాస్ట్ బౌలర్ నువాన్ తుషారా కూడా ఐపీఎల్ 2026 సీజన్‌కు దూరమయ్యే అవకాశాలున్నాయి. పూర్తి ఫిట్‌నెస్ సాధించడంలో తుషారా విఫలమైనట్లు తెలుస్తోంది. ఇటీవల శ్రీలంక క్రికెట్ బోర్డు తమ ఆటగాళ్లు విదేశీ లీగ్‌లలో పాల్గొనడానికి కఠినమైన ఫిట్‌నెస్ ప్రమాణాలను నిర్దేశించింది. ఈ ప్రమాణాలను నువాన్ తుషారా అందుకోలేకపోయాడని సమాచారం. దీంతో అతడికి ఐపీఎల్ 2026లో ఆడేందుకు అవసరమైన ఎన్‌ఓసీ (నో అబ్జెక్షన్ సర్టిఫికేట్) పత్రాన్ని శ్రీలంక క్రికెట్ బోర్డు నిరాకరించింది. ఫలితంగా తుషారా ఈ సీజన్‌కు దూరమైనట్లే.2025 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రూ. 1.60 కోట్లకు నువాన్ తుషారాను దక్కించుకుంది. ఆ సీజన్‌లో అతను ఆర్సీబీ తరఫున కేవలం ఒకే ఒక్క మ్యాచ్ ఆడి, ఒక వికెట్ తీశాడు. ఈసారి జోష్ హాజెల్‌వుడ్, ఎస్. దయాల్ లేకపోవడంతో, తుషారాకు తుది జట్టులో స్థానం ఖాయమయ్యే అవకాశం ఉండేది. కానీ ప్రస్తుతం అతను దూరం అవ్వడం ఆర్సీబీకి ఇది పెద్ద షాక్‌గా మారింది.రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 18 ఏళ్ల తర్వాత తొలి ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకొని, ఇప్పుడు వరుసగా రెండో టైటిల్‌ను ముద్దాడాలని పట్టుదలతో ఉంది. బ్యాటింగ్‌లో బలంగా కనిపిస్తున్నప్పటికీ, ఈ ముగ్గురు పేసర్లు లేకపోవడంతో బౌలింగ్ విభాగం కొంత బలహీనంగా మారింది. ముఖ్యంగా ఫాస్ట్ బౌలింగ్ విభాగంలో అనుభవజ్ఞులైన ఆటగాళ్ల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ఒకవేళ గాయపడ్డ జోష్ హాజెల్‌వుడ్ వేగంగా ఫిట్‌నెస్ సాధించి తిరిగి జట్టులోకి వస్తే, బౌలింగ్ కష్టాలు కొంతవరకు తీరవచ్చని జట్టు భావిస్తోంది. మొత్తానికి తొలి మ్యాచ్‌కు ముందు ఆర్సీబీకి ఫాస్ట్ బౌలింగ్ విభాగం పెద్ద సవాలుగా మారింది.

# బంగారం, షేర్లు వారసత్వంగా పొందితే మీరు ఏ పన్నులు చెల్లించాలి రూల్స్ ఏంటి




ప్రజలు తరచుగా తమ కుటుంబం నుండి నగలు, భూమి, షేర్లు, కళాకృతులు లేదా క్రిప్టోకరెన్సీని వారసత్వంగా పొందుతారా? అయితే ఈ విషయాలను తెలుసుకోవాల్సిందే. భారతదేశంలో చట్టం స్పష్టంగా ఉంది. ఆస్తిని వారసత్వంగా పొందినప్పుడు ఆదాయపు పన్ను విధించబడదు. తరువాత మీరు ఆ ఆస్తిని విక్రయించినప్పుడు లేదా మీ ఆదాయపు పన్ను రిటర్న్‌లో దానిని నివేదించాల్సిన అవసరం వచ్చినప్పుడు పన్ను నియమాలు వర్తిస్తాయి. చాలా కుటుంబాలు ఈ ముఖ్యమైన విషయాలను విస్మరిస్తాయి.

పన్ను ఎప్పుడు చెల్లించాలి?ఆస్తిని సంపాదించడం పన్ను విధించినప్పుడు దానిని అమ్మడం వల్ల మూలధన లాభాల పన్ను వస్తుందని పన్ను నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే కొనుగోలు ధర, హోల్డింగ్ వ్యవధి (ఆస్తిని కలిగి ఉన్న కాలం) మునుపటి యజమాని అంచనాల ఆధారంగా లెక్కిస్తారు. ఇది లాభం దీర్ఘకాలికమా లేదా స్వల్పకాలికమా అని నిర్ణయిస్తుంది.ఇది కూడా చదవండి: బంగారం పెరిగింది.. వెండి తగ్గింది.. తెలుగు రాష్ట్రాల్లో ధరల వివరాలు!ఎంత పన్ను వసూలు చేస్తారు?దీర్ఘకాలిక లాభాలపై సాధారణంగా 12.5% ??పన్ను విధిస్తారు. స్వల్పకాలిక లాభాలపై మీ ఆదాయపు పన్ను స్లాబ్ ప్రకారం పన్ను విధిస్తారు. దీర్ఘకాలిక లాభాల ద్వారా వచ్చే ఆదాయాన్ని రూ.10 కోట్ల వరకు ఇల్లు కొనుగోలు చేయడానికి ఉపయోగిస్తే లేదా రూ.50 లక్షల వరకు ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడి పెడితే, మినహాయింపులు అందుబాటులో ఉండవచ్చు. అయితే క్రిప్టో వంటి వర్చువల్ డిజిటల్ ఆస్తులు (ఎణూ) ఫ్లాట్ 30% పన్ను రేటుతో పన్ను విధిస్తారు. ఎటువంటి మినహాయింపులు అందించవు.ఆదాయపు పన్ను రిటర్న్‌లో ఇది తప్పనిసరి:మీ మొత్తం ఆస్తులు రూ.50 లక్షలు దాటితే వాటిని మీ ఆదాయపు పన్ను రిటర్న్‌లో వెల్లడించడం తప్పనిసరి. మీ ఆస్తులు విదేశాల్లో ఉంటే, విడిగా బహిర్గతం చేయాలి. వాటిని బహిర్గతం చేయడంలో విఫలమైతే జరిమానాలు విధించవచ్చు. ప్రతి ఆస్తికి నియమాలు మారుతూ ఉంటాయి. బంగారం, నగలు, కళాకృతులకు సరైన మూల్యాంకనం, డాక్యుమెంటేషన్ అవసరం. దేశం నుండి కొన్ని కళాకృతులను తీసుకెళ్లడం చట్టవిరుద్ధం కావచ్చు. నామినీ నమోదు చేస్తే షేర్లు, మ్యూచువల్ ఫండ్‌లను బదిలీ చేయడం సులభం. నామినీ లేకుండా చట్టపరమైన ప్రక్రియ సుదీర్ఘంగా ఉంటుంది. క్రిప్టోకరెన్సీ వారసత్వంగా పొందవచ్చు. కానీ ప్రైవేట్ కీ లేదా పాస్‌వర్డ్ లేకుండా, నిధులను శాశ్వతంగా కోల్పోవచ్చు.

మీకు విదేశాల్లో ఆస్తి ఉంటే ఏమి చేయాలి?

ఆస్తి విదేశాలలో ఉంటే ఆ దేశ పన్ను నియమాలు కూడా వర్తించవచ్చు. ఖూ లేదా ఖఖ వంటి దేశాలు వారసత్వ పన్ను విధిస్తాయి. ఖీజుహీూ నిబంధనల ప్రకారం, భారతదేశం నుండి ఆస్తులను విదేశాలకు బదిలీ చేయడానికి వార్షికంగా వి1 మిలియన్ పరిమితి ఉంది. నిపుణులు అన్ని ఆస్తుల పూర్తి జాబితాను తయారు చేయాలని, వివిధ దేశాలకు ప్రత్యేక వీలునామాలను సిద్ధం చేయాలని సిఫార్సు చేస్తున్నారు. డిజిటల్ ఆస్తుల గురించి సమాచారాన్ని సురక్షితమైన స్థలంలో ఉంచండి. సరళంగా చెప్పాలంటే, వారసత్వంగా వచ్చిన ఆస్తి వెంటనే పన్ను విధించరు. కానీ ముందస్తు ప్రణాళిక, నియమాల పరిజ్ఞానం చాలా ముఖ్యమైనవి

# బంగారం పెరిగింది.. వెండి తగ్గింది.. తెలుగు రాష్ట్రాల్లో ధరల వివరాలు!




ప్రతి రోజు బంగారం, వెండి ధరలు హెచ్చు తగ్గులకు లోనవుతున్నాయి. ఒక రోజు తగ్గితే మరో రోజు పెరుగుతోంది.గత వారం రోజుల నుంచి బంగారం ధరలు స్పష్టమైన దిశలో కదలకుండా పైకీ కిందకీ మారుతున్నట్టు స్పష్టమవుతోంది. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణం, కేంద్ర బ్యాంకుల విధానాలు వంటి అంశాలు బంగారం ధరలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి. అదేవిధంగా స్థానికంగా పెళ్లిళ్లు, పండుగల సమయం దగ్గరపడుతున్న కొద్దీ డిమాండ్ పెరగడం ధరల పెరుగుదలకు కారణమవుతోంది. తాజాగా ఫిబ్రవరి 28న దేశంలోని బంగారం, వెండి ధరలు స్వల్పంగా పెరిగాయి. దేశీయంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,61,580 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,48,110 వద్ద ట్రేడవుతోంది.ప్రధాన నగరాల్లో ధరల వివరాలు:హైదరాబ1,61,580 ఉండగా, 22ాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,61,580 ఉండగా, 22 క్యారెట్ల పది గ్రాముఉల బంగారం ధర రూ.1,48,110 ఉంది.ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,61710 ఉండగా, 22 క్యారెట్ల పది గ్రాముఉల బంగారం ధర రూ.1,48,240 ఉంది.ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,61,580 ఉండగా, 22 క్యారెట్ల పది గ్రాముఉల బంగారం ధర రూ.1,48,110 ఉంది.చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,62,540 ఉండగా, 22 క్యారెట్ల పది గ్రాముఉల బంగారం ధర రూ.1,48,990 ఉంది.బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,61,580 ఉండగా, 22 క్యారెట్ల పది గ్రాముఉల బంగారం ధర రూ.1,48,110 ఉంది.ఇక వెండి విషయానికొస్తే ఇక్కడ ధర స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. కిలో వెండి ధర రూ.2,84,900 ఉండగా, హైదరాబాద్‌లో కాస్త ఎక్కువగా ఉంది. ఇక్కడ కిలోకు రూ.2,94,900 వద్ద ట్రేడవుతోంది.అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం, డాలర్ మారకం విలువ, అలాగే పెళ్లి సీజన్ ప్రారంభం వంటి కారణాలు ఈ పెరుగుదలకు దోహదపడ్డాయని బంగారం వ్యాపారులు చెబుతున్నారు.

# కొత్త చట్టం.. ఇక వాటిపై కూడా పన్ను! ఏప్రిల్ 1 నుంచి జరిగే మార్పులు ఇవే..




దేశంలో పన్ను వ్యవస్థలో కీలక మార్పులకు నాంది పలుకుతూ ఇన్‌కమ్ ట్యాక్స్ యాక్ట్ 1961 స్థానంలో కొత్త చట్టం ఇన్‌కమ్ ట్యాక్స్ యాక్ట్ 2025, ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఈ కొత్త చట్టంలో ముఖ్యంగా పెట్టుబడిదారులపై ప్రభావం చూపే ఒక కీలక నిబంధనగా 1 శాతం రూల్ నిలుస్తోంది. ఇది పన్ను రహిత ఆదాయాన్ని కూడా పరోక్షంగా పన్ను లెక్కల్లోకి తీసుకురావడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఇన్‌కమ్ ట్యాక్స్ రూల్స్ 2026లోని కొత్త నియమం 14 ప్రకారం పన్ను రహిత ఆదాయానికి సంబంధించిన ఖర్చులను ఇకపై పూర్తిగా మినహాయింపుగా పరిగణించరు. ఈ నియమం ప్రకారం పన్ను రహిత ఆదాయాన్ని సంపాదించడానికి జరిగిన ప్రత్యక్ష ఖర్చులతో పాటు, ఆ ఆదాయం తీసుకువచ్చే పెట్టుబడుల సగటు విలువలో 1 శాతాన్ని కూడా ఖర్చుగా పరిగణిస్తారు. అయితే మొత్తం ఖర్చు మీరు ప్రకటించిన మొత్తాన్ని మించకూడదు.సాధారణంగా చెప్పాలంటే డివిడెండ్‌లు లేదా ఇతర పన్ను రహిత ఆదాయం పొందినప్పుడు, ఆ ఆదాయంపై పన్ను లేకపోయినా, దానికి సంబంధించిన ఖర్చులను తగ్గించుకునే అవకాశం తగ్గుతుంది. ఫలితంగా మీ పన్ను చెల్లించాల్సిన మొత్తం ఆదాయం పెరిగి, చివరికి ఎక్కువ పన్ను చెల్లించాల్సి రావచ్చు. ఈ నియమం ప్రతి ఒక్కరికి స్వయంచాలకంగా వర్తించదు. మీరు ఆ పన్ను రహిత ఆదాయానికి సంబంధించిన ఖర్చులను క్లెయిమ్ చేసినప్పుడు లేదా పన్నుల శాఖ అటువంటి ఖర్చులు జరిగినట్లు భావించినప్పుడు మాత్రమే ఇది అమల్లోకి వస్తుంది. మీరు ఎలాంటి ఖర్చులు చేయలేదని నిరూపించగలిగితే, ఈ నిబంధన ప్రభావం తగ్గే అవకాశం ఉంటుంది.ప్రత్యేకంగా డివిడెండ్ ఆదాయం పొందేవారు, పెద్ద పెట్టుబడి పోర్ట్‌ఫోలియో ఉన్నవారు, అలాగే ఆర్థిక ఖర్చులను క్లెయిమ్ చేసేవారు మరింత జాగ్రత్తగా ఉండాలి. పన్ను నిపుణులు సూచిస్తున్నదేమిటంటే, పెట్టుబడులు, ఖర్చులపై స్పష్టమైన రికార్డులు ఉంచుకోవడం ఇప్పుడు అత్యంత అవసరం. మొత్తంగా కొత్త పన్ను విధానం సరళతకే పరిమితం కాకుండా పారదర్శకతను కూడా పెంచడమే లక్ష్యంగా కనిపిస్తోంది. ఇకపై పన్ను రహిత ఆదాయం పూర్తిగా ప్రభావం లేకుండా ఉండదనే సంకేతాన్ని ఈ 1 శాతం నియమం ఇస్తోంది.



## కుస్తీ యోధుడిగా రామ్ చరణ్..

### అంచనాలు పెంచిన 'పెద్ది' ఫస్ట్ గ్లింప్స్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే కానుక అందింది. ఆయన కథానాయకుడిగా, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది' నుంచి ఫస్ట్ గ్లింప్స్ విడుదలైంది. రామ్ చరణ్‌ను మునుపెన్నడూ చూడని అత్యంత రగ్గడ్, మాస్ అవతారంలో చూపించి దర్శకుడు బుచ్చిబాబు సినిమాపై ఆసక్తిని రేకెత్తించారు.

ఈ గ్లింప్స్ ప్రారంభంలో వినిపించే 'కుస్తీ అంటే బ్యాట్‌తో బంతికి ఎదురెళ్లే ఆట కాదురా.. ప్రాణంతో చావుకి ఎదురెళ్లే ఆట' అనే సంభాషణ, ఇది కేవలం క్రీడా నేపథ్య చిత్రం కాదని, ఓ యోధుడి జీవన్మరణ పోరాటమని దర్శకుడు చెప్పకనే చెప్పాడు. ఈ పవర్‌ఫుల్ డైలాగ్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కుస్తీ, క్రికెట్ నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ డ్రామాలో చరణ్ పాత్ర ఎంతో శక్తివంతంగా ఉండబోతున్నట్టు ఈ గ్లింప్స్ హింట్ ఇచ్చింది.విజువల్స్‌లో రామ్ చరణ్ మేకోవర్ అద్భుతమనే చెప్పాలి. కండలు తిరిగిన శరీరంతో, ఒంటి నిండా మట్టి పూసుకుని, చేతిలో గద పట్టుకుని నడుస్తున్న చరణ్‌ను చూస్తుంటే, 'రంగస్థలం'లోని చిట్టిబాబును మించిన మాస్ అవతార్ అనిపిస్తోంది. ఆయన కళ్లలో కనిపించే పౌరుషం, గంభీరమైన నడక గ్లింప్స్‌కే హైలైట్‌గా నిలిచాయి. ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ అందించిన నేపథ్య సంగీతం ఈ గ్లింప్స్‌కు ప్రాణం పోసింది.

## సోదరుణ్ణి కోల్పోయా.. ఆ గడ్డి మందును బ్యాన్ చేయండి

### : నటుడు రాహుల్ రామకృష్ణ



ప్రముఖ సినీ నటుడు రాహుల్ రామకృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కీలక విజ్ఞప్తి చేశారు. అత్యంత ప్రమాదకరమైన 'పారాక్వాట్' అనే కలుపు (గడ్డి) మందును తక్షణమే నిషేధించాలని ఆయన కోరారు. మార్కెట్లో సులభంగా దొరుకుతున్న ఈ విష రసాయనం కారణంగా తాను తన సోదరుణ్ని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఆత్మహత్యలకు సులభమైన మార్గంగా మారిందని, ఎందరో ప్రాణాలను బలిగొంటోందని చెబుతూ తెలంగాణ సీఎంవో, ప్రధానమంత్రి కార్యాలయాలను ట్యాగ్ చేస్తూ 'ఎక్స్'లో ఒక పోస్ట్ పెట్టారు.పారాక్వాట్ అనేది పొలాల్లో కలుపు మొక్కలను నాశనం చేయడానికి రైతులు విరివిగా ఉపయోగించే ఒక రసాయనం. ముఖ్యంగా పత్తి వంటి మెట్ట పంటలు, వరి పొలాల గట్ల మీద పెరిగే గడ్డిని తొలగించడానికి దీనిని వాడతారు. తక్కువ ధరకే లభించడంతో దాదాపు ప్రతి రైతు ఇంట్లోనూ ఇది అందుబాటులో ఉంటోంది. అయితే, ఇదే అనేక కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపుతోంది. క్షణికావేశంలో ఇంట్లో గొడవలు పడినవారు లేదా ఇతర సమస్యలతో బాధపడేవారు దీనిని తాగి ప్రాణాలు తీసుకుంటున్నారు.ఈ కలుపు మందు అత్యంత విషపూరితమైనది కావడంతో కొద్ది మోతాదులో తాగినా ప్రాణాలు కాపాడటం దాదాపు అసాధ్యమని వైద్యులు చెబుతున్నారు. ఆవేశం తగ్గాక బతకాలని వేడుకున్నా, వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం ఉండటం లేదని, శరీరంలోని కీలక అవయవాలు పూర్తిగా దెబ్బతింటున్నాయని వారు వివరిస్తున్నారు. ఈ విషం చర్మంపై పడినా, వాసన పీల్చినా ప్రమాదకరమే.ఈ మందు తాగి తెలంగాణలో ఏటా 6 వేల మంది వరకు చనిపోతున్నారని అంచనా

తెలంగాణలో పారాక్వాట్ తాగి ఏటా సుమారు 5,500 నుంచి 6,000 మంది చనిపోతున్నారని అంచనా. దేశవ్యాప్తంగా ప్రతి నెలా దాదాపు 1000 కేసులు నమోదవుతున్నాయని ఇండియన్ మెడికల్ అసోసియేషన్, 'డాక్టర్స్ ఎగైనెస్ట్ పారాక్వాట్ పాయిజన్' వంటి సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దీనిని పూర్తిగా నిషేధించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. కనీసం మండల వ్యవసాయ అధికారి సిఫార్సుతో, ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించి విక్రయించేలా నిబంధనలు కఠినతరం చేయాలని పలువురు సూచిస్తున్నారు.



## మహిళలు 'సారీ' చెప్పే అలవాటును ఆపాలి

### : సమంత

హీరోయిన్ సమంత రూత్ ప్రభు సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లపై మరోసారి తన గళాన్ని బలంగా వినిపించారు. గుర్తింపు పొందాలన్నా, తమను తాము నిరూపించుకోవాలన్నా మహిళలు ప్రతిదానికీ రెట్టింపు కష్టపడాల్సి వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సమంత.. మహిళల స్థితిగతులపై తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా పంచుకున్నారు. ఆమె వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.

సమాజంలో ఇతరుల సౌకర్యం కోసం మహిళలు తమ అభిప్రాయాలను, షెడ్యూళ్లను, చివరికి తమ ఆశయాలను కూడా త్యాగం చేయడం ఒక సాధారణ విషయంగా మారిపోయిందని సమంత పేర్కొన్నారు. తమ వ్యక్తిత్వాన్ని పక్కనపెట్టి ఇతరుల కోసం జీవించడం, వెనక్కి తగ్గడం మహిళలకు అలవాటైపోయిందని అన్నారు. ఈ త్యాగాలను చాలాసార్లు వారే గుర్తించలేని స్థితిలో ఉంటారని ఆమె అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా మహిళలకు ఆమె ఒక ముఖ్యమైన పిలుపునిచ్చారు. పురుషులతో పోలిస్తే మహిళలు ఎక్కువగా క్షమాపణలు చెబుతుంటారని, ప్రతి చిన్న విషయానికీ 'సారీ' చెప్పే అలవాటును ఇకనైనా ఆపాలని సూచించారు. "మనం మన స్థానాన్ని అర్హతతోనే సంపాదించుకున్నాం. కాబట్టి ఎవరైనా ప్రశంసించినప్పుడు దాన్ని గర్వంగా స్వీకరించాలి" అని సమంత అన్నారు.సినిమాల విషయంలో సామ్ మాట్లాడుతూ.. ఒక చిత్రాన్ని 'ఫీమేల్ లీడ్' సినిమా అని ప్రత్యేకంగా ట్యాగ్ చేయాల్సిన అవసరం లేని రోజు రావాలని ఆకాంక్షించారు. మహిళా పాత్రలు కేవలం హీరోకు సహాయపడేవిగా కాకుండా, స్వతంత్రంగా నిలబడేలా శక్తిమంతంగా ఉండాలని స్పష్టం చేశారు. అలాగే షూటింగ్ సెట్స్‌లో మహిళల భద్రత అనేది ఒక చర్చనీయాంశంగా కాకుండా పరిశ్రమలో ఒక ప్రాథమిక ప్రమాణంగా మారాలని ఆమె పేర్కొన్నారు. ప్రతి నటి సెట్‌లో పూర్తి భద్రతా భావంతో పనిచేసే వాతావరణం ఉండాలని సమంత కోరారు.



## పెళ్లిపై నాకు మంచి అభిప్రాయం లేదు


### : సాయిపల్లవి

టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక ఇమేజ్‌ను సంపాదించుకున్న సాయిపల్లవి... పెళ్లి గురించి, తన వ్యక్తిగత భావోద్వేగాల గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తనకు పెళ్లిపై పెద్దగా మంచి అభిప్రాయం లేదని ఆమె తెలిపింది. పెళ్లైన వారు కూడా పెళ్లి చేసుకోవద్దని తనకు సలహా ఇస్తున్నారని చెప్పింది. అందుకే తనకు పెళ్లి చేసుకోవాలనే ఆలోచన లేదని తెలిపింది. ఒంటరిగానే తాను చాలా ప్రశాంతంగా ఉన్నానని, ప్రస్తుతం తన దృష్టంతా సినిమాలపైనే ఉందని స్పష్టం చేసింది.అయితే, అర్ధరాత్రి పూట ఏమీ తినకుండా ఏడుస్తూ కూర్చునే అలవాటు ఉందని తెలిపింది. ఆ సమయంలో కేవలం తన తల్లి మాత్రమే తనకు తోడుగా ఉంటుందని చెబుతూ ఆమె ఎమోషనల్ అయ్యారు. దీంతో, బయటకు ఎంతో నవ్వుతూ కనిపించే సాయి పల్లవి మనసులో ఇంతటి సున్నితత్వం, ఏదో తెలియని బాధ ఉన్నాయా? అని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.

## తిరుమలలో సింపుల్ గా బెల్లంకొండ శ్రీనివాస్ పెళ్లి?

టాలీవుడ్ యంగ్ అండ్ ఎనర్జిటిక్ హీరో బెల్లంకొండ శ్రీనివాస్ పెళ్లి వార్తలు ఇప్పుడు ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. డెస్టినేషన్ వెడ్డింగ్స్ హడావుడిలో ఉన్న నేటి కాలంలో, ఈ యువ హీరో మాత్రం ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమలలో అత్యంత నిరాడంబరంగా వివాహం చేసుకోవాలని నిర్ణయించుకోవడం విశేషం.


బెల్లంకొండ శ్రీనివాస్ తన మనసు గెలిచిన అమ్మాయి కావ్యను మనువాడబోతున్నారు. ఈ నెల మొదట్లో జరిగిన ఒక ఫ్యామిలీ ఫంక్షన్‌లో ఆమెను పరిచయం చేసినప్పుడే అందరూ అది నిశ్చితార్థం అనుకున్నారు, కానీ అది కేవలం ఇరు కుటుంబాలు కలుసుకున్న సందర్భం మాత్రమేనని ఆయన క్లారిటీ ఇచ్చారు. ఇక ఇప్పుడు పెళ్లికి సంబంధించిన కీలక తేదీలు బయటకు వచ్చాయి. ఏప్రిల్ 5న హైదరాబాద్‌లో బెల్లంకొండ శ్రీనివాస్ – కావ్యల నిశ్చితార్థం ఘనంగా జరగనుంది. ఏప్రిల్ 29న కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి సాక్షిగా తిరుమలలో వీరిద్దరి వివాహం చాలా సింపుల్‌గా, కేవలం సన్నిహితుల సమక్షంలో జరగబోతోంది. మే 1న హైదరాబాద్‌లో టాలీవుడ్ ప్రముఖులు, రాజకీయ నాయకుల కోసం భారీ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు.



## నాగశౌర్య 'బ్యాడ్ బాయ్ కార్తీక్' వచ్చేస్తున్నాడు..

అధికారికంగా ప్రకటించింది. ఏప్రిల్ 17న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు శు క్రవారం వెల్లడించింది. ఈ ప్రకటనతో నాగశౌర్య అభిమానులు, సినీ ప్రియులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.రామ్ దేశిన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ పతాకంపై శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. "విజయాన్ని, ఉత్సాహాన్ని, హై-వోల్టేజ్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను సెలబ్రేట్ చేసుకోవడానికి సిద్ధంగా ఉండండి" అంటూ నిర్మాణ సంస్థ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. ఇప్పటికే విడుదలైన టీజర్‌తో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి.

ఈ టీజర్‌లో నాగశౌర్య రగ్డ్, అగ్రెసివ్ లుక్‌లో స్టైలిష్‌గా కనిపించారు. యాక్షన్ సన్నివేశాలు, హై-ఆక్టేన్ మూమెంట్స్‌తో టీజర్ ఆకట్టుకుంది. నాగశౌర్యతో పాటు సముద్రఖని, నరేశ్, సాయికుమార్, వెన్నెల కిశోర్, బ్రహ్మాజీ వంటి కీలక నటీనటులు కనిపించడంతో, సినిమాలో యాక్షన్‌తో పాటు కామెడీ కూడా ఉంటుందని స్పష్టమవుతోంది.ఈ చిత్రంలో నాగశౌర్య సరసన విధి హీరోయిన్‌గా నటిస్తుండగా, తమిళ నటుడు సముద్రఖని 'వరదా రెడ్డి' అనే కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణ ప్రముఖ సంగీత దర్శకుడు హారిస్ జయరాజ్. చాలా కాలం తర్వాత ఆయన ఈ చిత్రంతో తెలుగులోకి రీఎంట్రీ ఇస్తున్నారు. రసూల్ ఎల్లోర్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.





Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,

Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com